www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 23-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 176

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: విదియ తె.4.52 తదుపరి తదియ; నక్షత్రం: హస్త మ.1.40 తదుపరి చిత్ర; వర్జ్యం: రా.10.32-12.18, దుర్ముహూర్తం: ఉ.8.31-9.19, రా.10.03-10.49, అమృతఘడియలు: ఉ.7.06-8.51; రాహుకాలం: మ.3.00-సా.4.30, సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.07

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి మృతి.. ఇద్దరూ కరీంనగర్ వాసులే.. 14
- రాజుదాదా, కోసా పేరిట 30 ఏళ్లుగా దండకారణ్యంలో ఉద్యమ జీవితం
- సీసీ సభ్యులిద్దరు ఒకే ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం పాతికేళ్లలో తొలిసారి
- ఒక్క నెల్లో నలుగురు సీసీ సభ్యులు మృతి.. మరో సీసీ సుజాత లొంగుబాటు
- కేంద్రకమిటీలో మిగిలింది ఇక ఎనిమిది మందే
- ఆయుధాలు దించేది లేదు.. సోనూది ఉద్యమ ద్రోహం: మావోయిస్టు పార్టీ



కట్టా రామచంద్రారెడ్డి



కడారి సత్యనారాయణ రెడ్డి



సచివాలయంలో సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వివేక్ తదితరులు

నాలుగు రోజుల్లోనే నోటిఫికేషన్!

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు కలెక్టర్ల ముమ్మర కసరత్తు

నేడు సర్కారుకు సీల్డ్ కవర్‌లో అందజేత.. పరిశీలించి జీవో ఇవ్వనున్న ప్రభుత్వం.. ఆ తర్వాత నోటిఫికేషన్!

రిజర్వేషన్లకు 6 రకాల నివేదికలిచ్చిన కమిషన్.. దాని ప్రకారమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల్లోనే నోటిఫికేషన్ విడుదల చేయనుందా? నేటి (మంగళవారం) సాయంత్రానికే రిజర్వేషన్లు ఖరారు కానున్నాయా? అంటే విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇప్పటికే మొదలైన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ మంగళవారం సాయంత్రానికి పూర్తి కానున్నట్లు తెలిసింది. ఆ వివరాలన్నీ ప్రభుత్వానికి సీల్డ్ కవర్లో అందనున్నాయి. వాటిని పరిశీలించిన అనంతరం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు జిల్లాల కలెక్టర్లకు తెలిపాయి. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాత.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తున్నామని తెలిపేలా సర్కారు ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయనుంది. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. కాగా, ఈ నెల 30లోగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన

మిగతా 13వ పేజీలో...

తగ్గే ఆదాయాన్ని కేంద్రమే భరించాలి

- కొత్త జీఎస్టీతో రాష్ట్రానికి ఏటా 7 వేల కోట్లు తగ్గనున్న ఆదాయం.. మీ చావు మీరు చావండంటే కుదరదు
- ఐదేళ్లపాటు వీజీఎఫ్‌తో అంతరాన్ని భర్తీ చేయాలి
- సింగరేణి లాభాల్లో కార్మికులకు 34% వాటా
- ఒక్కొక్కరికి రూ.1,95,610 లబ్ధి: సీఎం రేవంత్‌రెడ్డి

11

ఆర్ఆర్ఆర్‌కు ఒకే నంబరు!

- దక్షిణ భాగానికీ ఉత్తర భాగం నంబరే ఇవ్వాలి.. ఏకకాలంలో రెండింటి పనులకు సహకరించాలి
- ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరిన సీఎం.. వేగిరంగా భూసేకరణ, పరిహారం పంపిణీ
- అలసత్వం ప్రదర్శించే అధికారులపై వేటు.. హైవేలు, కోర్ అర్బన్ ప్రాంత అభివృద్ధిపై సీఎం సమీక్ష
- సమ్మక్క సాగర్‌కు ఎన్‌వోసీ!.. సూత్రప్రాయంగా ఛత్తీస్‌గఢ్ అంగీకారం 13
- ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంప్రదింపులు ఫలప్రదం

జీఎస్టీ బొనాంజా షురూ

- అమల్లోకి పన్ను సంస్కరణలు.. 375కు పైగా వస్తువుల ధరల్లో తగ్గుదల
- శరన్నవరాత్రుల ప్రారంభం, సెలవులతో పెద్దఎత్తున కొనుగోళ్లు చేపట్టిన ప్రజలు
- ఢిల్లీలో మార్కెట్లను సందర్శించిన కేంద్ర మంత్రులు నిర్మల, నడ్డా, వైష్ణవ్ 2

ఇక ఇంటింటా పొదుపు పండుగ.. ప్రజలకు రూ.2.5 లక్షల కోట్ల లబ్ధి: మోదీ



ఢిల్లీలోని లక్ష్మీనగర్‌లో ఓ దుకాణదారుతో నిర్మల

సొంత ప్రజలపైనే పాక్ బాంబుల దాడి

- కనీసం 30 మంది దుర్మరణం
- మృతుల్లో పిల్లలు, మహిళలు
- ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఓ గ్రామంపై 8 బాంబులు జారవేత
- పాక్ వైమానిక దళం నిర్వాకం

ఇస్లామాబాద్, సెప్టెంబరు 22: ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా పాకిస్థాన్ వైమానిక దళం జరిపిన బాంబుల దాడిలో ఆ దేశ ప్రజలు బలయ్యారు. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వాయుసేనకు చెందిన జేఎఫ్-17 ఫైటర్ జెట్లు ఎనిమిది ఎల్ఎస్-6 బాంబులు జారవిడవడంతో కనీసం 30 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. సోమవారం వేకువజామున 2 గంటల సమయంలో తిరా లోయలోని మాత్రె దారా అనే గ్రామంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో చాలామంది గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది. కాగా క్షతగాత్రుల పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు. సంఘటనా స్థలంలో మరణించిన చిన్నారులు సహా పలువురి మృతదేహాలు పడి ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అక్కడికి సహాయక బృందాలు చేరుకుని శిథిలాల కింద పడి ఉన్న మృతదేహాల కోసం గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. గతంలో కూడా ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఈ ప్రాంతంలో పాక్ జరిపిన వైమానిక దాడుల్లో చాలామంది అమాయకులు మరణించారు. డ్రోన్ల దాడులు చేసినపుడు దేశ పౌరుల ప్రాణాలు, ఆస్తులు కాపాడటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో పాకిస్థాన్ అధికారులు విఫలమయ్యారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 605 ఉగ్రవాద ఘటనలు జరగగా, కనీసం 138 మంది పౌరులు, 79 మంది పోలీసులు చనిపోయారని పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌తో పరార్

పాకిస్థాన్, పీవోకేలోని 9ప్రధాన ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాద సంస్థలు అక్కడి నుంచి తమ స్థావరాలు తరలించాయి. జైష్-ఏ-మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ సహా ఉగ్రవాద సంస్థలు అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో పర్వత ప్రాంతాలతో కూడిన ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి.

అవి చైనా బాంబులు..

పాక్ వాయుసేన ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఎల్ఎస్-6 బాంబులపై చర్చ మొదలైంది. ఎందుకంటే ఎల్ఎస్-6 (లీపీ) చైనాలో తయారైన బాంబులు. చైనా ఏరో స్పేస్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సీఏఎస్‌టీ) అనుబంధ సంస్థ లుయోయాంగ్ ఎలక్ట్రో ఆప్టిక్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఈవోటీడీసీ) వీటిని అభివృద్ధి చేసింది. ప్రెసిషన్ గైడెడ్ మ్యూనిషన్స్ (పీజీఎం) తరగతికి చెందిన దీన్ని 'థండర్ స్టోన్ బాంబ్' అని కూడా పిలుస్తారు. యుద్ధ విమానాల నుంచి ప్రయోగించే ఈ బాంబులు జీపీఎస్‌ను ఉపయోగించుకుని లక్ష్యాలను ఛేదిస్తాయి. ఎల్ఎస్-6 బాంబు పరిధి దాన్ని జారవిడిచే విమానం ఎత్తు, వేగంపై ఆధారపడి ఉంటుంది. 8 వేల మీటర్ల ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు ఇది 40 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదిస్తుంది. 10వేల మీటర్ల ఎత్తు నుంచి వదిలినప్పుడు దీని పరిధి 60 కిలోమీటర్ల వరకూ ఉంటుంది.

లోకం తీరు



పోలీసు రికార్డుల్లో నిందితుల కుల ప్రస్తావన వద్దు

- వాహనాలపై కులాల స్టిక్కర్లు ఉంటే ఫైన్: యూపీ సర్కారు

లఖ్‌నవూ, సెప్టెంబరు 22: ఉత్తరప్రదేశ్‌లో కుల వివక్ష నిర్మూలన లక్ష్యంతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పలు చర్యలు ప్రారంభించింది. కుల ఆధారిత వివక్షను నిర్మూలించాలంటూ గత మంగళవారం (ఈ నెల 16)న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుకు నడుం బిగించింది. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. పోలీసు రికార్డులు, పబ్లిక్ నోటీసుల్లో ఇకపై కుల ప్రస్తావన ఉండకూడదు. నిందితుల కులాన్ని పోలీసు రికార్డుల్లో రాయకూడదు. కేసు మెమోలు, అరెస్టు పత్రాలు, పోలీసు స్టేషన్ బోర్డుల్లో వారి కులాలను ప్రస్తావించకూడదు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)లో కులం అన్న కాలాన్ని ఖాళీగా ఉంచనున్నారు. రికార్డుల్లో మాత్రం నిందితుడి తండ్రి పేరుతో పాటు తల్లి పేరును కూడా రాయాల్సి ఉంటుంది. వాహనాలపై కులాల పేర్లు, నినాదాలు రాస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో కులాల పేర్లను సూచించే ప్రాంతాల బోర్డులు, చిహ్నాలను తొలగించాల్సి ఉంటుంది. రాజకీయ ఉద్దేశాలతో నిర్వహించే కుల సమావేశాలకు అనుమతి ఉండదు. వాటిని ప్రభుత్వం నిషేధించింది. కుల గౌరవాన్ని, కుల విద్వేషాన్ని ప్రేరేపిస్తూ సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను నిశితంగా పర్యవేక్షిస్తుంది.

ఎన్ఎస్‌సీఎన్(కే)పై నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (కప్లాంగ్)పై కేంద్రప్రభుత్వం మరో ఐదేళ్లపాటు నిషేధాన్ని పొడిగించింది. అదేవిధంగా ఎన్ఎస్‌సీఎన్(కే)కు చెందిన ఇతర సంస్థలు, విభాగాలకు కూడా ఈ నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు ఎన్ఎస్‌సీఎన్(కే) పాల్పడుతోందని వివరించింది. ఈ నిషేధం ఈ నెల 28 నుంచి ఐదేళ్లపాటు ఉంటుందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇండో-మయన్మార్ రీజియన్‌లోని కొన్ని ప్రాంతాలను కలుపుకొని ప్రత్యేక నాగాలాండ్‌ను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఎన్ఎస్‌సీఎన్(కే) పనిచేస్తోందని తెలిపింది. 2020, సెప్టెంబరు 28 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 మధ్య ఎన్ఎస్‌సీఎన్(కే)పై 71 కేసులు నమోదయ్యాయని, 56 చార్జిషీట్లు దాఖలయ్యాయని తెలిపింది.

సైనిక చర్య లేకుండానే పీవోకే స్వాధీనం

- మొరాకో పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: ఎటువంటి సైనిక చర్యలు లేకుండానే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, పీవోకే ప్రజలు 'మేము భారత్‌లో భాగమే' అని చెప్పుకొనే రోజు ఎంతో దూరంలో లేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సోమవారం మొరాకోలో పర్యటించిన ఆయన ఆ దేశ రక్షణ మంత్రి అబ్దెల్లిఫ్ లౌడియితో సమావేశం అయ్యారు. సైనిక సహకారానికి సంబంధించిన ఎంవోయూపై ఇరుదేశాల మంత్రులు సంతకాలు చేశారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో ఆయన మాట్లాడారు. "పీవోకే ప్రజలు ప్రస్తుత పాలనతో సంతోషంగా లేరు. వారు స్వేచ్ఛను కోరుకుంటున్నారు. పీవోకే దానంతట అదే భారత్‌లో భాగమవుతుంది. మనం పీవోకే మీద దాడి చేసి దాన్ని స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పీవోకేను తిరిగిపొందే అవకాశాన్ని కేంద్రప్రభుత్వం చేజార్చుకుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో రక్షణమంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

దాల్ సరస్సులో పాక్ క్షిపణి శకలాల లభ్యం

శ్రీనగర్, సెప్టెంబరు 22: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణి శకలాలు తాజాగా జమ్ము కశ్మీర్‌లోని దాల్ సరస్సులో లభ్యమయ్యాయి. ఆదివారం సరస్సును శుభ్రం చేస్తుండగా ఈ క్షిపణి అవశేషాలను గుర్తించారు. దానిలోని కీలక భాగాలను నిర్వీర్యం చేసి, సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. క్షిపణిలోని ఒక భాగాన్ని వైమానిక దళానికి అప్పగించినట్లు కూడా వారు వెల్లడించారు. దాల్ సరస్సు శ్రీనగర్‌లో ఒక ప్రధాన పర్యాటక కేంద్రం కావడంతో, క్షిపణి పేలి ఉంటే భారీ విపత్తు సంభవించి ఉండేదని అధికారులు చెప్పారు.

వచ్చే ఏడాది భారత్‌కు మరో ఎస్-400

మాస్కో, సెప్టెంబరు 22: భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వచ్చే ఏడాదికి ఎస్-400 క్షిపణి వ్యవస్థల సరఫరా పూర్తవుతుందని రష్యా రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. 2018లో కుదిరిన ఒప్పందం మేరకు రష్యా ఐదు ఎస్-400 ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేయాల్సి ఉంది. ఇప్పటికే నాలుగింటిని అప్పగించగా.. మరొకదానిని వచ్చే ఏడాది అందజేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ రష్యా అధికార వార్తాసంస్థ టాస్ వెల్లడించింది. మొత్తం ఐదు ఎస్-400ల విలువ దాదాపు రూ.40 వేల కోట్లు. ఇటీవల పాకిస్థాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల సమయంలో (ఆపరేషన్ సిందూర్‌లో) ఎస్-400లు భారత్‌కు బలమైన దన్నుగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో, మరిన్ని ఎస్-400ల కొనుగోలుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు రష్యాతో చర్చలు కూడా మొదలైనట్లు సమాచారం. మరోవైపు, అత్యాధునిక ఐదో తరం యుద్ధవిమానాలు ఎస్‌యూ-57లను భారత్‌కు సరఫరా చేయటమే గాక, వాటిని భారత్‌లో స్థానికంగా తయారుచేసే అంశంపై రష్యా ఒక ప్రతిపాదనను సమర్పించినట్లుగా టాస్ తెలిపింది.

హైకోర్టు జడ్జీల పనితీరుపై మదింపు అవసరం

- బెయిల్ పిటిషన్లకు వాయిదాలా: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: కొందరు హైకోర్టు న్యాయమూర్తుల పనితీరుపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కార్యభారం నిర్వహించలేక లక్ష్యాలను చేరుకోలేకపోతున్నార'ని వ్యాఖ్యానించింది. అందువల్ల వారి 'పనితీరును మదింపు వేయాల్సిన అవసరం ఉంద'ని అభిప్రాయపడింది. డెస్కులపై ఫైళ్లు పేరుకుపోకుండా చూసుకోవాలని హితవు చెప్పింది. ఓ క్రిమినల్ కేసులో తాము చేసిన అప్పీళ్లపై తుది వాదనలు విన్న ఝార్ఖండ్ హైకోర్టు ఏళ్ల తరబడి తీర్పును విలువరించడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. కొందరు జడ్జీలు రాత్రింబవళ్లు కష్టపడి పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరిస్తున్నారని తెలిపింది. మరికొందరు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అభిప్రాయపడింది. రోజుకు ఒక్క క్రిమినల్ కేసునే విచారిస్తానని ఎవరైనా జడ్జి అంటే అర్థం చేసుకోవచ్చని, అదే బెయిల్ మంజూరు కేసులను కూడా రోజుకు ఒక్క దాన్నే విచారిస్తానంటే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. అందువల్లనే 'పనితీరు మదింపు' ఉండాలని అభిప్రాయపడింది. అయితే ఏ ప్రాతిపదికన పనితీరును మదింపు చేయాలి, ఇందుకు మార్గదర్శకాలు ఏమిటన్నది పెద్ద సమస్య అని అభిప్రాయపడింది.

ఇక ఇంటింటా పొదుపు పండుగ

ఈసారి దసరాకు జీఎస్టీ సంస్కరణల జోష్.. దేశ ప్రజలకు 2.5 లక్షల కోట్ల ప్రయోజనం

- జీఎస్టీ 2.0 దేశమంతా అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' పేరిట ప్రధాని బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 : జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రతి ఇంటా పొదుపు పెరిగి, వ్యాపారాలకు ఊతం లభించనుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతి రాష్ట్రం ప్రగతిలో పరుగులు పెడుతుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి దేశమంతా అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' పేరిట దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. నవరాత్రుల తొలి రోజు బచత్ ఉత్సవ్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లోని ఇందిరాగాంధీ పార్కు ప్రాంతంలో తాను వ్యాపారులతో జరిపిన సంభాషణ ఫొటోలను 'ఎక్స్'లో ఆయన పంచుకున్నరు. "నవరాత్రులు మొదలయ్యాయి. ప్రతి కుటుంబానికీ ఈ సందర్భంగా మంచి జరగాలని కోరుకుంటున్నాను. దసరా ఈసారి మీ ఇంటికి రెట్టింపు ఆనందాలను తీసుకురానుంది. జీఎస్టీ 2.0 అమలులోకి రావడమే ఇందుకు కారణం. ప్రతి కుటుంబంలో పొదుపు పండుగ మొదలైంది. రైతులు, మహిళలు, యువత, పేదల నుంచి మధ్యతరగతి, వ్యాపారులు, చిన్న వర్తకుల (ఎమ్ఎస్ఎమ్ఈ)ల వరకు.. సమాజంలోని ప్రతి వర్గమూ ఈ సంస్కరణలతో ప్రత్యక్షంగాను, పరోక్షంగా లబ్ధి పొందనుంది. ప్రతి ఒక్కరికీ వికాసం.. మదుపులో గొప్ప వృద్ధి....ప్రతి రాష్ట్రమూ, ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లను రెండు శ్లాబులకు కుదించడం వల్ల సామాన్యులు వినియోగించే నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయి" అని మోదీ తెలిపారు. ఆహార ఉత్పత్తులు, ఔషధాలు, సబ్బులు, టూత్‌పేస్టులు, బీమా ఇంకా మరి కొన్ని వస్తువులు, సేవలపై జీరో జీఎస్టీ లేదా ఐదుశాతం నామమాత్రం పన్ను మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వంటింటి ఖర్చులు తగ్గడం మహిళలకు ఊరటని ఇస్తోందన్నారు. గత ఐదేళ్లలో 25 కోట్ల మంది దారిద్ర్యరేఖ నుంచి బయటకు వచ్చారని ప్రధాని తెలిపారు. ఆదాయ పన్నుల్లో మినహాయింపుల వల్ల 12 లక్షల వార్షికాదాయంపై పన్ను చెల్లించాల్సిన పనిలేదని, దీనివల్ల మధ్యతరగతి బలోపేతమైందని తెలిపారు. "ఆదాయ పన్నుల్లో మినహాయింపులు, జీఎస్టీ సంస్కరణల లబ్ధిని కూడా కలుపుకొంటే దేశ ప్రజలకు 2.5 లక్షల కోట్ల లబ్ధి చేకూరనుంది. ఇంటి ఖర్చుల తగ్గి, పొదుపు పెరగడం వల్ల సొంతిల్లు ఏర్పాటుచేసుకోవచ్చు. కొత్త వాహనాలు, వివిధ రకాల ఉపకరణాలు కొనుగోలు చేయవచ్చు. సరదాగా కుటుంబంతో బయటకు వెళ్లి ఇష్టమైన ఆహారం తీసుకోవచ్చు. విహారయాత్రలకు ప్రణాళికలు రచించవచ్చు" అని ప్రధాని తెలిపారు. జీఎస్టీ ప్రయాణం 2017లో మొదలయిందన్న ఆయన, సాలెగూడులా తయారైన బహు పన్నుల చెల్లింపు చిక్కుల నుంచి వ్యాపారాలకు, పౌరులకు దీనివల్ల ఊరట అందించిందన్నారు. "ఒక దేశం - ఒకే పన్ను".. అనేది పన్నుల విధానాన్ని సరళతరం చేయడంతోపాటు ప్రజలకు గొప్ప ఊరట అందించింది. ఈ విధానం దేశాన్ని ఆర్థికంగా సమైక్యపరిచింది. కేంద్ర, రాష్ట్రాల సహకారంతో జీఎస్టీ మండలి ప్రజానుకూల విధానాలనెన్నింటినో రూపొందించింది. పొదుపును ప్రజల చేతుల్లో ఉంచింది" అని శ్లాఘించారు. ఇదంతా 'వికసిత్ భారత్-2047' లక్ష్యసాధనలో భాగంగా ఆత్మనిర్భర్ భారత్‌కు బాటలు వేస్తూ స్థానిక ఉత్పత్తి రంగానికి జీఎస్టీ ఊతం ఇవ్వనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు. "మేడిన్ ఇండియా ఉత్పత్తులనే విక్రయించాలని దుకాణదారులను, వ్యాపారులను కోరుతున్నాను. కొనేదీ, అమ్మేదీ స్వదేశీయే కావాలి. స్థానిక ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహిస్తూ, పెట్టుబడుల వాతావరణం ఏర్పడేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి" అని ప్రధాని మోదీ కోరారు.



ఇండీ కూటమి అసంతృప్తి: అశ్వినీ వైష్ణవ్

ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు, పన్నుల తగ్గింపు పట్ల ఇండీ కూటమి సంతోషంగా లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. యూపీఏ పదేళ్ల పాలనలో పన్నులు తగ్గించలేదని, సంస్కరణలు చేపట్టలేదని విమర్శించారు. యూపీఏ హయాంలో సిమెంట్‌పై 30% పన్ను వసూలు చేస్తే, ఇప్పుడు 18% ఉందని చెప్పారు. శానిటరీ ప్యాడ్లపై యూపీఏ ప్రభుత్వం 13 శాతం ట్యాక్స్ వేయగా, తమ ప్రభుత్వం పన్ను వసూలు చేయట్లేదని తెలిపారు. కాఫీపై పన్ను 30 నుంచి 5 శాతానికి తగ్గిందన్నారు.

జీఎస్టీ బొనాంజా షురూ

- అమల్లోకి పన్ను సంస్కరణలు
- 375కు పైగా వస్తువుల ధరల్లో తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఫలితంగా టూత్‌పేస్ట్ నుంచి కార్ల దాకా 375కు పైగా వస్తువుల ధరలు తగ్గాయి. గతంలో 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లను 5, 18 శాతానికి పరిమితం చేయడంతో దాదాపు 99 శాతం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయి. నిత్యావసర వస్తువుల తయారీ సంస్థలు, కార్ల కంపెనీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థలు, ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను తగ్గించేశాయి. జీఎస్టీ రేట్ల తగ్గింపునకు ఈ నెల 3న ఆమోదం తెలిపిన జీఎస్టీ మండలి.. ఈ నెల 22 (సోమవారం) నుంచి తగ్గింపు అమల్లోకి వస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొనుగోళ్లను వాయిదా వేసుకున్న సామాన్యులు.. షాపింగ్ మాళ్ల బాట పట్టారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడం, విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో కుటుంబసభ్యులతో కలిసి కొనుగోళ్లు చేపట్టారు. జీఎస్టీ పొదుపు ఉత్సవ ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఢిల్లీలోని వ్యాపార సముదాయాలను సందర్శించారు. జీఎస్టీ సంస్కరణలు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలవుతున్నాయా? లేదా? అని వినియోగదారులను ఆరా తీశారు. లక్ష్మీనగర్‌లో వ్యాపారులు, సామాన్య ప్రజానీకంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మాట్లాడారు. ప్రధాని పిలుపు మేరకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. అమర్‌కాలనీలో వ్యాపారులతో సమావేశమైన జేపీ నడ్డా.. జీఎస్టీ సంస్కరణలు దేశ ప్రజలకు అందేలా చూడాలని కోరారు. నిత్యావసరాల్లో 99 శాతం వస్తువులపై పన్నులు తగ్గాయని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ప్రభుత్వ అంచనా ప్రకారం ఓ కుటుంబానికి అవసరమైన నిత్యావసరాలు, కిరాణా తదితర బిల్లులు 13 శాతం తగ్గనున్నాయి.

దేశంలో మూడింట రెండు వంతులు

పనిచేసే వయసువారే

- తొలి మూడు రాష్ట్రాల్లో ఢిల్లీ, తెలంగాణ, ఏపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: దేశ జనాభాలో పని చేసే వయసు ప్రజలు మూడింట రెండు వంతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 66 శాతం మంది పని చేసే వయసు (15-59) విభాగంలో ఉన్నారని నమూనా నమోదు సిస్టం గణాంక నివేదిక 2023 వెల్లడించింది. ఈ విభాగంలో ఢిల్లీలో ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు. తర్వాత స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ఇక బాలల విభాగంలో జనాభా భారీగా తగ్గిపోయింది. మొత్తం జనాభాలో 0-14 ఏళ్ల విభాగంలో 24.2 శాతం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. పని చేసే విభాగంలో ప్రజల సంఖ్య మాత్రం పెరిగింది. నివేదిక ప్రకారం.. ఢిల్లీలో 70.8% వర్కింగ్ ఏజ్‌లో ఉన్నారు. తెలంగాణలో 70.2 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 70.1 శాతం ప్రజలున్నారు. మొత్తం జనాభాలో పట్టణ వర్కింగ్ ఏజ్ గ్రూప్ జనాభా 68 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 64 శాతం ప్రజలు నివసిస్తున్నారు.

25 లక్షల కొత్త 'ఉజ్వల' కనెక్షన్లు

- నవరాత్రుల సందర్భంగా పంపిణీ
- కేంద్ర మంత్రి హర్దీప్ పూరీ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: నవరాత్రుల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద మరో 25 లక్షల కొత్త ఉచిత ఎల్పీజీ కనెక్షన్లను పంపిణీ చేయనున్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. సోమవారం తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్టును షేర్ చేస్తూ.. దీని ద్వారా మొత్తం 'ఉజ్వల' కుటుంబాల సంఖ్య 10.60 కోట్లకు చేరుకుంటుందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతి కొత్త ఎల్పీజీ కనెక్షన్‌పై రూ.2,050 ఖర్చు చేయనుందని తెలిపారు. శుభప్రదమైన నవరాత్రుల సందర్భంగా ఇస్తున్న 25 లక్షల కొత్త ఉచిత పీఎం ఉజ్వల కనెక్షన్లు.. ప్రధాని నరేంద్ర మోదీ దుర్గాదేవిలాగే మహిళలను గౌరవిస్తారనే దానికి మరో ఉదాహరణగా పేర్కొన్నారు.

కుల రిజర్వేషన్లు పొందకపోవడం బ్రాహ్మణుడిగా నాకు అతిపెద్ద వరం

నాకు కులమతాలపై విశ్వాసం లేదు: గడ్కరీ

నాగపూర్, సెప్టెంబరు 22: బ్రాహ్మణులకు కుల ఆధారిత రిజర్వేషన్లు లేకపోవడం ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా తనకు దేవుడిచ్చిన అతిపెద్ద వరం అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మరాఠా, ఓబీసీ, బంజారా రిజర్వేషన్లపై మహారాష్ట్రలో రాజకీయం వేడెక్కిన తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నాగపూర్‌లో సోమవారం జరిగిన హల్బా సమాజ్ మహాసంగ్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. తనకు కులమతాల పట్ల విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఎవ్వరు కూడా కులాన్నో, మతాన్నో, భాషనో ఆధారంగా చేసుకొని గొప్పవారు కాలేరని.. కేవలం తమలోని లక్షణాల వల్లే గొప్పవారు అవుతారని నొక్కి చెప్పారు. తాను బ్రాహ్మణుడినని, బ్రాహ్మణులకు కుల ఆధారిత రిజర్వేషన్లు లేకపోవడమనేది తనకు జీవితంలో దేవుడిచ్చిన అతిపెద్ద వరమని వెల్లడించారు.

భారత ఐటీ రంగంపై హెచ్-1బీ పిడుగు!

- రూ.25 లక్షల కోట్ల వ్యాపారంపై ప్రభావం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఐటీ నిపుణులు

బెంగళూరు, సెప్టెంబరు 22: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసాల విషయంలో తీసుకున్న నిర్ణయం భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం చూపించనుందని నిపుణులు, ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికా నుంచి ఐటీ రంగం లబ్ధి పొందిందని, తాజాగా హెచ్-1 బీ వీసాకు లక్ష డాలర్ల రుసుమును నిర్ధారించడంతో ఈ రంగంపై పిడుగు పడినట్టు అయిందని చెబుతున్నారు. అమెరికా వర్క్ వీసా కార్యక్రమాలు, సాఫ్ట్ వేర్ ఔట్ సోర్సింగ్, వ్యాపార సేవలు తదితరాల రూపంలో భారత ఐటీ సెక్టార్ 283 బిలియన్ డాలర్ల(రూ.25 లక్షల కోట్లు) వ్యాపారం చేస్తోందని, తాజా పరిణామాలతో దీనిపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు. భారత దేశ మొత్తం ఐటీ రంగం వాటాలో 57శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తోందని తెలిపారు. కాగా, గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే హెచ్-1బీ వీసాల విషయంలో భారత్ 71 శాతంతో అతిపెద్ద లబ్ధిదారుగా ఉందని చెబుతున్నారు. కేవలం 11.7 శాతం లబ్ధితో చైనా రెండోస్థానంలో ఉందని నిపుణులు తెలిపారు. మరోవైపు, యాపిల్, జేపీమోర్గాన్, వాల్‌మార్ట్, మైక్రోసాఫ్ట్, మెటా, అల్ఫాబెట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలపై ట్రంప్ ఒత్తిడి పెరిగింది. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు విదేశీయులను తగ్గించుకోవాలని, ఈ మేరకు మార్పులు చేసుకోవాలని కూడా వైట్‌హౌస్ పేర్కొంది. ఇది కూడా భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో ఉద్యోగం చేయాలన్న భారతీయుల కల చేజారుతోందని ఐటీ ఔట్‌సోర్స్ కంపెనీ జెన్సార్ టెక్నాలజీస్ సీఈవో గణేష్ నటరాజన్ తెలిపారు. ఔత్సాహికుల అమెరికా కల సంక్లిష్టంగా మారిందన్నారు. భారత్, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి నిపుణులైన ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీలు పరిమితి పాటించనున్నాయని తెలిపారు. ఇదిలావుంటే, నాస్కామ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించింది. హెచ్-1బీ వీసా రుసుము పెంచడంతో అమెరికాను నిపుణుల కొరత వెంటాడుతుందని తెలిపింది. దీని ప్రభావం అమెరికా ఆవిష్కరణలు, ఐటీ రంగంపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'ఎంకే' గ్లోబల్ చీఫ్ ఎకానమిస్ట్ మాధవి అరోరా స్పందిస్తూ.. ప్రపంచ వాణిజ్యం సహా సాంకేతిక యుద్ధంలోకి సేవల ఎగుమతులు కూడా చేరే అవకాశం ఉందన్నారు. సప్లయ్ చైన్(సరఫరా వ్యవస్థ)పై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ఇలా చాలా మంది నిపుణులు ట్రంప్ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీ ఒప్పందాలు సహా ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో భారత్‌కు చెందిన హెచ్-1బీ వీసా హోల్డర్లు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫలితంగా చెల్లింపులు కూడా తగ్గుతాయన్నారు.



వీసా ఫీజును ఎత్తివేసే యోచనలో బ్రిటన్

కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ట్రంప్ లక్ష డాలర్లకు పెంచి హడలెత్తిస్తున్న నేపథ్యంలో బ్రిటన్ ప్రభుత్వం ఇందుకు భిన్నమైన పంథాలో ముందుకెళ్లాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించే ప్రయత్నాలను బ్రిటన్ ప్రభుత్వం ముమ్మరం చేయాలనుకుంటోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి సైన్స్, టెక్నాలజీ నిపుణులను తమ దేశానికి ఆకర్షించేందుకుగాను వీసా ఫీజును మినహాయించే దిశగా యోచన చేస్తున్నట్టుగా 'ఫైనాన్షియల్ టైమ్స్' కథనం పేర్కొంది. ఇందులో భాగంగా భారతీయులు సహా ప్రపంచ నిపుణులను ఆకర్షించడంపై గ్లోబల్ టాలెంట్ టాస్క్‌ఫోర్స్ దృష్టిసారించినట్టు తెలిపింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే మార్గాలను అన్వేషించేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. ఇది ప్రధాని కీర్ స్టార్మర్, చాన్స్‌లర్ రాచెల్ రీవ్స్‌కు నేరుగా నివేదిస్తుంది. వీసా ఖర్చులను సున్నాకు తగ్గించే యోచన చేస్తున్నట్టుగా ప్రభుత్వ అధికారిని ఉటంకిస్తూ ఆ ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది.

అసమగ్ర సమాచారం వల్లే పైలట్లపై నిందలు

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికలోని సమాచారం సమగ్రంగా కాకుండా ముక్కలు ముక్కలుగా వెల్లడికావడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలా చేయడం వల్ల పైలట్లదే తప్పు అన్న వ్యాఖ్యానాలు మీడియాలోవచ్చాయని తెలిపింది. ఎంపిక చేసిన విధంగా సమాచారాన్ని ప్రచురించడం 'దురదృష్టకరం, బాధ్యతారాహిత్యమ'ని వ్యాఖ్యానించింది. జూన్ 12వ తేదీన జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాదంపై స్వతంత్రంగా, స్వేచ్ఛగా, సత్వరమే దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీనిపై సమాధానం చెప్పాలని కేంద్రం, డీజీసీఏలకు నోటీసులు ఇచ్చింది. సేఫ్టీ మేటర్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కెప్టెన్ అమిత్ సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) జూలై 12న విడుదల చేసిన ప్రాథమిక నివేదిక 'ఎంపిక చేసిన విధం'గా ఉందని ధర్మాసనం తెలిపింది. "ఇలాంటి సందర్భాల్లో దర్యాప్తు పూర్తయ్యే వరకు నివేదికలను రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే..బాధిత కుటుంబాల వ్యక్తిగత గోప్యత, ప్రతిష్ఠ ఇందులో ఇమిడి ఉంటాయి. అందుకే తుది నివేదిక వచ్చే వరకు మనం వేచి చూడాలి" అని తెలిపింది. అంతకు ముందు పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ఒక కోణంలోనే దర్యాప్తు నివేదిక విడుదల చేశారని తెలిపారు. ఆ కారణంగానే పైలట్లదే తప్పన్నట్టుగా ప్రపంచవ్యాప్తంగా మీడియాలోవిశ్లేషణ జరిగిందని చెప్పారు. దుర్ఘటన జరిగిన 100 రోజులు దాటినా ఇంకా ప్రమాదానికి కారణమేమిటోతెలియదని చెప్పారు. ప్రమాదంపై దర్యాప్తునకు అయిదుగురు సభ్యులతో బృందాన్ని నియమించగా అందులో ముగ్గురు విమానయాన నియంత్రణ సంస్థకు చెందిన వారు ఉన్నారని, ప్రమాదానికి బాధ్యత వహించాల్సిన సంస్థల ప్రతినిధులే దర్యాప్తు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అందువల్ల స్వతంత్ర కమిటీతో దర్యాప్తు చేయించాలని కోరారు.

విమానం ల్యాండింగ్ గేర్ బాక్సులో అఫ్ఘాన్ బాలుడి సాహసం

- కాబూల్ నుంచి ఢిల్లీ రాక.. సరదాకేనని వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: సరదా కొద్దీ విమానం కింది భాగంలో టైర్ల వద్ద ఉండే ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్‌లో దాక్కొన్న ఓ 13 ఏళ్ల అఫ్ఘానిస్థాన్ పెద్ద సాహసమే చేశాడు. అందులో రెండు గంటల పాటు కూర్చొని కాబూల్ నుంచి ఢిల్లీ చేరుకున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఇక్కడి విమానాశ్రయంలో దిగాడని, తిరిగి రాత్రి అదే విమానంలో తిప్పి పంపామని సోమవారం అధికారులు తెలిపారు. కందూజ్ పట్టణానికి చెందిన ఆ బాలుడు ఎలాగోలాగ కాబూల్ విమానాశ్రయం లోపలికి వెళ్లి ఢిల్లీ బయలుదేరే కేఏఎం విమానం వద్దకు చేరుకున్నాడు. టైర్ల మీదుగా ఎక్కి గేర్ కంపార్టుమెంటులోకి కూర్చొన్నాడు. అది ఢిల్లీలో ల్యాండ్ అయిన తరువాత కిందికి తిగి అక్కడ తచ్చాడుతుండగా భద్రత సిబ్బంది పట్టుకొని విచారించారు. సరదా కోసం ఎక్కానని చెప్పాడు. అనంతరం క్షుణ్ణంగా తనిఖీలు చేయగా అక్కడ ఎర్ర రంగులో ఉన్న చిన్న స్పీకర్ కనిపించింది. ఎలాంటి విద్రోహ చర్యలు లేవని ధ్రువీకరించిన తరువాతే విమానం ఎగిరేందుకు అనుమతి ఇచ్చారు.

రెండేళ్లలో ఏపీ బ్రాండ్ క్వాంటమ్ కంప్యూటర్

» క్వాంటమ్ వ్యాలీగా రాష్ట్రం
» 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో ఆరు, ఏడు దేశాలు మాత్రమే క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా ఏపీ మారనుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ఐటీ సమాచార మంత్రిత్వశాఖ విశాఖపట్నంలో సోమవారం ప్రారంభించిన రెండు రోజుల 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. 'సివిల్ సర్వీసెస్-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఎం ప్రసంగించారు. భారత్‌లో టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకోవడంలో తనతో పోటీ పడే ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. అప్పట్లో కర్ణాటక సీఎం ఎంఎస్ కృష్ణ సైతం 'మీతో పోటీ పడలేక పోతున్నాం' అనేవారని చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "సమాచార సాంకేతిక రంగంలో సంస్కరణల అమలు ద్వారా ప్రజా జీవనంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన పార్టీగా తెలుగుదేశం చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. తొలుత ఈ-సేవ, ఆ తరువాత మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందించాం. ఇప్పుడు మన మిత్ర ద్వారా 751 సేవలు వాట్సాప్ ద్వారానే అందించడానికి ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి ఏపీలో ఐటీపై దృష్టి పెట్టి హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించాం. ఇప్పుడు నాలెడ్జి ఎకానమీపై దృష్టి పెట్టి క్వాంటమ్ వ్యాలీ రూపొందిస్తున్నాం. అమెరికాకు సిలికాన్ వ్యాలీలా.. ఏపీకి క్వాంటమ్ వ్యాలీ పేరుతెస్తుంది. క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఏఐను అనుసంధానం చేస్తున్నాం. ఇది అపూర్వమైన కాంబినేషన్. రాబోయే పదేళ్లు చాలా కీలకం. ఆ తరువాత ప్రపంచమే మారిపోతుంది" అని అన్నారు. "అమెరికా, చైనా తరువాత ఏఐని ఉపయోగించేది భారతే. కోడింగ్, అల్గారిథమ్స్‌లో మనం చాలా బలంగా ఉన్నాం. త్వరలో సెమీ కండక్టర్ రంగంలోకీ ఏపీ అడుగు పెడుతుంది. ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ స్వదేశీ తయారీని ప్రోత్సహిస్తున్నారు. దీనిని అన్ని రంగాలకు విస్తరిస్తాం. పెద్దఎత్తున స్వదేశీ బ్రాండ్లు తయారుచేసి ప్రపంచ దేశాలకు అందించాలని పిలుపునిస్తున్నాను. ఏపీ ప్రభుత్వం 'సంజీవని' పేరుతో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తోంది దీన్ని మొదట ఏపీలో అమలు చేసి, ఆపై ఇతర రాష్ట్రాలకూ అందిస్తాం" అని చంద్రబాబు తెలిపారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్ శర్మ కన్నుమూత

» ప్రసార భారతి సీఈవోగా సేవలు
» నవోదయ విద్యాలయాలు, ఎస్వీబీసీ స్థాపనలో ప్రముఖ పాత్ర


సుబ్రహ్మణ్య శర్మ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రసార భారతి సీఈవోగా సేవలు అందించిన కంభంపాటి సుబ్రహ్మణ్య శర్మ (80) ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ శనివారం రాత్రి బంజారాహిల్స్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. పరిపాలనా రంగంలో కేఎస్ శర్మగా సుపరిచితులైన ఆయన 1968 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టరుగా, కేంద్ర విద్యా శాఖ కార్యదర్శిగా సేవలందించారు. నవోదయ విద్యాలయాల స్థాపనలో ముఖ్య పాత్ర పోషించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కార్యాలయం ముఖ్య అధికారిగానూ పనిచేశారు. ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా పలు సంస్కరణలకు నాంది పలికారు. దూరదర్శన్ డైరెక్ట్ టు హోమ్ సేవలు శర్మ సారథ్యంలోనే ప్రారంభమయ్యాయి. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ (ఎస్వీబీసీ) వ్యవస్థాపక సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు12లోని స్వగృహంలో కేఎస్ శర్మ భౌతికకాయానికి సీనియర్ ఐఏఎస్ సీవీఎస్‌కే శర్మ, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పి.మధుసూదనరావు, ఆకాశవాణి మాజీ సంచాలకుడు పీఎస్ గోపాలకృష్ణ, ఆల్ ఇండియా రేడియో మాజీ ఉద్యోగులు భండారు శ్రీనివాసరావు, సుధామ, ఈమని కృష్ణారావు తదితరులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సోమవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో శర్మ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

అసెంబ్లీ ఆవరణలో బతుకమ్మ సంబురాలు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో సోమవారంనాడు అసెంబ్లీ సచివాలయ ఉద్యోగులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అన్నారు.

గాజులరామారం ఆక్రమణలు
రౌడీ షీటర్లు, నేతల పనే!

అందరి పేర్లతో ప్రభుత్వానికి నివేదిక.. అమ్మినవారిపై బాధితులు ఫిర్యాదు చేయొచ్చు

» అప్పుడు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
» కూల్చివేతలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం
» చెరువులు, నాలాలు ఆక్రమిస్తే వదలం: హైడ్రా కమిషనర్ రంగనాథ్
» మళ్లీ హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుపడతా: కల్వకుంట్ల కవిత
» పేదల జీవితాలతో ఆటలేమిటి? ఎంపీ ఈటల మండిపాటు

హైదరాబాద్ సిటీ, గాజులరామారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం కూల్చివేతలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని, కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మండిపడ్డారు. కబ్జాకు గురైన చోట 900 నివాసాలు ఉన్నట్టు గుర్తించామని, ఇందులో కుటుంబాలు నివసించని 260 నిర్మాణాలను మాత్రమే కూల్చివేశామని.. ఇవన్నీ కబ్జాదారులు చెరబట్టినవేనని వివరించారు. ప్రజలు నివాసముండే ఇళ్ల జోలికి వెళ్లొద్దన్న ప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి పని చేస్తున్నామని.. అయితే కొందరు పనిగట్టుకొని పిల్లలతో మాట్లాడించి, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారని పేర్కొన్నారు. "ఇంకెన్నాళ్లు చెరువులు, నాలాల ఆక్రమణలను ఉపేక్షిస్తాం? హైదరాబాద్ మంచి కోసం పని చేస్తున్నాం. అందుకే ఇలాంటి ఆరోపణలు, దుష్ప్రచారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు. గాజులరామారంలో రాష్ట్ర ఆర్థిక సంస్థ(ఎస్ఎఫ్‌సీ) భూమిని ఆక్రమించింది స్థానిక రౌడీషీటర్లు, రాజకీయ నాయకులేనని తెలిపారు. ఎవరు ఆక్రమించారు? ఎలా ప్లాట్లు చేసి విక్రయించారు? ప్రజలను ఎలా మోసం చేశారు? అనే వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్లాట్లు ఎవరు అమ్మారు? ఎంతకు విక్రయించారనే వివరాలతో ఫిర్యాదు చేస్తే.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్ విజ్ఞప్తి మేరకే గాజులరామారంలో ఆక్రమణల తొలగింపునకు హైడ్రా బృందాలు వెళ్లాయని చెప్పారు. ఎమ్మెల్యే గాంధీకి చెందిన 12 ఎకరాల లే అవుట్, ఇతర నాయకుల ప్లాట్లను హైడ్రా ముట్టకోలేదని ఎమ్మెల్సీ కవిత ఆరోపిస్తున్నారన్న వ్యాఖ్యలను ప్రస్తావించగా ఆయన సమాధానాన్ని దాటవేశారు. హైడ్రా ఏర్పాటైన 14 నెలల్లో 96 డ్రైవ్‌లు నిర్వహించి 581 ఆక్రమణలు తొలగించామని, తద్వారా రూ.45 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల విలువైన 923.14 ఎకరాల భూములు కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. చెరువులు, పార్కులు, నాలాలు, రోడ్లు, ప్రభుత్వ భూములు, అక్రమ లే అవుట్లకు సంబంధించి ప్రజావాణి, వాట్సాప్, ఎక్స్ మెయిల్, పోస్టు, వ్యక్తిగతంగా కలిసి ఇచ్చిన ఫిర్యాదులు 5వేల వరకు ఉన్నాయని, ఇందులో 75 శాతం ఫిర్యాదులు పరిష్కరించినట్టు తెలిపారు. కాగా హైడ్రా పేరు చెప్పి దందాలకు పాల్పడిన వారిపై పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విచారణ జరుగుతోందని కమిషనర్ చెప్పారు. వర్టెక్స్ వాసవి, వంశీరామ్ బిల్డర్స్ సంస్థల నాలా/చెరువుల ఆక్రమణలు తొలగించడంతోపాటు.. ఆ సంస్థలపై 11 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. హైడ్రాను మేనేజ్ చేయొచ్చునని చెప్పే వారు ఎవరూ ఉండరని, భవిష్యత్తు తరాల ఆరోగ్యకరమైన జీవనం, సుస్థిర హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని ఉద్ఘాటించారు. నిజంగానే హైడ్రా లాలూచీ పడితే.. ఎవరిని ఎక్కడ కలిసింది? టవర్ లొకేషన్, వాట్సప్/టెక్ట్స్ మెస్సేజ్‌లు, కాల్స్ వివరాలు సేకరించి నిరూపించవచ్చని, ఈ విషయంపై శాస్త్రీ విచారణ జరపాలని పోలీసులను కోరుతున్నానని చెప్పారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించింది ఎవరైనా వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న రంగనాథ్


బాధితులతో మాట్లాడుతున్న కవిత

పెద్దలను వదిలేసి పేదలపై ప్రతాపమా?: కవిత

పేద ప్రజలపై మళ్లీ హైడ్రా బుల్డోజర్ వస్తే మొదట తానే అడ్డుపడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం గాజులరామారం సర్వే నంబరు 307లో బాలయ్యనగర్, నర్సింహ బస్తీ, రాజారాజేందర్ బస్తీల్లో హైడ్రా కూల్చి వేసిన ప్రాంతాలను కవిత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ చుట్టు పక్కల ఉన్న 400 ఎకరాలు కబ్జా అయినా పట్టించుకోని హైడ్రా, ఉన్న పళంగా పేదవాళ్ల ఇళ్ల మీద పడి కూల్చివేయడం దారుణం అన్నారు. మూసీ బాధితులకు ఇచ్చినట్లుగా ఇక్కడి బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ 12 ఎకరాలను కబ్జా చేశారని, దమ్ముంటే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. కాగా, పేదల జీవితాలతో హైడ్రా ఆడుకోవొద్దని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గాజులరామారంలో కూల్చివేతల బాధితులను ఆయన పరామర్శించారు. మూడు వందల ఇళ్లు కూల్చివేసి, రూ.15వేల కోట్ల విలువైన భూమిని కాపాడానని ట్విటర్‌లో పోస్టు చేసినందుకు కమిషనర్ రంగనాథ్‌కు సిగ్గు పడాలని మండిపడ్డారు.

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



» సీనియర్ల ర్యాగింగ్‌కు బలైన ఉట్నూర్ యువకుడు
» నిందితులను కఠినంగా శిక్షించాలి: లంబాడీ ఆదిలాబాద్ జేఏసీ


జాదవ్ సాయితేజ(ఫైల్)

ఉట్నూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం పంచాయతీ విద్యార్థి జాదవ్ సాయి తేజ ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉట్నూర్‌లో డీఎంఎల్టీగా రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తూ లక్కారం పంచాయతీలోని వేణునగర్‌లో జీవిస్తున్న జాదవ్ ప్రేమ్ సింగ్, కష్టనష్టాలకోర్చి కొడుకు జాదవ్ సాయితేజను పదో తరగతి వరకూ ఉట్నూర్ పట్టణంలోని ప్రైవేటు కాలేజీలోనే చదివించారు. మరో ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన సాయితేజ.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారపల్లిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. సమీప ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న సాయితేజను కొందరు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేయడంతోపాటు మద్యం పార్టీ బిల్లు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆయన ఆదివారం రాత్రి హాస్టల్‌లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంగతి తెలియగానే తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లారు. కేసు నమోదు చేసుకున్న మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తండ్రి ప్రేమ్‌సింగ్ చెప్పారు. తన కుమారుడి ఆత్మహత్యకు కారకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.కోటి నష్ట పరిహారం చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని లంబాడీ జేఏసీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నరేశ్‌యాదవ్, బానోతు జగన్ నాయక్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్ డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టాల్సి వస్తుందన్నారు.

జాతీయ రహదారిపై అదుపు తప్పి.. డివైడర్ దాటి మరో కారు మీద పడిన కారు

» ఇద్దరి మృతి.. ఎయిర్‌పోర్ట్‌కు వెళుతుండగా దుర్ఘటన



రంజిత్ రెడ్డి, హారిక రెడ్డి(ఫైల్)

రాజాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెళుతోన్న కారు అదుపు తప్పి డివైడర్ దాటి మరో కారుపై పడడంతో అందులో ప్రయాణిస్తోన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం ఈ ప్రమాదం జరిగింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన రంజిత్ రెడ్డి(34) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పెద్దల పండుగకు భార్య చైతన్య, కుమార్తెలతో కలిసి 20వ తేదీన అత్తగారి ఊరైన పెద్దమందడి మండలంలోని వెల్టూరుకు వచ్చారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతడి మరదలు హారికారెడ్డి(23) కూడా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు అతడితో పాటు బయలుదేరింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న మరో కారు జాతీయ రహదారిపై రాజాపూర్ మండల కేంద్రం వద్ద అదుపు తప్పి డివైడర్ మీదుగా దూసుకొచ్చి వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో వీరి కారు నుజ్జునుజ్జయి ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మాధవరెడ్డి క్షేమంగా ఉన్నాడు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని కారులో నుంచి మృతదేహాలను వెలికితీసి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

పోలీసులపై వలస కార్మికుల రాళ్ల దాడి

» కర్రలతో వెంబడించిన యూపీ, బిహార్ కార్మికులు
» ఎస్సై, కానిస్టేబుల్, హోంగార్డులకు స్వల్పగాయాలు
» కూలీ మృతి.. రూ.25 లక్షల పరిహారం కోసం డిమాండ్
» సూర్యాపేట జిల్లా పాలకవీడులో డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఘటన



కార్మికులు కర్రలతో దాడికి దిగడంతో పరుగెడుతున్న కానిస్టేబుల్, దాడిలో ధ్వంసమైన పోలీసు వాహనం

పాలకవీడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన కార్మికుడికి నష్టపరిహారం కోసం ఉత్తరప్రదేశ్, బిహార్ వలస కార్మికులు చేస్తున్న ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. కార్మికులను అదుపు చేసేందుకు యత్నించిన పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. వలస కార్మికుల దాడిలో ఎస్సై, కానిస్టేబుల్, హోంగార్డులకు స్వల్ప గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారం వద్ద ఈ సంఘటన జరిగింది. సిమెంట్ కర్మాగారంలో రోజువారీ పనులు చేసే యూపీ దినసరి కూలీ వినోద్(45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి నష్టపరిహారం చెల్లించే విషయంలో పరిశ్రమ యాజమాన్యం, ఔట్‌సోర్స్ ఏజెన్సీ, కార్మికులకు మధ్య ఒప్పందం కుదరకపోవడంతో సోమవారం గొడవ చెలరేగింది. పరిహారంతో తమకు సంబంధం లేదని, ఔట్‌సోర్స్ ఏజెన్సీతో మాట్లాడుకోవాలని పరిశ్రమ యాజమాన్యం సూచించడంతో ఆగ్రహించిన యూపీ కార్మికులు పరిశ్రమలో ఫర్నిచర్, పూలకుండీలను ధ్వంసం చేశారు. అప్పుడే అక్కడకొచ్చిన పాలకవీడు ఎస్సై కోటేశ్, కానిస్టేబుల్, హోంగార్డు.. కార్మికులను అదుపు చేసే ప్రయత్నం చేయగా, వారిపై తిరగబడ్డారు. రాళ్లు విసురుతూ పోలీసులను కర్రలతో తరిమికొట్టారు. ఎస్సై, హోంగార్డులకు స్వల్పంగా గాయాలయ్యాయి. పోలీస్ వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. పరిశ్రమ సెక్యూరిటీ గది అద్దాలూ పగలగొట్టారు. అనంతరం అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సమీప స్టేషన్ల నుంచి పోలీసులను పంపారు. సాయంత్రం ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్న ఎస్పీ నరసింహ.. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొడవకు కారణమైన కార్మికులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో రోజువారీ కూలీలుగా పనిచేసేందుకు యూపీ, బిహార్‌కు చెందిన 200కు పైగా కార్మికులను కేరళకు చెందిన ఔట్‌సోర్స్ ఏజెన్సీ సంస్థ తీసుకొచ్చింది. ఫ్యాక్టరీ పరిసరాల్లోనే వారికి క్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడ ఆదివారం సాయంత్రం వినోద్(45) గుండెపోటుకు గురయ్యాడు. మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి వద్దే రూ.50 వేలు ఇచ్చి, వినోద్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపారు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం ఫ్యాక్టరీ వద్దకు చేరారు. యాజమాన్యానికి, కార్మికులకు మధ్య చర్చలు జరిగాయి. పరిహారం విషయంలో తమకు సంబంధం లేదని యాజమాన్యం చెప్పడంతో ఆగ్రహించిన కార్మికులు ఆందోళనకు దిగారు.

నోటికి ప్లాస్టర్.. ముక్కుకు క్లిప్పు!

» ఇంజనీరింగ్ విద్యార్థిని బలవన్మరణం
» ఏపీలోని గుంటూరులో ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఘటన

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్య చేసుకుంటానన్న విషయం ముందుగా స్వగ్రామంలో తల్లిదండ్రులకు తెలియగా, వారు కూతురిని కాపాడుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నోటికి టేపు, ముక్కుకు క్లిప్పు పెట్టుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఏపీలోని ఏలూరు జిల్లా దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన కమ్మ రాజు, రాధిక దంపతుల కుమార్తె శ్రావ్య (20) నంబూరు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. గుంటూరు అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్లో ఉంటోంది. ఆదివారం రాత్రి శ్రావ్య విజయవాడలో ఉన్న తన స్నేహితురాలు జాగృతికి ఫోన్ చేసి.. తన మానసిక స్థితి సరిగా లేదని, ఆత్మహత్య చేసుకోవాలని ఉందని చెప్పింది. దీంతో కంగుతిన్న జాగృతి.. శ్రావ్యకు సర్ది చెప్పి తన నిర్ణయం మార్చుకునే విధంగా కౌన్సెలింగ్ చేసింది. ఆ తర్వాత వెంటనే ఆమె అన్నయ్యకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. శ్రావ్య ఆత్మహత్య చేసుకుంటానని అంటోందని, వెంటనే వెళ్లి ఇంటికి తీసుకెళ్లండని చెప్పింది. కంగారు పడిన శ్రావ్య అన్న, తల్లిదండ్రులు.. వెంటనే శ్రావ్యకు ఫోన్ చేసి మాట్లాడారు. అయితే, మనసు బాగోలేక జాగృతితో అలా అన్నానని, ఆత్మహత్య చేసుకోనని చెప్పింది. అయితే అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇన్‌స్టా మార్ట్‌లో టేపు, క్లిప్స్ ఆర్డర్ పెట్టింది. పది నిమిషాల్లో డెలివరీ బాయ్ ఆర్డర్ ఇచ్చి వెళ్లాడు. శ్రావ్య గది బయటే ఉండడంతో రూమ్‌మేట్స్ బయటకు వచ్చి ఆమెను గదిలోకి రావాలని కోరారు. అయితే శ్రావ్య వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో రూమ్ మేట్స్ లోపలికివెళ్లి పడుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో వారు లేచి చూడగా గది బయట వరండాలోనే శ్రావ్య నోటికి ప్లాస్టర్, ముక్కుకు క్లిప్పు పెట్టుకొని చలనంలేకుండా పడిపోయి ఉండడంతో 108కు ఫోన్ చేశారు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించి.. ఆమె అప్పటికే మృతి చెందినట్లు చెప్పి వెళ్లిపోయారు. శ్రావ్య ఆత్మహత్యకు గల కారణాలు తమ కూడా తెలియడం లేదని కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థినులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

వీసా పిడుగు

ప్రధాని మోదీకి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతలోనే ఇంతపనిచేస్తారని ఎవరూ ఊహించలేదు. భారత్ చేజారిపోయిందని ఇటీవలే నాలుక కరుచుకున్నట్టుగా కనిపించిన ట్రంప్, పక్షం రోజుల క్రితమే ఉభయదేశాల సంబంధాలకు ఏ ఢోకా లేదన్నారు. భారత్–అమెరికా సహజ భాగస్వాములంటూ మోదీ కూడా స్పందించారు. పుట్టినరోజు సందర్భంగా ఇరువురు నేతల మధ్యా సాగిన చక్కని సంభాషణతో ఘర్షణవాతావరణం ఇక పూర్తిగా ఉపశమించినట్టేనని, రెండుదేశాల సత్సంబంధాలకు మార్గం సుగమమైందని అంతా అనుకున్నారు. పైగా, నిలిచిపోయిన వాణిజ్యచర్చలు తిరిగి ఆరంభమై, అవి చక్కగా, సవ్యంగా సాగాయని ఇరుదేశాలు ప్రకటించిన నాడే వీరిద్దరూ ఒకరినొకరు మిత్రమా మిత్రమా అంటూ పలుకరించుకోవడం ఉపశమనాన్ని ఇచ్చింది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షగా భారత్‌ను రెట్టింపు సుంకాలతో ట్రంప్ బాధించిన దాదాపు నెల తరువాత నేరుగా జరిగిన సంభాషణ ఇది. ఉభయదేశాల భాగస్వామ్యాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకుపోదామని నాయకులిద్దరూ సంకల్పం చెప్పుకున్న ఆ టెలిఫోన్ కాల్ ముగియగానే, హెచ్1బి వీసా ఫీజు లక్షడాలర్లకు పెంచి ట్రంప్ ఇంత దెబ్బకొడతారనుకోలేదు.

ట్రంప్‌తో సుదీర్ఘకాలం ఘర్షణ మన ఐటీరంగానికీ, సాంకేతిక నిపుణులకు ముప్పుతేవచ్చునని నిపుణులు ముందుగానే ఊహించారు, హెచ్చరించారు. ఆత్మనిర్భరతే ఈ బాధలన్నింటికీ పరిష్కారమని, కానీ, స్వాతంత్ర్యానంతరం దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఆ దిశగా ప్రయత్నించకుండా ఇంకా ఇతరదేశాలమీదే మనం ఆధారపడేట్టుగా చేసిందని సొంతగడ్డ గుజరాత్‌లో వ్యాఖ్యానించి తప్పంతా కాంగ్రెస్‌మీదకు తోసేశారు మోదీ. అన్నిరంగాల్లో దేశాన్ని సొంతకాళ్ళమీద నిలబెట్టి, ఆర్థిక సంస్కరణలతో, అత్యున్నత సాంకేతిక విద్యతో నిపుణులను తయారుచేసింది కాంగ్రెసేనని ఆ పార్టీ నాయకులు గుర్తుచేస్తున్నారు. తమ మేడిన్ ఇండియాకు, మోదీ మేకిన్ ఇండియాకు మధ్య తేడా వారు గుర్తుచేస్తున్నారు. అత్యంత ప్రతిభగలవారిని దేశంలోకి రాకుండా నిలువరించాలన్న ట్రంప్ ప్రయత్నం అమెరికన్ టెక్ కంపెనీలకు ప్రయోజనం చేకూర్చదన్న విశ్లేషణలను అటుంచితే, పుట్టిన రోజు శుభాకాంక్షలు అందించిన వెంటనే ఈ నిర్ణయాన్ని కూడా ప్రకటించి నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు పెద్దసవాల్ విసిరారు. కప్పం కట్టలేని స్థితిలోకి అమెరికన్ కంపెనీలను నెట్టి, వాటంతట అవే భారత సాంకేతిక నిపుణులను కాలదనేట్టు చేయాలనుకుంటున్నారు ఆయన. ఉపరితలంలో వలసల నియంత్రణగా కనిపిస్తున్న ఆర్థిక ఆంక్షలు ఇవి. వైట్ కాలర్ ఉద్యోగులను దెబ్బతీసే, భారతదేశ మధ్యతరగతి కలలను విచ్ఛిన్నం చేసే ఈ నిర్ణయం ద్వారా మోదీమీద స్వదేశంలో వ్యతిరేకత పెంచే ప్రయత్నం ఇది. రష్యా, చైనా అధ్యక్షులతో ఆప్తమిత్రుడు మోదీ చేయి కలిపి, చిరునవ్వులు చిందించిన ఆ దృశ్యం ట్రంప్‌కు బొత్తిగా నచ్చలేదు.

బీజేపీ అస్మదీయ పెట్టుబడిదారులు రష్యా క్రూడ్‌ను శుద్ధిచేసి, విదేశాలకు అమ్ముకొని వేలకోట్లు సంపాదిస్తున్నారని, ముడి చమురు అమ్మిన సొమ్ముతో ఉక్రెయిన్ మీద వ్లాదిమిర్ పుతిన్ భీకరయుద్ధం చేస్తున్నారని ట్రంప్ వాదన. చమురు కొంటున్నందుకు శిక్షగా విధించిన అదనపు పాతికశాతం సుంకం దెబ్బకు మనదేశంలోని చాలా రంగాలు కుదేలవుతున్న నేపథ్యంలో, జీఎస్టీ సంస్కరణలతో ఆ సమ్మెటపోటు నేరుగా తగలకుండా మోదీ ప్రభుత్వం లేపనం పూసే ప్రయత్నం చేసింది. కానీ, సాగుతున్న ఆ వాణిజ్యయుద్ధం సరికొత్తగా మరిన్ని రంగాలకు విస్తరిస్తూండటం ఆందోళన కలిగిస్తోంది. పొరుగుదేశాల్లో నిరుద్యోగయువత తిరుగుబాట్లకు పాల్పడుతున్న దృశ్యాలు చూస్తున్నాం. భారతదేశ ఐటీరంగం, సాంకేతిక నిపుణులు అమెరికా ఆర్థికవ్యవస్థకు ఎంత మేలు చేకూర్చుతున్నారో, ఎలా వెన్నుదన్నుగా ఉన్నారో, ఆ దేశ ఎదుగుదలలో వారి పాత్ర ఏమిటో వివరించిచెప్పాలే తప్ప ట్రంప్‌ను ఆడిపోసుకోవడంవల్ల ప్రయోజనం లేదని కొందరి సలహా. అమెరికా ఆర్థిక ప్రయోజనాల కోసం కాక, ఆ ముసుగులో తన రాజకీయ ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా ట్రంప్ నిర్ణయాలు చేస్తాడనీ, తదనుగుణంగా ఆయన వాదనలు, డేటా తయారవుతాయన్నది తెలిసిందే. అటువంటి వ్యక్తి చెవిలో శంఖం ఊది ప్రయోజనం లేదు. న్యాయస్థానాల్లో అమీతుమీ తేలేవరకూ ట్రంప్ సృష్టించే ఈ తరహా వివాదాలను భరించాల్సిందే.

గ్రూప్–1పై రాజకీయ దుష్ప్రచారం!

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి నిర్వహించటం చేతకాని తొలి గ్రూప్ 1 పరీక్షను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదకొండు సంవత్సరాల తర్వాత నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించింది. ఇది చూసి ప్రతిపక్ష బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది. రాజకీయ లబ్ధి కోసం గ్రూప్ 1 పరీక్షను అడ్డుకునేందుకు అనేక కుట్రలు పన్నుతోంది. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయి అనేది బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ ప్రేరేపితమైన ఒక కట్టుకథ మాత్రమే.

మొత్తం 21,093 మంది మెయిన్స్ రాస్తే, 563 మంది మాత్రమే గ్రూప్ 1 అధికారులుగా నియామకం అవుతారు. మిగతా 21,530 మంది సహజంగానే అసంతృప్తితో ఉంటారు. అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నేతలు వీరి అసంతృప్తికి తోడయ్యారు. అభం శుభం ఎరుగని ఈ సాధారణ నిరుద్యోగులను రెచ్చగొట్టి వారి ద్వారా గ్రూప్ 1పై విష ప్రచారం చేయించారు. అంతటితో ఆగకుండా బీఆర్ఎస్ పార్టీ కొంత మంది ప్రైవేటు కోచింగ్ సెంటర్ యజమానులని ఎమ్మెల్సీలు చేస్తామనీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఇస్తామనీ ఆశ పెట్టింది. పారదర్శకంగా జరిగిన గ్రూప్ 1 పరీక్షలపై వారితో పథకం ప్రకారం దుష్ప్రచారం చేయిస్తున్నది. ఇది కోచింగ్ సెంటర్ యజమానులకి లాభదాయకం. పరీక్ష వాయిదా



పడితే కోచింగ్ పేరుతో మళ్ళీ లక్షలు దండుకోవచ్చు, లేదా రాజకీయంగా పలుకుబడి పెంచుకోవచ్చు.

హైకోర్టు ఏక సభ్య ధర్మాసనం మూల్యాంకనంలో తెలుగు మాధ్యమం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థుల మధ్య మార్కుల వ్యత్యాసం ఉందన్న పిటిషనర్ల వాదనలతో ఏకీభవించింది. టీజీపీఎస్సీ వాదనలను తోసిపుచ్చింది. పునర్ మూల్యాంకనం చేయాలి, లేదంటే మెయిన్స్ రద్దు చేసి తిరిగి మళ్ళీ నిర్వహించాలి అనే తీర్పును హైకోర్టు వెలువరించింది. ఈ తీర్పు ఇటు టీజీపీఎస్సీకి అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారుకు ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ తీర్పును హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో సవాలు చేస్తున్నట్లు టీజీపీఎస్సీ వెల్లడించింది. గ్రూప్ 1లో విజేతలుగా నిలిచిన 563 మంది అభ్యర్థులు కూడా హైకోర్టు తీర్పును రాష్ట్ర హైకోర్టు ధర్మాసనంలో సవాలు చేస్తున్నట్లు సమాచారం తెలిసింది. దీంతో గ్రూప్ 1 నియామక ప్రక్రియ మరికొంత కాలం ఆలస్యం కానుంది.

హైకోర్టు కేవలం గ్రూప్ 1 మూల్యాంకనంలో తెలుగు మాధ్యమం, ఇంగ్లీష్ మాధ్యమం అభ్యర్థుల మధ్య మార్కుల వ్యత్యాసం ఉందని మాత్రమే చెప్పింది. ఈ అంశంపై సుప్రీం కోర్టు వెలువరించిన ఒక తీర్పు ప్రకారం పరీక్షలో కఠిన మూల్యాంకనం – సులభ మూల్యాంకనం వలన అభ్యర్థుల మార్కుల్లో తేడా ఉన్నప్పుడు చీఫ్ ఎగ్జామినర్ మోడరేషన్ పద్ధతిలో ఆ మార్కులను స్కేలింగ్ చేసి సరాసరి విధానంలో ఒకే స్థాయికి తీసుకురావాలి. ఈ విధానం టీజీపీఎస్సీలో లోపించిందని మాత్రమే హైకోర్టు పేర్కొంది. నిజానికి ప్రస్తుతం సివిల్ సర్వీసెస్ పరీక్షలో ప్రతి సంవత్సరం హిందీ మాధ్యమం అభ్యర్థుల కన్నా అత్యధికంగా ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులే ఎంపికవుతున్నారు. మొన్న మన రాష్ట్రంలోను, ఆంధ్రప్రదేశ్‌లోను ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష రాసినవారే సివిల్స్‌కి ఎంపికయ్యారు.

అదేవిధంగా ప్రిలిమ్స్‌కి, మెయిన్స్‌కి వేరు వేరు హాల్ టికెట్స్ ఇచ్చారని ఆరోపణ. నిజానికి పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై రాత పరీక్షల్లో, ఇంకా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షల్లో రెండు హాల్ టికెట్ల విధానం ఉంది. ఆ పరీక్షల్లో జరగని అవకతవకలు గ్రూప్ 1లో ఎట్లా జరుగుతాయో ఆరోపణ చేస్తున్నవారు సమాధానం చెప్పాలి.

ఒకే రకమైన మార్కులు 713 మందికి వచ్చాయని మరో ఆరోపణ. ఈ ఆరోపణకి సమాధానంగా టీజీపీఎస్సీ- 440 మందికి దగ్గర దగ్గరగా అంటే 430–439.5 మార్కులు వచ్చాయని ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, తీవ్రమైన పోటీ పరీక్షల్లో సర్వసాధారణంగా జరుగుతుందని తెలిపింది. సివిల్ సర్వీసెస్‌లోనే గాక, నీట్, ఈఏపీసెట్, జెఈఈ పరీక్షలలో కూడా దగ్గర దగ్గరగా ర్యాంకులు రావటం మనందరం చూస్తుంటాం.

అదేవిధంగా 18, 19, పరీక్ష కేంద్రాలలో సుమారు 1656 మహిళా అభ్యర్థుల్లో 76 మంది మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు. 1656 మంది మహిళా అభ్యర్థుల్లో 563 ఉద్యోగాలకు 500 మందో 400మందో ఆ రెండు పరీక్షా కేంద్రాల నుంచి ఎంపికైతే అనుమానం వ్యక్తం చేయాలి కానీ, 76 మంది ఎంపిక కావటం అనేది సహజసిద్ధమైన ప్రక్రియే!

తెలంగాణలో తొలి గ్రూప్ 1 భర్తీ కాకుండా బీఆర్ఎస్ నేతలు రాజకీయంగా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి. రష్యన్ విప్లవకారుడు లెనిన్ చెప్పినట్లు- ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోలేనంత వరకు నిరుద్యోగులు నష్టపోతూనే ఉంటారు.

● కోటూరి మానవతా రాయ్
టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి

కులంలో కర్ణాటక రాగం!

దేంట్లోనైనా ఒక అంగీకారానికి రావచ్చు కానీ కులాల లెక్కల్లో దాన్ని ఒకపట్టాన సాధించలేం. దేశంలో కులాల లెక్కలు మొదలైన నాటినుంచీ ఈ సమస్య ఉంది. కులాల సంఖ్యను బట్టి పదవులూ, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించటం మొదలైన తర్వాత అదింకా ఎక్కువైంది. తమ ప్రాతినిధ్యం ఇంకా పెరగాలని డిమాండు చేసే ప్రతి కులమూ ఏదో ఒక దశలో అధికారిక లెక్కలతో విభేదించి భిన్నగళం వినిపించటం అన్ని చోట్లా జరిగింది. దీనికి భిన్నంగా ప్రాతినిధ్యం లేని కులాలు తమ సంఖ్యాబలాల గురించి అధికార నివేదికలతో విభేదించింది చాలా తక్కువ. ప్రయోజనాలు లేని దగ్గర వివాదాలు అంతగా రాజుకోవు. వాటాలు పెరగాలన్న పట్టుదలలు ఉన్నచోటే లెక్కలకు ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఉన్న వాటాలు కోల్పోకూడదనే ఆరాటం ఉన్నచోటే నివేదికలపై అసంతృప్తులు వ్యక్తమవుతాయి. వీటిని సమాధానపరిచి ఏకాభిప్రాయాన్ని సాధించటం కత్తిమీద సామే! కులాల లెక్కల ఆధారంగా అధికారంలో వాటాలను మార్చటమే ప్రధాన లక్ష్యంగా ప్రకటించుకున్న కాంగ్రెస్ పార్టీకి అంతా అనుకున్నట్లు సాగుతోందని చెప్పే పరిస్థితి కనపడటం లేదు.



మూడునాలుగు కులాలను తప్ప మిగతావాటన్నిటినీ రిజర్వేషన్లు వర్తించే కేటగిరిలోకి చేర్చటం దేశవ్యాప్తంగా జరుగుతోంది. దశాబ్దాలుగా భూసంపదపైనా, స్థానికపాలనా యంత్రాగంపైనా ఆధిపత్యం కలిగిన కులాలను కూడా ఆ పరిధిలోకి తీసుకువచ్చారనటానికి కర్ణాటక కంటే నిదర్శనం లేదు. దీన్ని సరిదిద్దే వ్యూహమూ, చతురతా ఉంటేనే రాహుల్ గాంధీ ఆశిస్తున్న అసలుసిసలైన సామాజిక న్యాయం అర్హులైన వర్గాలకు దక్కుతుంది. అది జరగకపోతే కులచైతన్యమూ, కులపోటీలు పెరిగి అసలు లక్ష్యం ఎక్కడికో పోతుంది.

తెలంగాణలో కులగణనను చేపట్టి, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టాలు చేసి, వాటిని అమల్లోకి తీసుకురావటానికి ఎన్ని వ్యూహాలు అనుసరిస్తున్నా అవసరమైన ఆమోదాలు లభించటం లేదు. పకడ్బందీ కులగణనతో వెనుకబాటుతనాన్ని ఖచ్చితంగా నిరూపించే సమాచారాన్ని సేకరించామనీ, సుప్రీంకోర్టు నుంచి ఎటువంటి అభ్యంతరాలు వచ్చే అవకాశం లేదంటూ పదునుగా ఎన్ని వాదనలు చేస్తున్నా కేంద్రం వాటిని పరిగణనలోకి తీసుకుంటోందన్న సంకేతాలూ రావటం లేదు.

తెలంగాణలో పరిస్థితి ఇలా ఉంటే, ఇప్పుడు మరో కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన కర్ణాటకలో కులగణనపై ఆరంభంలోనే వివాదాలు ముసురుకుంటున్నాయి. కోర్టుల్లో కేసులూ పడ్డాయి. తెలంగాణలో లేని విచిత్ర పరిస్థితి కర్ణాటకలో నెలకొంది. సుదీర్ఘకాలంగా రాజకీయ అధికారాన్ని చలాయిస్తున్న రెడ్డి, వెలమ కులాలకు తెలంగాణలో రిజర్వేషన్లు లేవు. కానీ కర్ణాటకలో అలా కాదు. అక్కడ రాజకీయపెత్తనం చలాయిస్తున్న లింగాయత్, వక్కలిగ కులాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయి. సొంత పార్టీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కులగణనలోనే తమ జనాభాను తక్కువ చూపించారని ఈ రెండు కులాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయటంతో కొత్తగా సర్వే చేయాల్సిన పరిస్థితి అక్కడ వచ్చింది. మంత్రివర్గం ఆమోదించిన సర్వే నివేదికనే పక్కన పడేయాల్సిన స్థాయిలో ఒత్తిళ్లు రావటం కులాల లెక్కల చుట్టూ ఆవరించిన రాజకీయాలకు నిదర్శనం. ఉన్న వాటాను కోల్పోకూడదనే పట్టుదలే ఈ రాజకీయాల్లో ప్రధానంగా కనపడుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2013లో సామాజిక, ఆర్థిక, విద్యా సర్వేను కాంతరాజ్ సారథ్యంలోని బీసీ కమిషన్‌కు (2014లో) అప్పగించారు. ప్రతి ఇంటికీ తిరిగి సమాచారాన్ని నమోదుచేశారు. అప్పటికి కర్ణాటకలో చేసిన సర్వేలన్నిటిలోకి కాంతరాజ్ కమిషన్ చేసినదే సమగ్రమైంది. రిపోర్టు సిద్ధమైనా దాన్ని ఆమోదించటానికీ, అసెంబ్లీలో ప్రవేశపెట్టటానికీ రాజకీయంగా సంసిద్ధత లేకపోవటంతో అది వెలుగులోకి రాకుండానే ఉండిపోయింది. పైగా కమిషన్ సభ్య కార్యదర్శిగా ఉన్న అధికారి దానిపై సంతకం చేయటానికీ నిరాకరించారు. పైనుంచి ఆదేశాల్లేకుండా అది జరిగే అవకాశమే లేదు. ఆ తర్వాత జయప్రకాశ్ హెగ్డే (2020–24) నేతృత్వంలోని బీసీ కమిషన్ ఆ నివేదికకు తుదిరూపం ఇచ్చి, సమాచారం మొత్తాన్ని క్రమపద్ధతిలో పెట్టి, పునఃపరిశీలన చేసి ప్రభుత్వానికి సమర్పించింది. 2025 ఏప్రిల్ 11న మంత్రివర్గం దాన్ని ఆమోదించింది. దాంతో విభేదాలు భగ్గుమన్నాయి.

లింగాయతులూ, వక్కలిగలూ అటు కాంతరాజ్ కమిషన్ లెక్కల్నీ, ఇటు హెగ్డే కమిషన్ లెక్కల్నీ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. జనాభాలో 17 శాతం ఉంటామని లింగాయతులూ, 15 శాతం ఉంటామని వక్కలిగలూ వాదిస్తూ రెండు నివేదికలూ అశాస్త్రీయమేనని ప్రకటించారు. కాంతరాజ్, హెగ్డే కమిషన్ల నివేదికల్లో కూడా ఈ రెండు కులాల లెక్కల్లో కొంత తేడా ఉంది. లింగాయతులు 13.6%, వక్కలిగలు 12.2% ఉన్నట్లు కాంతరాజ్ కమిషన్ చెబితే, హెగ్డే కమిషన్ వాటిని 10.9%, 10%కు తగ్గించింది. ఆర్థికంగా, విద్యాపరంగా పైమెట్టున ఉన్న కుటుంబాల్లో సంతాన నియంత్రణ ఎక్కువగా ఉండటం సహజం. కానీ దాన్ని అంగీకరించటానికి లింగాయతులూ, వక్కలిగలూ సిద్ధంగా లేరు. జనాభా సంఖ్య తగ్గిందని అంగీకరిస్తే రిజర్వేషన్ల శాతాన్ని కుదించుకోవాలన్న డిమాండూ వస్తుంది. అందుకే కమిషన్ నివేదికనే తప్పులతడకగా విమర్శించారు.



■ రాహుల్ కుమార్

1990లో ఏర్పాటైన జస్టిస్ చిన్నప్పరెడ్డి కమిషన్ జనాభాలో లింగాయతులు 16%, వక్కలిగలు 12% చొప్పున ఉన్నారని చెప్పి ఉద్యోగాల్లో మాత్రం ఆ రెండు కులాలకు 48% నుంచి 52% వరకూ ప్రాతినిధ్యం ఉందని తెలిపింది. ఈ అతి ప్రాతినిధ్యాన్ని తగ్గించటానికి ఆ కులాలకు 5%, 4% చొప్పున రిజర్వేషన్లు సరిపోతాయని సిఫార్సు చేసింది. ఇరు కులాల జనాభా తగ్గిందని చెప్పిన హెగ్డే కమిషన్ రిజర్వేషన్ల విషయంలో ఉదారతనే చూపించింది. 8%, 7% చొప్పున రిజర్వేషన్లను ఇవ్వాలని సూచించింది. అయినా సంతృప్తి చెందలేదు. పోనీ రాజకీయాధికారం పరంగా ఈ రెండు వర్గాలకు తక్కువ ప్రాతినిధ్యం ఉందా? అంటే అలాంటిదేమీ కనపడదు. 224 మంది ఎమ్మెల్యేలు ఉన్న శాసనసభలో లింగాయతులు 56 మంది, వక్కలిగలు 46 మంది ఉన్నారు. అంటే అసెంబ్లీలో 45.5% సీట్లు ఈ రెండు కులాల చేతుల్లోనే ఉన్నాయి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పరిధిలోకి రాని లింగాయతులు, వక్కలిగల సంఖ్య చాలా తక్కువ. హెగ్డే కమిషన్ బీసీల రిజర్వేషన్లను 32% నుంచి 51 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. ఈ 51%లోనే ముస్లింల రిజర్వేషన్లూ ఉన్నాయి. అవి 4% నుంచి 8% పెంచాలని ప్రతిపాదించారు. ఇక ఎస్సీ (17%), ఎస్టీలకు (7%) 2022లోనే వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచారు. మొత్తంమీద రిజర్వేషన్లను 75 శాతానికి హెగ్డే కమిషన్ తీసుకువెళ్లింది. ఇవి కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మరో 10 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అన్నీ కలుపుకొంటే రిజర్వేషన్లు 85 శాతం అయ్యే అవకాశం ఉంది. అయినా చల్లారని అసంతృప్తులతో, కోట్లు ఖర్చుతో తయారైన కాంతరాజ్, హెగ్డే కమిషన్ల నివేదికలు ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఇప్పుడు మరో సర్వే ఆరంభమైంది. ఇది పూర్తయి నివేదిక వచ్చినా అది అందరికీ ఆమోదం అవుతుందన్న పూచీలేదు.

హెగ్డే కమిషన్ నివేదిక ప్రకారం చూస్తే రిజర్వేషన్లకు వెలుపల ఉండే జనాభా సంఖ్య ఎక్కువగా ఉండదు. అందులో 17.7 లక్షల మంది ఉన్న బ్రాహ్మణులదే (2.92%) సింహభాగం. రెడ్లు కూడా కర్ణాటకలో ఓబీసీ జాబితాలోనే ఉన్నారు. 10 మంది బ్రాహ్మణ ఎమ్మెల్యేలనూ ఒక రాజ్‌పుత్ ఎమ్మెల్యేనూ మాత్రమే అగ్రకుల ప్రజాప్రతినిధుల జాబితాలో వేయగలం. రెడ్డి ఎమ్మెల్యేలు ఏడుగురున్నా వారు ఆ జాబితాలోకి వస్తారని చెప్పలేం. బ్రాహ్మణ, కమ్మ, మార్వాడీ, ఆంగ్లో ఇండియన్లు మాత్రమే రిజర్వేషన్ల వెలుపల ఉన్నారు. తెలుగు మాట్లాడే ఆర్యవైశ్యులు కూడా ఓబీసీ జాబితాలో ఉన్నారు. ఐశ్వర్యారాయ్, శిల్పాషెట్టీ, సునీల్‌షెట్టీ, రక్షిత్‌షెట్టీ, రిషబ్‌షెట్టీ, అనూష్కాషెట్టీ, కె.ఎల్.రాహుల్, టి.ఎ.పాయ్ (సిండికేట్ బ్యాంకు స్థాపకులు), టి.ఎం.ఎ. పాయ్ (మణిపాల్ యూనివర్సిటీ) లాంటి ప్రముఖులు బంట్ కులానికి చెందినవారు. ఈ కులం కూడా ఓబీసీ జాబితాలోనే ఉంది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో బంట్ కులస్థులు సామాజికంగా పైస్థానంలో ఉంటారు. దాన్ని పట్టించుకోకుండా వాళ్లనీ వెనుకబడిన వర్గంగానే పరిగణించారు.

కర్ణాటక చరిత్రను చూస్తే ఒక విచిత్రం కనపడుతుంది. సారవంతమైన దక్షిణ కర్ణాటక అంతా 1947కు పూర్వం మైసూరు సంస్థానం కింద ఉండేది. దేశంలోనే ప్రగతిశీల సంస్థానంగా దానికి పేరుండేది. నిజాం సంస్థానం తర్వాత అదే పెద్దది. వడియారు రాజవంశం పాలనలో ఉండేది. అరసు కులానికి చెందిన వడియార్లకు కర్ణాటక గ్రామాల్లో బలమూ లేదు. బలగమూ లేదు. దేశంలోని ఇతర సంస్థానాధీశులకూ, జమిందార్లకూ స్థానిక కులబలం గణనీయంగానే ఉండేది. వడియార్లకు అది పెద్ద కొరత. 1880ల్లో అరసు కులానికి చెందిన వారు 1000 మందికి కొంచెం అటూఇటూగా ఉండేవారు. కుల, రక్తబంధువులు లేకుండా నెగ్గుకు రావాల్సిన పరిస్థితి ఉండటంతో గ్రామాల్లో పట్టుకలిగి, భూసంపదపై ఆధిపత్యం ఉన్న లింగాయతులు, వక్కలిగల జోలికి వడియార్లు వెళ్లేవారు కాదు. చాలావరకూ వారి ఆధిపత్యానికే గ్రామాలను వదిలివేశారు. అక్కడ నుంచి సంప్రదాయంగా వచ్చే శిస్తు లభిస్తే చాలనుకుని తృప్తిపడేవారు. పాలనా యంత్రాంగంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని మొదటగా ప్రశ్నించింది లింగాయతులూ, వక్కలిగలే. దానికి స్పందనగా వెంటనే లెజ్లీ మిల్లర్ కమిటీని (1918) వడియార్ మహారాజు ఏర్పాటు చేశారు. 1919 జూలైలో ఆ కమిటీ రిపోర్టు ఇచ్చింది. దాని ఆధారంగా 1921 మే 16న జీవో జారీ అయింది. బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. బ్రాహ్మణేతర ఉద్యమానికి మహారాజు తలవొగ్గుతున్న దశలో అది నచ్చక అప్పుడు దివాన్‌గా ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య రాజీనామా చేశారు. విశ్వేశ్వరయ్య రాజీనామాతో ఊపందుకున్న రిజర్వేషన్ల అనుకూల రాజకీయాలు ఆనాటి నుంచీ కర్ణాటకను ఏదో విధంగా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. 2015 నాటి కుల లెక్కలను తిరస్కరించి మళ్లీ లెక్కలు తీయాలనుకోవటమే అందుకు నిదర్శనం. అరసు కులానికి చెందిన వడియార్లు రిజర్వేషన్లకు శ్రీకారం చుడితే అదే కులానికి చెందిన దేవరాజు అరసు 1972లో ముఖ్యమంత్రి పదవిని చేపట్టి లింగాయతు, వక్కలిగేతరుల కులాలకు రాజకీయ పదవుల్లో ప్రాతినిధ్యం పెంచి కొత్త ఒరవడిని సృష్టించారు. సొంత కులబలం లేనిచోట ఇతరకులాల బలం రాజకీయ మనుగడకు అవసరం. ఒకప్పుడు వడియార్లు అదే చేశారు. దేవరాజు అరసూ 50 ఏళ్ల తర్వాతా ఆ ప్రయోగాన్నే తలకెత్తుకున్నారు. గమ్మత్తు ఏమిటంటే మైసూరును పాలించిన అరసు కులస్థులు కూడా ఇప్పటికీ ఓబీసీ జాబితాలోనే ఉన్నారు.

మంత్రివర్గం ఆమోదించిన సర్వే నివేదికనే పక్కన పడేయాల్సిన స్థాయిలో ఒత్తిళ్లు రావటం కులాల లెక్కల చుట్టూ ఆవరించిన రాజకీయాలకు నిదర్శనం. ఉన్న వాటాను కోల్పోకూడదనే పట్టుదలే ఈ రాజకీయాల్లో ప్రధానంగా కనపడుతుంది.

మూడునాలుగు కులాలను తప్ప మిగతావాటన్నిటినీ రిజర్వేషన్లు వర్తించే కేటగిరిలోకి చేర్చటం దేశవ్యాప్తంగా జరుగుతోంది. దశాబ్దాలుగా భూసంపదపైనా, స్థానిక పాలనా యంత్రాగంపైనా ఆధిపత్యం కలిగిన కులాలను కూడా ఆ పరిధిలోకి తీసుకువచ్చారనటానికి కర్ణాటక కంటే నిదర్శనం లేదు. దీన్ని సరిదిద్దే వ్యూహమూ, చతురతా ఉంటేనే రాహుల్ గాంధీ ఆశిస్తున్న అసలుసిసలైన సామాజిక న్యాయం అర్హులైన వర్గాలకు దక్కుతుంది. అది జరగకపోతే కులచైతన్యమూ, కులపోటీలు పెరిగి అసలు లక్ష్యం ఎక్కడికో పోతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విజయ్ వర్సెస్ ఉదయనిధి!

ఒక్క చెట్టును గట్టిగా ఊపితే పది మంది నటులు కింద పడతారనీ, పైగా వాళ్లంతా తెల్ల పంచెలు కట్టుకుని రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారనీ తమిళనాడులో సరదాగా వినిపించే ఒక జోక్. నాడు ఎంజీఆర్ దూసుకొచ్చారు. తర్వాత జయలలిత డీఎంకేను గట్టి దెబ్బ కొట్టారు. రజనీకాంత్ వద్దామనుకుని చాలా పర్యాయాలు వెనక్కి తగ్గారు. కమల్ హాసన్ వచ్చారు. ఒంటరిగా ఏమి చేయలేక డీఎంకే పంచన చేరి రాజ్యసభ సీటు తీసుకుని పక్కన కూర్చున్నారు. ఈసారి ఇళయ దళపతి (యువ నాయకుడు) విజయ్ గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. రజనీకాంత్ తర్వాత అగ్రనటుడిగా అందిపుచ్చుకున్న ఇమేజ్‌తో జోసఫ్ విజయ్ చంద్రశేఖర్ తమిళ రాజకీయ యవనికపై అడుగుపెట్టగానే ఆయన అభిమానుల్లో ఒక ఉద్వేగం, ఒక ఉద్రేకం పెల్లుబికింది. డీఎంకే, అన్నాడీఎంకేతో విసిగిపోయిన తటస్థులకు విజయ్ ఆశాకిరణంగా కూడా కనిపిస్తున్నారు.

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఎంతో దూరం లేవు. అన్నాడీఎంకే ముక్కలైంది. బీజేపీ దూరం జరిగింది. డీఎంకే బలంతో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ మరోసారి సిద్ధమవుతోంది. వీళ్లందరినీ దాటుకుని ముందుకు వెళ్లేందుకు విజయ్ రంగంలోకి దిగారు. ఆయన వచ్చిన టైమ్, టైమింగ్ కూడా ఆమోదయోగ్యంగానే ఉంది. పార్టీ పెట్టిన రెండేళ్ళలోపే ఆయన ఎన్నికలకు వెళ్తున్నారు. అంటే వేడిలో వేడిగా గెలిచెయ్యాలన్నది ఆయన ఆలోచన కావచ్చు.

విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపన ఒక కీలక సమయంలోనే జరిగింది. అన్నాడీఎంకేలో తీవ్ర విభేదాలతో ఆ పార్టీలో ఐదు గ్రూపులు తయారై మాజీ సీఎం ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వానికి ఎసరు వచ్చిన తరుణంలోనే విజయ్ రాజకీయాల్లోకి వచ్చారు. పైగా అన్నాడీఎంకేను ఛిన్నాభిన్నం చేస్తే మహారాష్ట్ర తరహాలో తాము బలపడే అవకాశం ఉందని బీజేపీ అంచనా వేసుకుంటున్న తరుణంలోనే విజయ్ నేనున్నానని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాట 18శాతం ఓట్లు రావడం కూడా కీలకాంశమే అవుతుంది. ఎంజీఆర్, జయలలిత అభిమానుల్లో ఒక వర్గం ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వంపై విసుగుచెంది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేశారు. ప్రతీసారీ వాళ్లు బీజేపీవైపే ఉండకపోవచ్చు. విజయ్ వైపుకు వాళ్లు తమ దృష్టిని మళ్లించే అవకాశాలు కూడా లేకపోలేదు.

ఎన్నికలకు నాలుగు నెలల సమయం ఉండగానే విజయ్ తన జిల్లాల పర్యటన మొదలు పెట్టారు. తిరుచ్చిలో జరిగిన తొలి పర్యటనతో ఆయన నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా పరిణతి చెందుతున్న సంకేతాలను ఇచ్చింది. ఎయిర్‌పోర్టు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న సభాస్థలికి వెళ్లేందుకు నాలుగు గంటలు పట్టిందంటే అభిమానుల సందోహం ఎంతగా ఉన్నదో అర్థమవుతున్నది. తటస్థులే గాక ఇతర పార్టీల అభిమానులు, ముఖ్యంగా యువకులు, టీనేజర్లు ఎక్కువగా వచ్చారు. తమిళ గ్రామీణ ప్రజానీకం ఈసారి విజయ్ వెంట నడించేందుకు సిద్ధంగా ఉన్నారు. దానికి తోడు సినీ గ్లామర్‌తో జనాకర్షణ ఖాయం. అయినా విజయ్‌కు కొన్ని పరిమితులున్నాయి. జెండాలు పట్టుకున్న వాళ్ళంతా అనుకూల ఓటర్లు కాదన్నది ఆయన గుర్తించాలి. గెలిస్తే తాను ఏం చేయబోతున్నానో విజయ్ బహిరంగంగా చెప్పగలిగినప్పుడే జనం ఆకర్షితులవుతారు. తన పార్టీ విధానాలేమిటో ఆయన వివరించగలగాలి. సీఎం స్టాలిన్ సహా, రాజకీయ ప్రత్యర్థులంతా అడుగుతున్నది కూడా అదే. విజయ్ రాజకీయ విధానాలేమిటి అన్నదే వారి తొలి ప్రశ్న.

ఉదయనిధికి రాజకీయ అనుభవం ఉంది. కుటుంబ వారసత్వంగా కూడా రాజకీయం రక్తంలో లీనమై ఉంది. రాజకీయాలు చూస్తూ పెరిగిన కారణంగా ఎక్కడ ఎలా మాట్లాడాలో కూడా తర్ఫీదు పొందారు. విజయ్‌కు ఎలాంటి రాజకీయ అనుభవం లేదు. సినిమాల్లో డైలాగులతో ఫేమస్ అయ్యారు. కాకపోతే విజయ్ ధైర్యవంతుడు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోగలరని ఆయనతో బాగా పరిచయం ఉన్న వాళ్లు చెబుతారు.



విజయ్ ఎవరికి పోటీ, విజయ్‌కు ఎవరు పోటీ? ఈ ప్రశ్న మదిలో మెదిలిన వెంటనే స్టాలిన్ తనయుడైన తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ గుర్తుకు వస్తారు. తమిళనాడు ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ ఆయన దిశానిర్దేశం కోసమే ఎదురు చూస్తుంటారని అంతర్గతంగా వినిపిస్తున్న మాట. స్టాలిన్‌కు కూడా వయసు మీరుతున్న తరుణంలో ఏదో ఒక రోజున డీఎంకేకు ఉదయనిధి మాత్రమే వారసుడు అవుతారనే నిర్ణయానికి ఆ పార్టీ నాయకులు, కేడర్ వచ్చారు. అందుకే విజయ్ పార్టీ పెట్టిన వెంటనే డీఎంకే ప్రచార యంత్రాంగం మొత్తం అలర్టయ్యింది. మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ ఉదయనిధికి ఇమేజ్ పెంచే ప్రక్రియ మొదలైంది. ఉదయనిధి చేపట్టే కార్యక్రమాలతో రీల్స్, ప్రోమోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. విజయ్‌ను ఎక్కడా డైరెక్ట్‌గా కౌంటర్ చేయకుండా తెలివిగా వ్యవహరిస్తూ ఉదయనిధిని తమిళనాడుకు ఏకైక నాయకుడిగా నిలబెట్టే చర్యలు మొదలయ్యాయి.

ఉదయనిధి కూడా తన తాత కరుణానిధి, తండ్రి ఎంకే స్టాలిన్ తరహాలోనే నాస్తికుడు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. విజయ్ అలా కాదు. ఆయన క్రైస్తవుడు. హిందూ మతంపై కూడా గౌరవాభిమానాలున్నాయి. రాష్ట్ర పర్యటన కోసం చెన్నై నుంచి స్పెషల్ ఫ్లయిట్‌లో తిరుచ్చి వెళ్తూ రాహుకాలం చూసుకుని మరీ ముందే బయలుదేరారని ఆయన అభిమానులు చెబుతున్నారు. ఉదయనిధికి రాజకీయ అనుభవం ఉంది. కుటుంబ వారసత్వంగా కూడా రాజకీయం రక్తంలో లీనమై ఉంది. రాజకీయాలు చూస్తూ పెరిగిన కారణంగా ఎక్కడ ఎలా మాట్లాడాలో కూడా తర్ఫీదు పొందారు. విజయ్‌కు ఎలాంటి రాజకీయ అనుభవం లేదు. సినిమాల్లో డైలాగులతో ఫేమస్ అయ్యారు. కాకపోతే విజయ్ ధైర్యవంతుడు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోగలరని ఆయనతో బాగా పరిచయం ఉన్నవాళ్లు చెబుతారు. అయినా ఎన్నికలు వస్తే ఎలా ముందుకు వెళ్లాలి, ఎవరితో పొత్తు పెట్టుకోవాలో విజయ్ ఇంతవరకు నిర్ణయించుకోలేకపోతున్నారు. ఒంటరిగా గెలవడం కష్టమని మాత్రం విజయ్‌కు అర్థమైంది. ఇప్పటికిప్పుడయితే తమిళనాడులోని అన్ని పార్టీలు విజయ్‌ను తమ రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తున్నాయి. ఆయనతో పొత్తుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

డీఎంకే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. విజయ్‌ను పెద్ద నాయకుడిగా పరిగణించేందుకు ప్రయత్నించడం లేదు. ఎక్కడా ఉదయనిధి వర్సెస్ విజయ్ అన్న ఆలోచన రాకుండా చూస్తోంది. స్టాలిన్‌కు రాజకీయ వారసుడైనంత మాత్రాన విజయ్‌తో డైరెక్టుగా రింగులోకి దిగాలా అన్నది డీఎంకే ఆలోచన. అటువంటి ప్రచారమే మొదలైతే- అనవసరంగా విజయ్‌కు పబ్లిసిటీ ఇచ్చినట్లవుతుందని వాళ్లకు తెలుసు. అందుకే అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామిని తమ ప్రధాన ప్రత్యర్థిగా డీఎంకే పరిగణిస్తోంది. ఆయన పదికాలాల పాటు ప్రతిపక్షనేత హోదాలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లుగా ఉదయనిధి ఇటీవల చెప్పుకున్నారు. ఒక గీతను చిన్నదిగా చేసేందుకు మరో పెద్ద గీత గీసినట్లుగా విజయ్‌ను తక్కువ చేసేందుకు పళనిస్వామిని డీఎంకే తమ ప్రత్యర్థిగా నిలబెడుతోంది. వాటన్నింటినీ తట్టుకుని విజయ్ రాజకీయాల్లో రాణిస్తారని కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే ఎంజీఆర్, జయలలిత నాటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు!

■ ఎ. బొల్లంరాజు
సీనియర్ జర్నలిస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

కలెక్టరేట్ ప్రజావాణికి వినతుల వెల్లువ



- వివిధ సమస్యలపై 157 ఫిర్యాదులు
- స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

6

మేడారానికి కొత్త రూపు



ఆదివాసీల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ కొలువైన మేడారం క్షేత్రంలో చరిత్రాత్మక మార్పులు రాబోతున్నాయి. రెండేళ్లకోసారి కోటి మందిని రప్పించే కోన ఆధునిక రూపును సంతరించుకోనుంది. 'మాస్టర్ ప్లాన్' పేరుతో మేడారాన్ని మరింత సౌలభ్యంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధమైంది. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు చెదరకుండా గద్దెలను పునర్నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెలతో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించారు. మహాజాతర వేళ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా గద్దెల ప్రాంగణాన్ని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జంపన్నవాగులో నిరంతరం నీళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీటితో పాటు శాశ్వత అభివృద్ధి పనులను ప్రారంభం, కొత్త పనులకు శంకుస్థాపన, గద్దెల కొత్త రీ డిజైన్‌పై గిరిజనులతో చర్చించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం వస్తున్నారు.

- సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్
- ఒకే వరుసలో ఉండేలా నిర్మాణానికి ప్రణాళిక
- గిరిజనుల సంప్రదాయాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు
- గద్దెల సాలహారం నలువైపులా విస్తరణ
- మహాజాతర వేళ ప్రశాంత దర్శనం కోసం ఆధునిక చర్యలు
- జంపన్నవాగులో నిరంతరం నీటిని నిల్వ ఉంచేలా ప్రణాళిక
- శాశ్వత అభివృద్ధి పనులతో జాతరకు గుర్తింపు తెచ్చేలా కసరత్తు
- రూ.150కోట్లతో మేడారం మాస్టర్ ప్లాన్ అమలు
- నేడు మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతరను ఆధునీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మాస్టర్ ప్లాన్ పేరుతో జాతరలో శాశ్వత అభివృద్ధి పనులతో పాటు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునీకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఒక వరుసలో ఉండగా, వీరి ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. భక్తులు క్యూ లైన్ ద్వారా సమ్మక్క, సారలమ్మ దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావటం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నాలుగు గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం గద్దెల చుట్టు ఇనుప (స్టీల్) గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ప్రణాళికలో గద్దెల చుట్టూ గ్రానైట్‌తో నిర్మించాలని ప్లాన్ చేశారు. గద్దెల చుట్టూ గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజనుల లిపి, ఇతర జాతర వైభవం తెలియజేసే బొమ్మలను చెక్కనున్నారు. ఈ విషయమై పలుమార్లు గిరిజన పూజారులు, పెద్ద మనుషులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గిరిజన సంప్రదాయాలు దెబ్బతినకుండా గద్దెల డిజైన్‌ను తయారు చేస్తున్నారు. గిరిజనుల అభిప్రాయాలకు అనుగుణంగా నాలుగైదు విధాలుగా అధికారులు గద్దెల డిజైన్లు రూపొందించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో పర్యటించనుండటంతో గిరిజనుల అభిప్రాయాల మేరకు ఒక డిజైన్ ఫైనల్ చేసి శంకుస్థాపన చేయనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

గద్దెల సాలారం విస్తరణ..

మహాజాతర వేళ భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శన భాగ్యం మహా కష్టమవుతోంది. గంటల తరబడి క్యూలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్ధరాత్రో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసారా మొక్కుకునే అవకాశం కలుగడం లేదని భక్తుల ఆవేదన. ప్రస్తుతం 32 గుంటల స్థలంలో తల్లుల గద్దెల ప్రాంగణం ఉండగా, సమ్మక్క, సారలమ్మ,

(మిగతా 7లో..)



సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదీ..

- ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరుతారు.
- 10.45 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా ప్రయాణించి మధ్యాహ్నం 12 గంటలకు మేడారం చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.15 గంటలకు సమ్మక్క-సారలమ్మ గద్దెలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు.
- అనంతరం పూజారులతో సమావేశమవుతారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. గద్దెల ప్రాంగణంలోని పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం ఆలయ పునరాభివృద్ధిపై స్లైడ్ షోను తిలకిస్తారు.
- 1.30 నుంచి 2.30 గంటల వరకు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో వేచి ఉంటారు.
- 2.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయల్దేరుతారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- పలు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



మేడారంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనుండగా ఏర్పాట్లను అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం మేడారంలో పర్యటించారు. హెలీప్యాడ్, రహదారులు, పార్కింగ్ స్థలాలు, సభా వేదిక, విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. మంత్రి వెంట కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఎస్పీ శబరీశ్, అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి ఉన్నారు. మేడారం పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి 2026 జనవరి 28న నిర్వహించనున్న సమ్మక్క- సారలమ్మ మహాజాతర ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ముందుగా తల్లులను దర్శించుకొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. శాశ్వత నిర్మాణ పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను స్లైడ్ షో ద్వారా పూజారులకు వివరించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. వెయ్యి మంది పోలీస్ సిబ్బందిని ములుగు నుంచి మేడారం, తాడ్వాయి మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్, సీసీ కెమెరాలు, వాహనాల తనిఖీలతోపాటుగా ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాప్‌లపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సీఎం పర్యటన సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు.



బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు

- భద్రకాళి ఆలయంలో నేత్రపర్వంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు
- ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని
- వృషభ మృగ వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తి

6

దంచి కొట్టిన వాన

చెరువులను తలపించిన రోడ్లు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో హనుమకొండలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షం కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బాలసముద్రంలోని పలు కాలనీల్లోని రోడ్లు వరద నీరు చేరి చెరువులను తలపించాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట డ్రెయినేజీ కాలువలు సరిగా లేక వాహనాలు నీట మునగడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుబేదారిలో ఫారెస్టు ఆఫీస్, కాజీపేట డీజిల్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వరద ఉప్పొంగింది. డబుల్ బెడ్‌రూంల లోని కొన్ని బ్లాక్‌లకు భారీ వరద చేరి లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండలో దంచికొట్టిన వానకు బస్టాండ్ ప్రాంగణం భారీ వరదతో ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో జన జీవనం స్తంభించిపోయింది. నగరంలోని పలు కాలనీలలో డ్రెయినేజీలు పొంగి రోడ్లన్నీ కాలువలుగా మారి నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ప్రయాణీకులు, వాహనదారులు రోడ్లపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామైంది. కాజీపేటలోని రహమత్ నగర్ అండర్ బ్రిడ్జి కింద నీరు నిలవడంతో కొద్ది సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరంగల్ ఎన్ఐటీ కళాశాల సమీపంలో రోడ్డుపై పెద్ద ఎత్తున నీరునిలిచి రవాణా స్తంభించింది. సుమారు 15 మిమీ వర్షం పడినట్టు వాతావరణ శాఖ తెలిపింది.



హనుమకొండ చౌరస్తాలో రోడ్లపై పెద్ద ఎత్తున నిలిచిన వర్షపు నీరు... ట్రాఫిక్ జామ్



జీఎస్టీ రగడ

- పలు చోట్ల ఇంకా పాత ధరలకే విక్రయాలు
- పాత స్టాక్ అని కారణం చెబుతున్న వ్యాపారులు
- వాగ్వాదాలకు దిగుతున్న వినియోగదారులు
- కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌లో తగ్గింపు ధరలు అమలు
- తగ్గిన సబ్బులు, పేస్టులు, బిస్కట్లు, షాంపూల ధరలు
- స్థానిక కిరాణషాపుల్లో కానరాని తగ్గింపు ధరలు
- మరో వారం పట్టవచ్చంటున్న చిరు వ్యాపారులు

హనుమకొండ సిటీ/న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రం కొనుగోలుదారులకు ఊరట కలిగిస్తూ తగ్గించిన జీఎస్టీ (గూడ్స్ అండ్ సేల్స్ ట్యాక్స్) అంశం సంకట స్థితిని కలిగిస్తోంది. నిత్యావసరాలు, గృహోపకరణాలు ఇతర వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ శ్లాబులను తగ్గిస్తూ కేంద్రం ప్రకటించి అమల్లోకి తెచ్చిన సంగతి విధితమే. తగ్గింపుతో జీఎస్టీ ఉత్సవ్‌గా సంబురాలు నెలకొన్న తరుణంలో వ్యాపారులు, కొనుగోలుదారుల మధ్య వైరుధ్యాలు పొడసూపుతున్నాయి. జీఎస్టీ తగ్గింపుతో ఆ మేరకు సరుకులు, ఇతర వస్తువులు ధరలు వేయాలని కొనుగోలుదారులు వ్యాపారులను ప్రశ్నిస్తున్నారు. కానీ వ్యాపారులేమో కేంద్రం ప్రకటించక ముందే పెద్ద ఎత్తున స్టాకు సమకూర్చుకున్నట్లు సమాధానమిస్తున్నారు. ఈ క్రమంలో ధరలను తగ్గించ లేమంటూ కొనుగోలుదారులకు తేల్చి చెబుతున్నారు. దీనిపై కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ప్రకటించిన నేపథ్యంలో మీ స్టాకు అంశంతో మాకు పనేమిటని బిల్లులు తగ్గించాలని నిలదీస్తున్నారు.

వస్తువులు కొనుగోలు చేసి బిల్లింగ్ పూర్తయిన క్రమంలో రశీదులను చూసి కొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీస్తున్న పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్ ఇలా ఇతర విభాగాలతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాల కొనుగోలు విషయంలో కూడా సందిగ్ధత పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులేమో నష్టపోతామంటున్నారు. కొనుగోలుదారులేమో మేము చెల్లించేది లేదంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వ్యాపార సంస్థల్లో వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో ఇటు వంటి వాతావరణం నెలకొనడం

(మిగతా 6లో..)

పిడుగుపాటుకు ఇద్దరు బలి

ఒకరికి తీవ్ర గాయాలు



రాకేష్ (ఫైల్)



కృష్ణ మృతదేహం

దుగ్గొండి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగులు పడిన ఘటనల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లె గ్రామంలో సోమవారం మొద్దు రాకేష్(25) తమ వ్యవసాయ బావి వద్దకు పనుల కోసం వెళ్లాడు. పనులు పూర్తి చేసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో భారీ వర్షం మొదలైంది. ఇదే సమయంలో పిడుగు పడటంతో రాకేష్ అక్కడికక్కడే చెందాడు. రాకేష్ ఐటీఐ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు దుర్మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

ములుగు జిల్లాలో మరొకరు..

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం పిడుగుపాటుతో రైతు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ములుగు మండలంలోని చల్వాక గ్రామానికి చెందిన రైతు ఊకె కృష్ణ(45) అదే గ్రామానికి చెందిన పూనెం చిట్టిబాబుతో కలిసి ఉదయం తన మొక్కజొన్న చేనులో దున్నడానికి వెళ్లాడు. సాయంత్రం చేనులో పనులు చేస్తున్న క్రమంలో పెనుగాలులు, ఉరుములతో వర్షం మొదలైంది. దీంతో ఇద్దరూ పనులను వదిలి చేను పక్కన ఉన్న గుడిసెలోకి వెళ్లారు. ఈ క్రమంలో పెద్దశబ్దంతో గుడిసెపై పిడుగు పడింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా, చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు కృష్ణకు భార్య స్వరూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన చిట్టిబాబును వరంగల్‌కు తరలించారు.

వేగంగా జాతీయ రహదారుల నిర్మాణం

- భూసేకరణ ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలన్నారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తివివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్‌లకు సూచించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా సమీక్షలు చేపట్టి పురోగతిని పరిశీలిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాకాలలో మళ్లీ స్పీడ్ బోటు



పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సులో స్పీడ్ బోటు సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. 'అలంకారప్రాయంగా స్పీడ్ బోటు' అనే శీర్షికన ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన అటవీశాఖ అధికారులు పాకాల సరస్సులో స్పీడ్ బోటు సేవలను ప్రారంభించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఖానాపురం



ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వినతులు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులు పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. ప్రజావాణిలో మొత్తం 112 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 45 వినతులు, జీడబ్ల్యూఎంసీ 19, హౌసింగ్ పీడీ 9, ఎక్సైజ్ శాఖ 2, జిల్లా విద్యాశాఖ 2, ఆర్‌సీవో రెసిడెన్షియల్ 3, పంచాయతీరాజ్ 3, వరంగల్ సీపీ 3, జిల్లా సంక్షేమ శాఖ 4, సర్వే ల్యాండ్ 2, లీడ్ బ్యాంక్ మేనేజర్ 2, నర్సంపేట మునిసిపల్ కార్పొరేషన్ 2, వివిధ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్‌డీవో రామిరెడ్డి, డీసీవో నీరజ, డీపీవో కల్పన, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రైం అదనపు డీసీపీగా బాలస్వామి బాధ్యతలు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అదనపు డీసీపీ జి.బాలస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను బాలస్వామి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. బాలస్వామి గతంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలస్వామి

విలేకరిపై కేసు నమోదు

నడికూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నడికూడ మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన జనం పవర్ విలేకరి చుక్క సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై కొంక అశోక్ తెలిపారు. కౌకొండ గ్రామానికి చెందిన మేకల చిరంజీవి ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మొరం పోయిస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్‌తో చుక్క సతీష్ దుర్భాషలాడాడు. సోమవారం చుక్క సతీష్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించారు. దీంతో చుక్క సతీష్ తాను విలేకరినని తననే పిలిపిస్తావా అంటూ చిరంజీవితో పాటు తన తమ్ముడైన శ్రీకాంత్‌ను దుర్భాషలాడుతూ చేతులతో కొట్టి బెదిరించాడు. మేకల చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

8 నుంచి కేయూ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 8 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీమ్ ఇక్బాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 8, 10, 14, 16, 18, 23 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా తేదీల్లో పాత సెలబస్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

వరదల నివారణకు చర్యలు

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కమలాపురంలో వరద బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న మంత్రి

మంగపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కమలాపురంలో వరదలు రాకుండా చెట్లను తొలగించిన పనులను పరిశీలించారు. ఇదే క్రమంలో ఐఎన్‌టీయూసీ కార్యాలయం ఆవరణంలో వరద బాధితులకు దుప్పట్లు, దుస్తులు, ఇతర సరుకులను మంత్రి అందజేశారు. అనంతరం గంపోనిగూడెం, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో మంత్రి పర్యటించారు. రాజుపేటలో కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి కర్రి నాగేంద్రబాబు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. కమలాపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు.

జిల్లాలో చిట్టచివరగా ఉన్న మంగపేట మండలంలో ప్రతి ఏటా వానాకాలం వస్తే గోదావరి వరదలతో ప్రజలు సతమతమౌతున్నారని వరదలు ఉప్పొంగకుండా ప్రత్యేక చర్యలను చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. హేమాచల లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై దైవ దర్శనాలకు ప్రత్యేక లిఫ్ట్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. చింతామణి జలధారల వద్ద మహిళలు దుస్తులు మార్చుకొనుటకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం వస్తున్నారని, గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మేడారం ఇంతముందు వచ్చిన దాఖలాలు లేవన్నారు.

అవినీతి పోలీసులపై అంతర్గత విచారణ

మట్టెవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు సిబ్బందిపై వస్తున్న అవినీతి ఆరోపణలను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కమిషనరేట్ పరిధిలోని ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కేసును బట్టి రేటు వసూలు చేయడం, అక్రమ దందా నడిపే వారి నుంచి వసూళ్లకు పాల్పడడం, స్టేషన్‌కొచ్చే ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు వసూలు చేయడం లాంటి ఆరోపణలు వచ్చిన పోలీసు సిబ్బందిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. కొంత మంది పోలీసు సిబ్బంది రౌడీషీటర్లతో కలిసి ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేయడం, వారితో సన్నిహితంగా ఉండటం, పార్టీలు చేసు కోవడంపై కూడా ఉన్నతాధికారులు శాఖపరమైన విచారణ చేస్తున్నారని, పూర్తి అయిన వెంటనే చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారని సమాచారం.

ప్రజావాణి వినతులు పరిష్కరించండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- 75 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్
- నగర పాలక సంస్థలో ప్రజావాణి కార్యక్రమం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగం పెంచి పరిష్కార మార్గం చూపాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగరంలో శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులు తరుచుగా వస్తున్నాయని సమస్యలు పునరావృత్తం కాకుండా అధికారులకు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, వెటర్నరి అధికారి గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, డీఎఫ్‌వో శంకర్‌లింగంతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

ఫిర్యాదులు..	
ఇంజనీరింగ్	- 21
హెల్త్, శానిటేషన్	- 07
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 09
టౌన్‌ప్లానింగ్	-33
మంచి నీటి సరఫరా	- 04
హార్టికల్చర్	- 01
మొత్తం	= 75

● నగర పాలక సంస్థ మలేరియా విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో 90 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి రెండు మాసాల క్రితం జీతాలు పెంచుతూ కౌన్సిల్ తీర్మానం చేసింది. పెంచిన జీతాలు ఇప్పటి వరకు అందలేదు. కమిషనర్ స్పందించి పెంచిన జీతాలు చెల్లించాలని మలేరియా సిబ్బంది కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

● ఖిలావరంగల్ మండలం 17వ డివిజన్ బొల్లికుంటలో పలు కాలనీలలో సీసీ రోడ్లు లేనందున రోడ్డుకు రెండు వైపుల ఇండ్లు ఉన్న వారు రోడ్డును ఆక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై గతంలో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని, వెంటనే చర్యలు తీసుకుని సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు.

● గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్ గ్రామంలోని ఓఆర్ ఆర్‌కు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 516 ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అదే గ్రామానికి చెందిన రియల్టర్ ప్లాట్లు చేసి నగరంలో ఉంటున్న వ్యక్తులకు విక్రయిస్తున్నాడు. దీనిపై గతంలో కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామానికి చెందిన పలువురు స్వచ్ఛంగ కార్యకర్తలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్ ప్రజావాణికి వినతుల వెల్లువ

వివిధ సమస్యలపై 157 ఫిర్యాదులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 157 ఫిర్యాదులు రాగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దామెర మండల ప్రజలకు బస్సు సదుపాయం కల్పించాలి



దామెర మండలంలో బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, యువమోర్చా నాయకులు

జిల్లాలోని దామెర మండలంలో బస్సు, బస్‌స్టేషన్ సదుపాయం లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సౌకర్యాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, జిల్లా యువ మోర్చా కార్యవర్గ సభ్యులు బత్తుల సుమంత్‌లు ప్రజావాణిలో డీఆర్‌వో వై.వి గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. దామెర మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం చేయాలని, ఊరుగొండలో ఎక్స్‌ప్రెస్ బస్‌హాల్ట్, సీతారాంపురం, పసరగొండ, దమ్మన్నపేట, ఒగాపూర్, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఒగ్లాపూర్-తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి రూట్‌లో ప్రస్తుతానికి బస్సు సర్వీస్ లేదని, కొత్తగా ప్రారంభించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

తమ్ముడి చేతిలో అన్న హత్య

● భూ వివాదాలే కారణం

వెంకటాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం దారుణ ఘటన చోటుచేసు కుంది. భూ వివాదాల నేపథ్యంలో అన్నను తమ్ముడు చంపడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన గొంది లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కుమారుడు మాధవరావు(35), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో భార్యకు సాంబశివరావు ఏకైక సంతానం. మాధవరావు వ్యవసాయ కూలీగాపని చేస్తుండగా, సాంబశివరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి లక్ష్మయ్య మృతి చెందడంతో నుంచి వారసత్వంగా ఆరున్నర ఎకరాల భూమి ఉండగా ఇద్దరు అన్నదమ్ములు సమాన వాటాలుగా పంచుకున్నారు. ఈక్రమంలో సాంబశివరావు తనకు సంక్రమించిన భూమిని అమ్ముకునే విషయంలో మాధవరావును సంతకం పెట్టమని అడగ్గా అతను నిరాకరించాడు. ఈ నేపథ్యంలో సోమవారం మాధవరావు ఇంటికి మధ్యాహ్నం సమయంలో వెళ్లిన అతడు భూమి విషయంలో గొడవపడ్డాడు.

ఈక్రమంలో మాటామాటా పెరగడంతో ఆవేశానికి లోనైన సాంబశివరావు గడ్డపారతో మాధవరావు తలపై బలంగా కొట్టడ్డాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై మెదడు బయటకు వచ్చి మాధవరావు అక్కడికక్కడే మృతిచెం దాడు. సమాచారం అందుకున్న వెంకటాపు రం ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చెల్లెలు కోరం నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. మృతుడు, నిందితుడు అవివాహితులు. హత్య చేసిన అనంతరం నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

నిలకడగా జ్యోతి ఆరోగ్యం

మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు ఎంజీఎం ఆర్ఎంవో

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్‌లోని అయోధ్యపురానికి చెందిన ఇలాసారపు జ్యోతికి ఎంజీఎంలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ పాజిటివ్‌కు బదులు బీ పాజిటివ్ రక్తం ఎక్కించడంతో అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. కాగా, జ్యోతి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని ఎంజీఎం ఆస్పత్రి ఆర్ఎంవో ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక కాలేయ వ్యాధి తోపాటు మరికొన్ని అనారోగ్య సమస్యలతో రోగి ఎంజీఎంలో చికిత్స నిమిత్తం ఈ నెల 16న చేరినట్లు పేర్కొన్నారు. రోగి వ్యాధి శాశ్వత నివారణ కోసం సర్జరీ అవసరమని ఇక్కడి వైద్యులు ధృవీకరించిన నేపథ్యంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు ద్వారా మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తమార్పిడి వల్ల ఈ చికిత్స అవసరం పడలేదని, హైదరాబాద్‌కు రెఫర్ చేయడం లేదని స్పష్టం చేశారు. అంతకుముందున్న అనారోగ్య సమస్య వల్ల మాత్రమే నిమ్స్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఎంజీఎంలో జ్యోతిని పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

ఎంజీఎంలో చికిత్స పొందుతన్న జ్యోతిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం పరామర్శించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వార్డులో ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని రోగికి ధైర్యం చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు పంపించాలని వైద్యులకు సూచించారు.

బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు

భద్రకాళి ఆలయంలో నేత్రపర్వంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఆరాధ్యదైవం భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నేత్ర పర్వంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఉత్సవాల మొదటి రోజు భద్రకాళి అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో దేవీ భాగవతం, శ్రీమద్భాగవతం, సుందర కాండ పారాయణం నిర్వహించారు.

ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఉత్సవ మూర్తిని వృశభ వాహనంపై, సాయంత్రం జింక వాహనంపై ఊరేగించారు. రాత్రి అమ్మవారికి మహాపూజ, కుమారిసుహాసిని పూజ, చేశారు. మొదటి రోజు ఉభయదాతల సేవలతో పూజలు కొనసాగగా, మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో రామల సునిత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, మోత్కూరి మయూరి రామేశ్వర్‌రావు, ఇతర ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది కూచన హరినాథ్, భద్రకాళి శ్యాం సుందర్,కృష్ణ, నవీన్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రకాళి అమ్మవారికి ఉత్సవాల్లో అలంకరించే బంగారు నగలను బ్యాంకు లాకర్ నుంచి తీసుకొచ్చారు. కట్టుదిట్టమైన భద్రతా మధ్య ఆలయ అధికారులు, ధర్మకర్తలు తీసుకొచ్చి వేడుకలు నిర్వహించారు.

16 నుంచి కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని సోషల్ సైన్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ విభాగాల్లో పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు అక్టోబరు 16, 18 తేదీల్లో జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

జీఎస్టీ రగడ

(5వ పేజీ తరువాయి)

ఇబ్బంది కరంగా మారిందంటూ అటు వ్యాపారులు, ఇటు కొనుగోలు దారులు వేదనకు గురవుతున్నారు. అయితే కార్పొరేట్ షాపింగ్‌మాల్స్‌లో తగ్గించిన ధరలు అమలు అవుతున్నాయి.

జనగామ జిల్లాలో కూడా పాత రేట్ల ప్రకారమే వ్యాపారులు అమ్మకాలు జరిపారు. తగ్గించిన జీఎస్టీ ప్రకారం కొత్త స్టాక్ రావడానికి మరో వారం నుంచి 15రోజులు పట్టే అవకాశం ఉందని కొత్తస్టాక్ వచ్చిన తర్వాత కొత్తరేట్ల ప్రకారం అమ్మకాలు జరుపుతామని వ్యాపారులు చెబుతున్నారు. పలు ఉత్పత్తులు, నిత్యావసర సరుకుల ధరలు ఆదివారంతో పోలిస్తే తగ్గాయి. ఈ మేరకు ఆయా కంపనీలు తమ డిస్ట్రిబ్యూటర్లకు తగ్గించిన రేట్ల జాబితాను పంపించాయి. కొన్ని కంపెనీల రేట్లు అలాగే ఉంచి క్వాంటిటీని పెంచాయి. క్లోజప్ పేస్ట్ గతంలో రూ.10కు 17గ్రాములు రాగా ప్రస్తుతం 20 గ్రాములకు పెంచారు. అలాగే 150 గ్రాములున్న క్లోజప్ పేస్ట్ రూ.145 ఉండగా ప్రస్తుతం రూ. 129కి తగ్గింది. 100 గ్రాముల లక్స్ సబ్బు రూ.42 నుంచి రూ.36కి తగ్గింది. స్నానపు సబ్బుల ధరలు మాత్రమే తగ్గగా బట్టల సబ్బుల ధరలు అలాగే ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

ములుగు జిల్లాలో జీఎస్టీ తగ్గింపు ధరలు అమలు లేదు. 16 చిక్ షాంపో ప్యాకెట్స్ కొనుగోలు చేయగా రూ. 15కు లభించాయి. 250 గ్రా ముల మేరీ గోల్డ్ బిస్కెట్ ప్యాకెట్ ధర జీఎస్టీ తగ్గింపునకు ముందు రూ. 45కు రాగా అదే ధర కు అమ్ముతున్నారు. జీఎస్టీ కుదింపుతో ధర దగ్గించి అమ్మాలి కదా? అని షాపు యజమానులను ప్రశ్నించగా కొత్త స్టాక్ వచ్చాక అమలు చేస్తామని వారు చెబుతున్నారని విని యోగదారులు అంటున్నారు.

భూపాలపల్లి జిల్లాలోని వివిధ సూపర్ మార్కెట్లలో ఉదయం నుంచే నిత్యవసరకులపై జీఎస్టీ తగ్గిస్తూ విక్రయాలు జరిపారు. శనివారం సాయంత్రం వరకు పాత ధరలపైనే విక్రయాలు సాగించినా సోమవారం ఉదయం నుంచి 10 నుంచి 12 శాతం మినహాయించి సరుకులు విక్రయిస్తున్నట్లు సూపర్ మార్కెట్ల నిర్వాహకులు వెల్లడించారు. అయితే చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో మాత్రం ఇంకా సవరించిన జీఎస్టీ తగ్గింపు అమలు చేయడం లేదు. పాత స్టాక్ పూర్తయ్యే వరకు పాత జీఎస్టీతో కూడిన ధరలే కొనసాగుతాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం, సోమవారం ఉదయం 'ఆంధ్రజ్యోతి' సూపర్ మార్కెట్లలో విక్రయాలను పరిశీలించింది. నిత్యావసర సరుకులు ముఖ్యంగా పార్లే-జీ బిస్కెట్ ప్యాకెటు గతంలో రూ. 10 ఉండగా, సోమవారం నుంచి రూ. 9 కు విక్రయిస్తున్నారు. అన్ని రకాల బిస్కెట్ ప్యాకెట్లపై 10 శాతం జీఎస్టీ తగ్గింపు అమలు చేస్తున్నారు. రూ. 40 ఉన్న సంతూర్ సబ్బును రూ. 3 తగ్గించి రూ. 37 విక్రయించారు. 80 మిల్లీలీటర్ల డవ్ షాంపూ బాటిల్‌ను శనివారం రూ. 85 ధర ఉండగా, సోమవారం రూ.74.80 పైసలకు విక్రయించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7370	5300
మక్కలు	2151	1521
కందులు	5402	3022
పెసళ్లు	3852	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	3320	2400
పసుపు (కాడి)	10259	7889
పసుపు (గోల)	9669	8996
తేజ మిర్చి	11500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

అమ్మవారి అనుగ్రహం
అందరిపై ఉండాలి

» వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య
» వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు షురూ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ, ధ్వజారోహణం నిర్వహించి గణపతిపూజ, నవగ్రహారాధన, మండపారాధన, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, కలశస్థాపన, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరిగే ఈ వేడుకలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మవారిని తొలి రోజు బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పం అనంతరం పులగం నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి నవగ్రహ రుద్రసహిత సుదర్శన హోమాన్ని లోకకల్యాణం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారితో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


రుద్రేశ్వరాలయంలో నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బతుకమ్మ విజేతలకు బహుమతులు

ప్రతియేటా మాదిరిగా రాధేశ్యామ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి హనుమకొండ కాపువాడకు చెందిన దివ్య, ద్వితీయ బహుమతి మచిలీబజార్‌కు చెందిన జ్యోతి, తృతీయ బహుమతి కొత్తురుజెండాకు చెందిన సరోజనతోపాటు మరో 40 మందికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీ కావ్య ఈ సందర్భంగా చెప్పారు. కొంత మంది పురావస్తు శాఖ సిబ్బంది ఆలయంలో నవరాత్రి వేడుకలకు అడ్డంకులు కల్పించిన నేపథ్యంలో స్వయంగా పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ అనుమతితో వేడుకలు నిర్వహిం చుకుంటున్నామని చెప్పారు.

ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసారి దేవీ శరన్నవరాత్రి వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ముఖ్య దాతలుగా వ్యవహ రిస్తుండటం విశేషం. గుడిమెల్ల విజయ కుమారాచార్యులు, సందీప్, కార్పొరేటర్ తోట వెంకన్న తదితరులు పాల్గొ న్నా రు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకురాలు కుండె అరుణ రాజ్‌కుమార్ శిష్య బృందంచే కూచిపూడి సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. అదే విధంగా హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన పద్మాక్షి ఆలయంలో భక్తుల కోలాహలం మధ్య సోమవారం నుంచి అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయ అనువంశీయ ధర్మకర్త నాగిళ్ల శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముఖ అవధాని నేతృత్వంలో పూజాదికాలు నిర్వహింపజేసి వేడుకలను ప్రారంభించారు.

స్థానిక ఎన్నికలు నిర్వహించే
దమ్ము సీఎంకు లేదు

• ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు
• వరంగల్ ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి
• మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మేడారం పర్యటనకు వస్తున్న రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి మేడారంలో అడుగుపెట్టాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని రాష్ట్ర మంత్రులు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా ఆరు గ్యారంటీలు, రేవంత్‌రెడ్డి పాటలు వేసి బతుకమ్మలను అవమాన పర్చారని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 చోట్ల యూరియా కోసం క్యూలో నిలబడుతున్నారని, కాంగ్రెస్ వైఫల్యంతో యూరియా కొరత సృష్టిస్తున్నారని విమర్శించారు. లక్షా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ప్రభుత్వం చెబుతుందని పది రోజులు గడిచిపోయిందని అదను తప్పిన తర్వాత యూరియా ఉపయోగం ఉండదని అన్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మ సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీలు రూ. 275 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉందని, రుణమాఫీ 46 శాతం మించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. రాబోయే మేడారం జాతరకు రామప్ప, లక్నవరం ప్రాజెక్టుపై సీఎం రివ్యూ చేసి స్పష్టమైన ప్రకటన చేయాలని జాతర వరకు గోదావరి జలాలు జంపన్న వాగు ద్వారా మేడారం జాతరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్వీ నాయకుడు మాచర్ల శరత్‌చంద్ర, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ డెయిరీ సభ్యులకు దసరా బోనస్

23 వేల మంది సభ్యులకు లబ్ధి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70కోట్ల బోనస్‌ను అందిస్తున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డిలు వెల్లడించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార మహిళా డెయిరీలో సోమవారం వారు విలేకరు లతో మాట్లాడారు. ఈ సంవత్సరం 2.50కోట్ల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించామన్నారు. అప్పుడు రైతులకు వారి పాల నాణ్యతను బట్టి ప్రతి నెలలో బిల్లులు చెల్లించామన్నారు. ప్రస్తుతం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70 కోట్లు బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు. పాల అమ్మకాల్లో వచ్చిన లాభాల్లో నుంచి ఈ బోనస్‌ను అందిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ

రైతు పోసిన ప్రతి లీటర్ పాలకు రూ. 6.22 పైసలు బోనస్‌గా అందిస్తున్నామని తెలిపారు. డెయిరీ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాలోని 23వేల మహిళా డెయిరీ సభ్యులకు బోనస్ లబ్ధి చేకూరు తుందన్నారు. మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లోకి డబ్బులను నేరుగా జమ చేస్తామన్నారు.

పత్తి దిగుమతులపై సుంకం కొనసాగించాలి

» పత్తి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
» హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

గిర్మాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 11 శాతం సుంకాన్ని తిరిగి కొనసాగించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవనంలో రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి పత్తి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడంతో 60 లక్షల మంది పత్తి రైతు కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక పత్తి రైతులు అప్పుల పాలవుతున్నారని విమర్శించారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే మహరాష్ట్ర విదర్భ ప్రాంతంలో 767 మంది ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రైతుల సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం కొనసాగించేలా రైతాంగం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పత్తికి రు.12 వేలు మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలుచేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని తీర్మానం చేశారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఎం.డి.హసాన్, సుదమల్ల భాస్కర్, వెంకన్న, నగేష్, పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి

మేడారానికి కొత్త రూపు

పగిడిద్ద రాజు, గోవిందరాజులు ఈ ఇరుకు ప్రాంగణంతోనే ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో మేడారం మాస్టర్ ప్లాన్‌లో గద్దెల ప్రాంగణం విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి ప్రాంగణ గోడల నుంచి అన్ని వైపులా 20 ఫీట్ల మేర విస్తరించాలని నిర్ణయించారు. దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు, ప్రభుత్వ భూమి 19 ఎకరాలు మొత్తం 23 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణం విస్తరణతో పాటు అతిధి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు, అసైన్డ్ భూముల సేకరణ పెద్దగా ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా భక్తులకు కూడా దర్శనం సులభం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తల్లుల దర్శనానికి నాలుగు దిక్కుల ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రవేశ ద్వారాలతో లోపలికి వచ్చిన భక్తులు.. తల్లులను దర్శించుకుని బయటకు వెళ్లేందుకు నాలుగు ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో భక్తులు బయటకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

జంపన్నవాగులో నీటి నిల్వ

మేడారం జాతరలో జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించటం సంప్రదాయంగా వస్తోంది. జాతర సమయంలో లక్నవరం సరస్సు నుంచి విడుదల చేస్తారు. మేడారం పర్యాటక ప్రాంతంగా మారడంతో ప్రతిరోజూ భక్తులు వస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలను కూడా మేడారంలో నిర్వహించుకునేందుకు భక్తులు వస్తున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేయడం సంప్రదాయం కావటంతో జాతరేతర రోజుల్లో నీళ్లు లేకపోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జంపన్నవాగులో ఏడాదంతా నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జంపన్నవాగుపై రెండు, మూడు చోట్ల చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

2018 మహాజాతర సమయంలో అప్పటి ప్రభుత్వం జంపన్నవాగుపై నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు, గుండ్లమడుగు, రెడ్డిగూడెం, ఊరట్టం వద్ద సుమారు రూ.16 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్‌లు నిర్మించారు. అయితే 2020 మహాజారత నాటికి ఈ చెక్‌డ్యామ్‌లలో పడి సుమారు 15 మందికి పైగా భక్తులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలకు జంపన్నవాగులో నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేయటమే కారణమని భక్తులు విశ్వసించారు.

దీంతో నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ మినహా మిగతా మూడు చెక్ డ్యామ్‌లను గత ప్రభుత్వం కూల్చేసింది. ఈ కూల్చివేతలకు రూ.2.30 కోట్ల వరకు ఖర్చు చేసింది. దీంతో కోట్లాది రుపాయల నిధులు నీళ్లపాలు చేశారనే విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వం ఇలాంటి ఆలోచనే చేస్తుందనే టాక్ వినబడుతోంది. భక్తుల విశ్వాసాలకు భంగం కలుగకుండా జంపన్నవాగులో నిరంతరం నీళ్లు పారేలా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

నేడు సీఎం మేడారం పర్యటన

మహాజాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మేడారానికి ముఖ్యమంత్రి రావడం చరిత్రలో తొలిసారి. 2016లో అప్పటి ప్రభుత్వం మేడారం మహాజాతరకు రూ.150.50 కోట్ల నిధులు కేటాయించింది. కానీ, పనుల ప్రారంభానికి సీఎం హాజరు కాలేదు. ప్రస్తుత జాతరకు రూ.150కోట్లు కేటాయించటంతో పాటు ఆ పనులకు శంకుస్థాపన చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రావటంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2026 జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులను కేటాయించింది.

2024 జాతరకు ప్రభుత్వం ఆలస్యంగా రూ.115కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిలో సుమారు రూ.25 కోట్ల పనులు అప్పట్లో జరగకపోవటంతో.. ఇటీవల ఆ నిధులతో మేడారంలో బీటీ రోడ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అతిధి గృహాలను నిర్మిస్తున్నారు. ఈ అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం పర్యటనలో ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే గద్దెల కొత్త డిజైన్ పనులు, గద్దెల ప్రాంగణం విస్తరణ పనులను సీఎం ప్రారంభించనున్నారు. వీటితో ఐలాపూర్ వరకు రోడ్డు నిర్మాణం, జాతరలో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి సీతక్క మేడారంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పండుగ వేళ విషాదం

» బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి
» మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కొత్తగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంగిలిపూల బతుకమ్మ రోజు అందరి ఇళ్లలో సంతోషాన్ని నింపితే.. ఓ కుటుంబంలో మాత్రం విషాదాన్ని నింపింది. ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో బతుకమ్మ ఆడేందుకు ఇంటి నుంచి అనందంతో వెళ్లిన మహి ళ శవంగా తిరిగివచ్చింది. అప్పటి వరకు అందరితో కలిసి బతుకమ్మ ఆడిన ఆమె మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. బతుకమ్మ ఆటఆడుతూ ఒక్కసారి గుండెపోటు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎంచగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి కుటుం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెం గ్రామానికి చెందిన శెట్టి పరశురాం-మౌనిక (32) దంపతులకు కుమార్తెలు సాహితి, సాయిత్రి, కుమారుడు మన్విత్ ఉన్నారు. భర్త బ్యాం కుమిత్రగా పని చేస్తుండగా, భార్య మౌనిక ఎంచగూడెంలో జిరాక్స్ సెంటర్ నడుపు తోంది.


విషాదంలో భర్త, చిన్నారులు


శెట్టి మౌనిక (ఫైల్)

ఆదివారం సాయంత్రం బతుకమ్మ ఆడేందుకు బతుకమ్మతో మహిళలతో కలిసి గ్రామంలోని బొడ్రాయి వద్ద చేరుకొంది. బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా మౌనిక గుండెపోటు వచ్చి, పడిపోయింది. గమనించిన భర్త, కుటుంబసభ్యులు ఆమెను నర్సంపేట లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.


రాణిరుద్రమ నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కవులు, కళాకారులకు ఓరుగల్లు పెద్దపీట

» సంగీత నాటక ముగింపు వేడుకల్లో ఎంపీ కడియం కావ్య
» అలరించిన ప్రజా సాహిత్య కళారూపాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన కాకతీయ నృత్య కళారూపాల ముగింపు వేడుకలను ఎంపీ కడియం కావ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వరంగల్ అంటేనే కవులకు, కళాకారులకు అనాదిగా నిలయంగా బాసిల్లుతుందన్నారు. మహాకవి బొమ్మెర పోతన, పాల్కుర్కి సోమనాథుడు మొదలు కాళోజీ దాక అనేక మంది మహానుభావుల వారసత్వాన్ని స్వీకరించిన కవులు, రచయితలు నేరెళ్ల వేణుమాధవ్ లాంటి అగ్రశ్రేణి కళాకారులకు ఈ గడ్డ వేదికగా నిలిచిందన్నారు. ఇలాంటి ప్రదేశంలో సంగీత నాటక అకాడమి, రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహించిన ముదావహం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కవులకు, కళాకారులకు బాసటగా నిలుస్తుందన్నారు. వరంగల్‌ను సాంస్కృతిక కేంద్రంగా రూపొందించేందుకే కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అలరించిన రాణిరుద్రమ

ఈ సందర్భంగా వరంగల్ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన రాణిరుద్రమ నృత్య రూపకం విశేషంగా అలరించింది. అలనాటి కాకతీయుల చరిత్రను కళ్ల ముందు నిలిపింది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని వీరత్వం రుద్రమదేవి పరాక్రమం ప్రేక్షకులచే కరతాళ ధ్వనులు కొట్టించింది. అదే విధంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొడుస్తున్న పొద్దుమీద లాంటి జనరంజక పాటలు ప్రజా కళాకారుల ప్రదర్శన వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమాల విజయవంతం నేపథ్యంలో ఇకనుంచి రాష్ట్రంలోని అన్ని పాత జిల్లా కేంద్రాల్లో సంగీత నాటక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అలేఖ్య పుంజాల ప్రకటించారు.

తాత్కాలిక బదిలీలపై గందరగోళం

» అనాలోచితంగా నిబంధనలు
» ఒకే జిల్లాలో కొనసాగుతున్నవారి సంగతేమిటి?
» సీనియారిటీ ప్రాతిపదికనే కేటాయించాలి
» నష్టపోయిన వారికి తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలి
» బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్

హనుమకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 190పట్ల కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో ఊరట వ్యక్తం అవుతుండగా జీవో 317 బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మాత్రం నిరసిస్తున్నారు. జీవో 190 అసంబద్ధ, అనాలోచితమైనదిగా అభివర్ణిస్తున్నారు. ఇతర జిల్లాలు, జోన్లకు బదిలీ అయి ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం కల్పించేలా మంత్రి వర్గం ఉప సంఘం చేసిన సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. జీవో 317 ద్వారా ఒక జోన్ నుంచి మరో జోన్‌కు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన వారికి న్యాయం జరిగేలా జారీ చేసిన జీవో 190 కొంత మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మాత్రమే లాభం జరిగేలా ఉందన్న అసంతృప్తి జీవో 317 బాధిత ఉపాధ్యాయ, ఉద్యోగుల్లోనూ వ్యక్తం అవుతోంది. జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికగా జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల పలువురు ఉద్యోగులు వారు సుదీర్ఘకాలంగా పని చేస్తున్న జిల్లాలోనే తిరిగి కొనసాగే పరిస్థితి ఏర్పడింది. వారి సంగతి ఏమిటని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

సీనియారిటీ ప్రాతిపదికనే బదిలీలు చేయాలి

జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికన జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల మళ్లీ అదే విధంగా ఇప్పుడు ఇచ్చిన తాత్కాలిక బదిలీలను కూడా సీనియారిటీ ప్రాతిపదికనే ఇవ్వాలని 317 జీవో బాధిత ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మ్యూచువల్ బదిలీలను జీవో నెంబర్ 21 ద్వారా చేపట్టారు. ఆ తర్వాత మళ్లీ జీవో 243 ద్వారా మెడికల్ గ్రౌండ్, జీవో 244 ద్వారా స్పౌజ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులను వారి వారి జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో జీవో 317కి ముందు ఎస్‌జీటీగా ఉన్న ఉపాధ్యాయులను ఈ జీవో తర్వాత పదోన్నతిపొందగా వారిని స్పౌజ్ ఉన్న జిల్లాలకు కేటాయించారు. ఇది జీవో 317కు విరుద్ధమని చెబుతున్నారు. ఎందుకంటే జీవో 317లో ఒక జిల్లాను కేటాయించిన తర్వాత పదోన్నతి పొందినవారు స్పౌజ్‌లో ఇంకో జిల్లాకు వెళ్లడం అంటే ఆ వ్యక్తికి జీవో 317 వర్తించనట్టేనంటున్నారు. మళ్లీ మ్యూచువల్ బదిలీలకు సంబంధించి జీవో 245 ద్వారా చేపట్టిన బదిలీల్లో కూడా జీవో 317కు ముందు ఒక క్యాడర్‌లో ఉండి తర్వాత పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కూడా



మ్యూచువల్ బదిలీలో అవకాశం కల్పించారని, ఇది కూడా జీవో 317కు వ్యతిరేకమని అంటున్నారు. జీవో 317 ద్వారా జిల్లాలు కేటాయించినప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించి జిల్లాలను కేటాయించారు. కానీ పరస్పర బదిలీల్లో, స్పౌజ్ బదిలీల్లో మొదట కేటాయించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించపోవడం మరొక అన్యాయమేనని వాపోతున్నారు.

190 అసంబద్ధ జీవో

ఇక ఇప్పుడు జీవో 317 బాధితుల ఉపశమనం కోసం ప్రభుత్వం తాత్కాలిక బదిలీల కోసం జారీ అయిన జీవో 190లో జీవోలు 243, 244, 245, 21 జీవోలలో లబ్ధిపొందిన వారికి అవకాశం లేదన్నది స్పష్టం. ఇంత వరకు బాగానే ఉన్నా జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత ఒక జిల్లా ఉన్నవారికి మాత్రమే ఈ జీవోలో అవకాశం కల్పించారు. కానీ జీవో 317కు ముందు ఆ తర్వాత ఒకే జిల్లాలో పని చేసున్నవాళ్లకు అవకాశం లేదని ఈ జీవోలో పేర్కొన్నారు. అయితే ఇక్కడ జీవో 317కు ముందు, తర్వాత ఒకే జిల్లా కేటాయించబడిన వాళ్లు అప్షన్స్ ఇచ్చే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లానే తీసుకుంటే ఆరు జిల్లాలుగా విభజన జరిగిందని, ఈ జీవో 317 వల్ల ఒక ఉద్యోగి ఆరు ఆప్షన్లు ఇవ్వాల్సి వచ్చిందని, దానిలో మొదటి ఆప్షన్‌గా ఒక జిల్లా రెండో ఆప్షన్‌గా ఇంకో జిల్లా ఇలా ఆరు ఆప్షన్లు ఇచ్చినప్పుడు అందులో మొదటి ఆప్షన్ కాకుండా మిగతా ఆప్షన్లు ఇచ్చిన జిల్లాకు కేటాయించడిన ఆ ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీవో 317 బాధితుడే అవుడాని అంటున్నారు.

ఈ క్రమంలో జీవో 317కి ముందు పని చేసిన జిల్లాను కేటాయించినా అతడు కచ్చితంగా జీవో 317 జీవో బాధితుడే అవుతాడని పేర్కొంటున్నారు. కానీ వారు జిల్లా స్థానికులు కారు. ఆ జిల్లాలో చదవలేదు. అప్పుడున్న పరిస్థితుల్లో వారికి 20 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ బదిలీలలో ఎప్పటికీ ఆ జిల్లాలోని పాఠశాలల్లోనే కేటాయించారు. దానికి వారిని బాధ్యుల్ని చేస్తూ ఇలా అసంబద్ధ, అనాలోచిత జీవో జారీ చేయడం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి తీవ్ర నష్టం జరగడమే కాకుండా అనేక కొత్త సమస్యలకు దారి తీస్తుందని అభిప్రాయపడుతున్నారు. కనుక ప్రభుత్వం స్పందించి జీవో 317లో సీనియారిటీ ఆధారంగా కేటాయించినట్లే జీవో 190ద్వారా కూడా 317వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు గతంలో కేటాయించినప్పటి జాబితా ఆదారంగానే తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలు మారిన వారికే మళ్లీ అవకాశం

2024లో జరిగిన బదిలీల్లో జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత మరో జిల్లా కేటాయించబడిన ఉపాధ్యాయులలో గతంలో పని చేసిన జిల్లా పాఠశాల పాయింట్లతో బదిలీల్లో లబ్ధి పొంది ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాల్లో దగ్గరి ప్రాంతం, రవాణా సౌకర్యం ఉన్న పాఠశాలలకు బదిలీ అయ్యారు. మరి ఇలా బదిలీల్లో జీవో 317కు ముంద తర్వాత ఒకే జిల్లాలో ఒకే పాఠశాలలో పని చేసిన వారికి వర్తించిన పాయింట్లను జీవో 317కి ముందు ఒక జిల్లా ఆ తర్వాత ఒక జిల్లా కేటాయించబడిన వారికి కూడా ఒకే రకమైన విధానాన్ని అనుసరించిన ప్రభుత్వం ఇప్పుడేమో జీవో 190 ద్వారా జిల్లాలను మారిన వారికే అవకాశం కల్పించడం శోచనీయమని అంటున్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

రిజిస్ట్రార్ రామచంద్రంకు ఫిర్యాదు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పేపర్‌వైజ్ అధ్యాపకుల నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ కమిటీని నియమించాలని కేయూ స్కాలర్, క్రికెట్ క్రీడాకారుడు మట్టెడ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మట్టెడ కుమార్ మాట్లాడుతూ.. కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో అనర్హులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పని చేసే అధ్యాపకుడిని తొలగించి.. మళ్లీ విధుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు.

నిబంధనల మేరకు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన పుల్లా ప్రవీణ్‌కుమార్, గూడెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

కాజీపేటలో మునిసిపల్ కమిషనర్ పర్యటన

కాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో సోమవారం బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పర్యటించారు. 62వ డివిజన్ రహ్మత్‌నగర్‌లో డ్రెయినేజీ మూసుకుపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించారు. సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎఫ్‌సీఐ ద్వారా మురుగు వెళ్లేది.. వారు డ్రెయినేజీ మూసివేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పడంతో ఎఫ్‌సీఐలోకి వెళ్లి అధికారులతో సమస్యపై చర్చించారు. ఎఫ్‌సీఐ, మునిసిపల్ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేసి మురుగు నీరు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే సీవేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ప్లాంట్ నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీఈలు, ఏఈలు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఎంజీఎం మార్చురీలో ఉన్న పుర్రె, ఎముకలు

మార్చురీలో పుర్రెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం మార్చురీలో మానవ పుర్రెలు దర్శనమిచ్చాయి. ప్లాస్టిక్ డబ్బాలోనూ కొన్ని రకాలైన అవశేషాలు దర్శనమిచ్చాయి. ఇవి ఎందుకు భద్రపరిచారో ఏమిటో తెలియదు కానీ సోమవారం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ఇప్పటికే ఫోరెన్సిక్ విభాగంలో విలువైన వస్తువులు మాయమైనట్లు గతంలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. మరి ఇవి ఎవరి కోసం ఎందుకోసం భద్రపరుస్తున్నారో ఫోరెన్సిక్ వైద్యులే స్పష్టం చేయాలి.

కళారంగానికి వన్నె తెచ్చిన అలేఖ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ నృత్యనాటక రూప ప్రదర్శన ఇటీవల కాళోజీ కళాక్షేత్రంగా నిర్వహించగా ఈ కళా ప్రదర్శనలో తనదైన శైలిలో కళారంగానికి కొత్తవన్నె తీసుకువచ్చిన పుంజాల అలేఖ్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుందని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైనేని రాజన్ అన్నారు. సోమవారం కళాకారిణి ఆచార్య పుంజాల అలేఖ్యను హను మ కొండ హంటర్‌రోడ్‌లోని గైనేని నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అలేఖ్య ప్రదర్శనను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్, దారం జనార్దన్, సుంకరి వేణుగోపాల్, కోల జనార్దన్, బుక్క కుమార్, కోల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో సంబరాలు



ఎల్ఐసీ పాలసీపై జీఎస్టీ ఉపసంహరణను పురస్కరించుకొని నగరంలో ములుగురోడ్ వద్ద ఉన్న ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం సంబరాలు జరుపుకుంటున్న సిబ్బంది, ఏజెంట్లు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరిన సొంతింటి కల
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం హనుమకొండ, కాజీపేట మండలాలకు చెందిన 135 మంది లబ్ధిదారులకు రూ.1,35,15,600 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 128 మంది లబ్ధిదారులకు రూ. 43, 28,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 262 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ రాయితీ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇం దిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు.పేదల పెళ్లిళ్ల భారం తగ్గించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో అండగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ జిల్లా 20 ఏళ్ల వెనుకబడిపోయిందని దుయ్యబట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు, వరంగల్ నగరాన్ని రెండుగా చీల్చి అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిపిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ గౌడ్, హనుమకొండ ఆర్‌డీవో రమేష్ రాథోడ్, హనుమకొండ , కాజీపేట తహసీల్దార్లు గుజ్జుల రవీందర్‌రెడ్డి, భావుసింగ్, జీడబ్ల్యూ ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, ఏనుగుల మానస రాంప్రసాద్, చీకటి శారద ఆనంద్, పోతుల శ్రీమాన్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, ఎనుకొంటి నాగరాజు, తాళ్లపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఫుడ్ స్ట్రీట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, చిత్రంలో కమిషనర్ చహత్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీధి వ్యాపారులు ఫుడ్ స్ట్రీట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఫుడ్ స్ట్రీట్ వ్యాపారులు ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీధి వ్యాపారులు ఆహార భద్రత సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) వారు అందించే సర్టిఫికెట్లు పొందాలంటే నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మార్కెట్‌లో నాణ్యతగల ఆహార పదార్థాలకు తప్పకుండా డిమాండ్ ఉంటుందన్నారు. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారు మిగిలిన వ్యర్థాలను కవర్‌లలో కట్టి శానిటేషన్ సిబ్బందికి అందించాలన్నారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్లపై వీధి వ్యాపారులు చెత్తను వేయకూడదని నగర పరిశుభ్రత కోసం అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ జోనా, డీఎంసీ రజితరాణి, టీఎంసీలు రమేష్, వెంకట్‌రెడ్డితో పాటు సీవోలు ప్రవీణ్, శ్రీలత, సుజాత, రమాదేవి, అలీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

కొలువుదీరిన దుర్గామాతలు

వడ్డేపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):హనుమకొండలోని వివిధ డివిజన్లలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నేత్ర పర్వంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. సుందరంగా అలంకరించిన మండపాలలో దుర్గామాతలు కొలువుదీరి పూజల ందుకుంటున్నారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లోని గోకుల్ భక్త మండలి ఆధ్వర్యంలో దుర్గామాత 16వ నవరాత్రి మహోత్సవా లను రుత్వికులు ప్రారంభించారు. దుర్గామాతను శైలపుత్రి అలంకరణలో అలంకరించారు. ఈ సందర్భంగా రుత్వికులు అమ్మవారికి అభిషేకాలు, గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, వేద పారాయణం, శ్రీలలిత సహస్ర నామ పారాయ ణాన్ని పఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దుర్గామాతను కొలిచి తరిస్తున్నారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో శరన్నవరాత్రి మహోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. గోపాల్‌పూర్‌లోని దేవరాజ్ కాలనీలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజరాజు గౌడ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాతను శైలపుత్రిగా అలంకరించారు. దుర్గామాత భక్తులకు శైలపుత్రిగా దర్శన మిస్తున్నారు.

శ్వేతార్కలో ..

కాజీపేట : కాజీపేట శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని దేవాలయంలో ఊరేగింపు చేశారు. బ్రహ్మశ్రీ ఐనవోలు రాధాకృష్ణ వర్మ దంపతులు, సాయికృష్ణ శర్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నపూర్ణ భవన్‌లో అన్నదానం చేశారు. ఈ పూజల్లో దేవాలయం వ్యవస్థాపకుడు, చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వర శర్మతోపాటు భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు.



గోకుల్ నగర్‌లో శైలపుత్రి అలంకరణలో దుర్గామాత

అనారోగ్యంతో మాజీ కార్పొరేటర్ మృతి



రావుల సదానందం (ఫైల్)


కాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాజీపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రావుల సదానందం (68) సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈయన 2005 నుంచి 2010 వరకు అప్పటి 32వ డివిజన్ కార్పొరేటర్‌గా వ్యవహరించారు. కార్పొరేటర్‌గా ఎన్నిక కాకముందు కాంగ్రెస్ నగర ఇన్‌చార్జి అధ్యక్షుడిగా పనిచేశారు. జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మంచి సంబంధాలు ఉండేవి. సోమవారం ఆయన మరణ వార్త తెలుసుకుని మాజీ ఎంపీ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్, అరూరి సాంబయ్యలు రావుల సదానందం ఇంటికి చేరుకుని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన సేవలు కొనియాడారు. రావుల సదానందంకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

పింగిళి కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



బత్తిని చంద్ర మౌళి గౌడ్

వడ్డెపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్‌కు న్యూ ఢిల్లీలోని ఫ్రెండ్‌షిప్ ఫోరం సంస్థ ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రీయ ఉద్యోగి రతన్ అవార్డు -2025 లభించింది. ఈ అవార్డుతో మెమెంటో, బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేయనున్నారు. చంద్రమౌళి గౌడ్‌కు అవార్డు రావడంపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. సురేష్ బాబు, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణతోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపి ప్రశంసించారు.



51 ఫీట్ల దుర్గామాత

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని రెడ్డికాలనీలో 51 ఫీట్ల ఎత్తైన దుర్గామాత విగ్రహాన్ని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఎత్తైన విగ్రహం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కూరపాటి వెంకటనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కేయూ రిటైర్డు ప్రొఫెసర్, సామాజిక విశ్లేషకుడు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. సోమవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉమ్మడి వరంగల్ అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డాక్టర్ మధుపాక ఎల్లయ్య, మంకాల యాదగిరిల నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూరపాటి వెంకటనారాయణ, ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1977లో అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటైందన్నారు. ఉమ్మడి వరంగల్‌లో 43 మండల, 1034 గ్రామ శాఖలు ఉన్నాయని తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానంపై అవగాహన, చైతన్య సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడాలని అన్నారు. ఏసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, హేతువాద సంఘం రాష్ట్ర నేత బి.రమాదేవి, రిటైర్డు ప్రొఫెసర్ ఎం. సారంగపాణి, డాక్టర్ పోచయ్యలు హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు ఎల్లవేళలకు కృషి చేయాలని అన్నారు. మృతి చెందిన బొమ్మల కట్టయ్య, నమిండ్ల ఫ్రాన్సిస్, సంగారపు తనీషా, చింత ఎల్లస్వామి, తాటికాయల లక్ష్మయ్య, ప్రొఫెసర్ గుగులోత్ భద్రూనాయక్, అనిశెట్టి రజితలకు నివాళులర్పించారు. అంబేద్కర్ ఆలోచనవిధానాన్ని విస్తరించడంలో కీలక సేవలందించిన పెద్దమ్మగడ్డ రాజేందర్, తొర్రూరు గుండాల నరసయ్య, చిన్నపల్లి కొమురయ్య, నక్క సుదర్శన్, కొమ్ముల సురేందర్, మధుపాక ఎల్లయ్య, యాడాల రవీందర్, ఎనుట్ల రవీందర్‌లకు ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో చిట్యాల బాబు, నీరుడు సామ్యూల్, బొమ్మల అంబేద్కర్, తప్పట్ల వీరన్న, పుల్లా మల్లయ్య, రౌతు రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని ఓ సెక్షన్‌లో పని చేస్తున్న మహిళా ఉద్యోగినిపై అనుచితంగా ప్రవర్తించిన సీనియర్ అసిస్టెంట్‌ను వెంటనే సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని పలు దళిత సంఘాల నాయకులు కలెక్టర్ స్నేహ శబరీష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దళిత మహిళా ఉద్యోగినిపై అనుచితంగా ప్రవర్తించి 10 రోజులవుతున్నా నామమాత్రంగా కలెక్టర్ నుంచి బదిలీ చేశారే కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే అతడిపై చర్యలు తీసుకుని దళిత మహిళా ఉద్యోగినికి న్యాయం చేయాల ని వారు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు మన్నె బాబురావు, కేయూ జాక్ చైర్మన్ మంద వీరస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అంకేశ్వరపు రాంచందర్, డీబీఎఫ్ రాష్ట్ర మహి ళా నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షులు కొమ్ముల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మేకల అనితతో పాటు పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

సెలవుల్లో తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి



వరంగల్ డీఈవో రంగయ్యకు ఫిర్యాదు చేస్తున్న టాప్సా నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటిస్తే అందుకు విరుద్ధంగా వరంగల్, హనుమకొండ జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని తెలంగాణ ఆల్ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ ఆరోపించారు. సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం వరంగల్, హనుమకొండ డీఈవోలు రంగయ్య, వాసంతికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకుందం, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు మురళి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి లేక అవస్థలు

- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- సమ్మయ్య నగర్‌లో మార్కెట్ ఏర్పాటు చేయాలని చిరు వ్యాపారుల వినతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో కూరగాయల మార్కెట్లు లేక చిరు వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు జరుపుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కూడళ్ల వద్ద వ్యాపారాలను నిర్వహించడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. హనుమకొండ సమ్మయ్య నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు, చిరు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం ఎమ్మెల్యేలకు వినతి

హనుమకొండలోని గోపాల్‌పూర్, సమ్మయ్య నగర్, ఆదర్శ నగర్, అంబేద్కర్ భవన్ ప్రాంతం, వడ్డెపల్లి చర్చి, ఇందిరా నగర్, భవాని నగర్, గోకుల్ నగర్ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు రోడ్లపై కూరగాయల వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని లష్కర్ సింగారం వంద ఫీట్ల రోడ్డును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 266లో ల్యాండ్, రెవెన్యూ రికార్డుల ప్రకారం 7 ఎకరాల 36 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు పలువురు వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజులతో పాటు జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను పలుమార్లు కలిసి వినతి పత్రాలను సమర్పించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నా సమ్మయ్య నగర్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించాలని పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులకు సిఫారసు కూడా చేశారు. అయినా మార్కెట్ యార్డ్ ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని పలువురు ప్రజా సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇక్కడ మార్కెట్ ఏర్పాటు చేస్తే కూరగాయలు పండించే దేవన్నపేట, ఉనికిచర్ల, పెగడపెల్లి, వంగపహాడ్, అర్వపల్లి, సిద్ధాపూర్, సీతనాగారం, సీతంపేట, ముచ్చర్ల, నాగారం, హసన్‌పర్తి, చింతగట్టు, మునిపల్లి, జయగిరి రైతులకు అందుబాటులో ఉంటుంది.



గోపాల్‌పూర్ జంక్షన్‌లో రోడ్డు పైనే కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

మార్కెట్ ఏర్పాటు చేయాలి

సమ్మయ్యనగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తే హనుమకొండలోని 52, 53, 56, 57, 58, 60 డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. మార్కెట్లు దగ్గర లో లేక ప్రజలు హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రైతు బజార్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతం బాలసముద్రంలోని రైతు బజార్‌లను ఆశ్రయిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని ప్రజలు రోడ్లపైనే విక్రయిస్తున్న చిరు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హనుమకొండ సమ్మయ్య నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

టి.దశరథం, ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు, గోపాల్‌పూర్



హనుమకొండ లష్కర్ సింగారం రెవెన్యూ పరిధి సమ్మయ్య నగర్‌లోని సర్వే నంబర్ 266లో గల ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చాము. సమ్మయ్య నగర్‌లో మార్కెట్ ఏర్పాటు చేస్తే సుమారు 50 కాలనీల ప్రజలకు కూరగాయలు అందుబాటులో ఉంటాయి.

వేడుక

నేడు ముద్దపప్పు బతుకమ్మ



బతుకమ్మ వేడుకల్లో మూడో రోజైన ఆశ్వయుజ శుద్ధ విదియ (మంగళవారం) నాడు మూడు ఎత్తుల్లో పూలను పేర్చి, శిఖరం మీద గౌరమ్మను ఉంచుతారు. పేర్పులో చామంతి, మందార తదితర పూలను ఉపయోగిస్తారు. ప్రధానంగా ముద్దపప్పును నివేదిస్తారు కాబట్టి 'ముద్దపప్పు బతుకమ్మ'గా వ్యవహరిస్తారు.

ఈ రోజు నైవేద్యం: ముద్దపప్పు, పాలు, బెల్లంతో చేసిన వంటకాలు

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం

శ్రీ శ్రీ గాయత్రీ దేవి

ఆశ్వయుజ శుద్ధ విదియ, మంగళవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిస్తారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టానదేవత. ఆ తల్లి అధిష్టాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్నకాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్నిస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని, పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి.

నైవేద్యం: అల్లం గారెలు, ఐదురకాల పిండివంటలు
అలంకరించే చీర రంగు: తెలుపు
పారాయణ: గాయత్రీ మంత్రం

వెయిట్ లాస్

బరువు తగ్గడం కోసం సరైన ఆహారాన్ని ఎంచుకోవడమే కాదు, ఆ ఆహారాన్ని ఎక్కువ సార్లు నమిలి తినాలి. అలాగే ఆహార వేళలు, నిద్రవేళలు కూడా క్రమం తప్పకుండా పాటించగలిగితే, తక్కువ సమయంలో ఎక్కువ బరువును వదిలించుకోవడం కష్టమేమీ కాదని తాజాగా నటుడు మాధవన్ నిరూపించారు. మాధవన్ పాటించిన నియమాల్లో ఎలాంటి రహస్యాలు దాగి ఉన్నాయో వైద్యులు వివరిస్తున్నారు.



ఇలా చేస్తే.. బరువు బలాదూర్

ఉపవాసాలు, వ్యాయామాలు, ఆహార నియమాలు... ఇలా బరువు తగ్గడం కోసం అనేక ప్రయత్నాలు చేసి విసిగిపోయినవాళ్లు, అందుకు అడ్డుపడే ఇతరత్రా అంశాల మీద కూడా దృష్టి పెట్టాలి. బరువు తగ్గకపోగా, కడుపుబ్బరం, అజీర్తి లాంటివి ఇబ్బంది పెడుతున్నప్పుడు ఫుడ్ ఇన్‌టాలరెన్స్, ఫుడ్ అలర్జీలను కూడా పరీక్షించుకోవాలి. అలాగే కొన్ని పదార్థాలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. వీటిలో అత్యధిక చక్కెరను కలిగి ఉండే పదార్థాలు ప్రధానమైనవి. వీటితో కీళ్ల వాపులు, మలబద్ధకం, పొట్టలో వాయువులు, నొప్పులు వేధిస్తాయి. అలాగే ఇన్‌ఫ్లమేషన్ బరువు తగ్గే ప్రయత్నాలకు అడ్డుపడుతూ ఉంటుంది. కాబట్టి ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా ఉండే రంగురంగుల పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్ తినాలి. వీటితో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, బరువు తగ్గే ప్రక్రియ ఊపందుకుంటుంది. అలాగే ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రోత్సహించే ఫాస్ట్ ఫుడ్స్, నూనెలో వేయించిన పదార్థాలు, తీయని పానీయాలు తీసుకోవడం మానేయాలి.

రాత్రి భోజనం సాయంత్రమే...

రాత్రి తినే భోజనానికీ ఉదయం తీసుకునే అల్పాహారానికీ మధ్య కనీసం 12 గంటల నిడివి ఉండాలి. కానీ రాత్రి ఆలస్యంగా 12 గంటలకు తిని, ఉదయాన్నే 8 గంటలకే బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థకు సరిపడా విశ్రాంతి అందదు. అలాగే సాయంత్రానికి మన మనసు, శరీరం, అంతర్గత అవయవాలన్నీ విశ్రాంత స్థితిలోకి చేరుకోవడం మొదలుపెడతాయి. కాబట్టి సాయంత్రం వీలైనంత పెందలాడే భోజనం ముగించేయడం మంచిది. ఈ అలవాటును అలవరుచుకోవడం వల్ల తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమయ్యే సమయం చిక్కుతుంది.

మూడు భోజనాలు తినొచ్చు

కొంతమంది రోజుకు రెండు భోజనాలు, ఒక భోజనానికే పరిమితమైపోతూ ఉంటారు. కానీ నిజానికి రోజుకు మూడుసార్లు లేదా సాయంత్రం ఐదు గంటలకు ఒక స్నాక్‌తో కలిపి నాలుగు సార్లు తింటూ కూడా బరువు తగ్గొచ్చు. అయితే తిన్న ప్రతిసారీ ఏం తింటున్నామన్నది గమనించుకోవాలి. రోజుకు సరిపడా క్యాలరీలను అందించే ఆహారాన్ని మూడు, నాలుగు భాగాలుగా విభజించుకుని తినడం వల్ల బరువు పెరిగే సమస్య ఉండదు. అదనపు క్యాలరీలు అందించే ఆహారంతోనే అసలు సమస్యంతా! కాబట్టి ఒంటిపూట భోజనంతో, లేదా రెండు పూటల భోజనంతో అవసరానికి మించి ఎక్కువ క్యాలరీలు తీసుకోడానికి బదులుగా మూడు భోజనాలతో తక్కువ క్యాలరీలు పొందుతూ బరువును తగ్గించుకోవచ్చు. అలాగే ఆహారంలోని క్యాలరీలతో పాటు అందే ప్రొటీన్ పరిమాణం మీద కూడా దృష్టి పెట్టాలి. భోజనంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

అన్నం, రోటీలతో పొట్టను నింపేస్తే అవి త్వరగా జీర్ణమై తరచూ ఆకలి వేధిస్తుంది. కాబట్టి సంతృప్తితో పాటు సరిపడా పోషకాలను అందించే కూరగాయలు ఎక్కువగా, అన్నం, రోటీలు తక్కువగా తీసుకోవాలి. అందుకోసం భోజన పళ్లెంలో పావు వంతును మాత్రమే అన్నం లేదా రోటీతో నింపుకోవాలి. ఇంకొక పావు వంతు సలాడ్/కూరగాయలు, పావు వంతు ప్రొటీన్ (చికెన్/చేపలు/గుడ్లు/రాజ్మా, సెనగలు), పావు వంతు పప్పు, పెరుగుతో నింపేయాలి.



నిద్ర.. నీళ్లు

రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోయినా, సరిపడా నిద్రపోకపోయినా శరీరానికి కోలుకునే సమయం దక్కదు. దాంతో భౌతిక ఒత్తిడి పెరుగుతుంది. ఆలస్యంగా నిద్రపోయేవాళ్లు రాత్రి భోజనం తర్వాత కూడా చిరుతిళ్లు తినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ విధంగా అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుని బరువు పెరుగుతారు. అలాగే తిన్నది పూర్తిగా జీర్ణమవడానికి సరిపడా నీళ్లు అవసరం. కాబట్టి రోజుకు కనీసం రెండు నుంచి రెండున్నర లీటర్ల నీళ్లు తీసుకోవాలి.

ఆహారం నమిలి తినాలి

ఆహారాన్ని హడాహుడిగా, ఆదరాబాదరాగా తినేయడం సరికాదు. చక్కగా నమిలి తినడం వల్ల, తినే వేగం తగ్గి, తక్కువ ఆహారం తినగలుగుతాం. అలాగే ఆహారం తింటున్న సంకేతాలు మెదడుకు అంది తక్కువ ఆహారంతోనే సంతృప్తి చెందగలుగుతాం! ఆహారాన్ని చక్కగా నమిలి తినడం వల్ల, జీర్ణాశయానికి శ్రమ తగ్గుతుంది. పోషక శోషణ పెరుగుతుంది.

వ్యాయామం ఇలా...

కండరాలు క్యాలరీలను చక్కగా ఉపయోగించుకోవాలంటే, కండరాలను పెంచే రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయాలి. ప్రత్యేకించి బరువు తగ్గాలనుకునేవాళ్లు గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలతో పాటు కండరాలు పెరిగే వ్యాయామాలు చేయడం తప్పనిసరి.

ఆరోగ్య సూత్రాలు

నటుడు మాధవన్ అనుసరించిన ఆహార సూత్రాలను మనం కూడా అనుసరించవచ్చు. అందుకోసం పాటించవలసిన నియమాలు ఇవే!

- తింటున్న ఆహారం మీద దృష్టి పెట్టాలి. తినేటప్పుడు ఫోన్లు, టివిలకూ, కబుర్లకూ దూరంగా ఉండాలి. ప్రతి ముద్దనూ ఎక్కువ సార్లు నమిలి తినాలి.
- ఆహార వేళలు కచ్చితంగా పాటించాలి. రోజులో చివరి భోజనం వీలైనంత త్వరగా (సాయంత్రం 6-7 గంటలు) ముగించాలి.
- ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయొచ్చు. అందుకోసం ఎవరికి వారు వారి జీవనశైలిని బట్టి 12 నుంచి 14 గంటల రాత్రి ఉపవాసం పాటించాలి. మధుమేహులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఉపవాసం విషయంలో వైద్యుల సలహా తీసుకోవాలి.
- ఆహారంలో కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, ప్రొటీన్ పెంచి, పాలిష్ పట్టిన పదార్థాలు, చక్కెర, కొవ్వు పదార్థాలు తగ్గించాలి.
- నడక, రెసిస్టెన్స్ ట్రైనింగ్, సరిపడా నిద్ర, నీళ్లు.. వీటి మీద దృష్టి పెట్టడంతో పాటు, నిద్రకు ముందు స్క్రీన్ టైమ్ తగ్గించాలి. కంటినిండా నిద్రపోవాలి.
- అలర్జీలు, ఇన్‌టాలరెన్స్‌లు ఎవరికి వారు గమనించుకోవాలి. కడుపుబ్బరం, అజీర్తి, అపానవాయువులు, దురదలు లాంటివి వేధిస్తూ ఉంటే వైద్యులను కలవాలి.
- సాధారణంగా బరువు తగ్గడం కోసం, తీసుకుంటున్న క్యాలరీలు, ఖర్చవుతున్న క్యాలరీల మీదే దృష్టి పెడుతూ ఉంటాం. కానీ ఆహారాన్ని ఎలా నములుతున్నాం, ఎంత తింటున్నాం, ఎప్పుడు తింటున్నాం, ఎంత నిద్రపోతున్నాం అన్నది కూడా ముఖ్యం. వీటిని ఎవరికి వారు పరిశీలించుకుని, వైద్యుల సూచనల మేరకు ఆహార, వ్యాయామ నియమాలను పాటించగలిగితే ఆరోగ్యకరమైన తీరులో అధిక బరువును వదిలించుకోవచ్చు.

హరిత శ్యామ్ బి
హెచ్ఒడి ఆఫ్ డైటరీ,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్



అవగాహన



రష్యా, తాజాగా క్యాన్సర్‌ను అడ్డుకునే 'ఎంటెరోమిక్స్' వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిందనే వార్తలు వింటున్నాం. అయితే ఈ వ్యాక్సిన్‌తో అన్ని రకాల కాన్సర్ల నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చా? ఇది నిజం కాదని అంటున్నారు వైద్యులు. ఈ వ్యాక్సిన్ సామర్థ్యం, అడ్డుకునే క్యాన్సర్ రకం గురించి ఇలా వివరిస్తున్నారు.

క్యాన్సర్ టీకాలో నిజమెంత?

ఒక టీకా అందుబాటులోకి రావాలంటే అది కొన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. ఒక టీకాను సురక్షితమైనదిగా, సమర్థమైనదిగా పరిగణించడం కోసం ప్రి క్లినికల్ స్టడీస్ చేపడతారు. ఈ స్టడీస్‌లో భాగంగా టీకా ప్రభావాన్ని పరిశీలించడం కోసం మొదట జంతువుల మీద పరీక్షించడం జరుగుతుంది. ఈ పరీక్షలో టీకా వల్ల జంతువుల్లో ఎలాంటి దుష్ప్రభావాలూ కనిపించకుండా, సామర్థ్యం కూడా ఉన్నట్టు నిర్ధారణ అయిన తర్వాతే మనుషుల మీద పరీక్షలు చేపట్టడం మొదలుపెడతారు. మనుషుల మీద చేపట్టే పరీక్షలు మూడు దశల్లో కొనసాగుతాయి. ఈ మూడు దశల్లో ఉత్తీర్ణత సాధించగలిగిన టీకా లేదా ఔషధాలను మాత్రమే మార్కెట్లోకి విడుదలవుతాయి. ఈ మూడు దశల్లో ఏ ఏ అంశాలను పరీక్షిస్తారంటే...

మొదటి దశ పరీక్ష: ఈ టీకాను 50 నుంచి 100 మందికి ఇస్తారు. రోగి భద్రతకు సంబంధించిన పరీక్ష ఇది. టీకా ఇచ్చినప్పుడు రోగి క్షేమంగా ఉన్నాడా, లేదా అన్నది ఈ పరీక్షలో పరిశీలిస్తారు. టీకా ఈ పరీక్ష నెగ్గితే, ఆ తర్వాత సామర్థ్యాన్ని పరీక్షిస్తారు

రెండో దశ పరీక్ష: ఇది సామర్థ్య పరీక్ష. ఈ పరీక్షలో టీకా సామర్థ్యంతో పాటు తర్వాతి దశ పరీక్షకు వెళ్లాలా, వద్దా అన్నది నిర్ణయిస్తారు. సదరు టీకాను క్యాన్సర్ నివారణకు ఉపయోగించుకోవచ్చా, లేదా అన్నది ఈ పరీక్షతో నిర్ధారిస్తారు. అలాగే కొత్త టీకాతో కీమోథెరపీ తగ్గించుకునే వీలుందా, లేదా అన్నది కూడా పరీక్షిస్తారు.

మూడో దశ పరీక్ష: ఈ టీకాను సమాజంలోకి ప్రవేశపెట్టినప్పుడు, దీని ప్రభావం గణనీయంగా ఉంటుందా, లేదా అన్నది ఈ పరీక్షలో పరిశీలిస్తారు. ఈ పరీక్షలో ముందు నుంచి వాడుకలో ఉన్న ఔషధాలతో, తాజా టీకాను సరిపోల్చి చూస్తారు. కొత్త టీకా అదనపు ప్రయోజనాన్ని అందించగలుగుతుందా, లేదా అన్నది ఈ పరీక్షలో కనిపెడతారు. అలా అన్ని విధాలా గణాంక విశ్లేషణ చేసిన తర్వాతే టీకాను మనుషులకు ఉపయోగించవచ్చని నిర్ధారిస్తారు. ముందు రెండు పరీక్షల్లో నెగ్గి, మూడో దశలో విఫలమైనా ఈ టీకా అందుబాటులోకి రాదు.

ఎంటెరోమిక్స్ పరిశోధన దశలోనే...

తాజా రష్యా టీకా ఎంటెరోమిక్స్, ఇంకా పరిశోధన దశలోనే ఉందనే విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి. రష్యన్ ఫెడరల్ అండ్ మెడికల్ బయలాజికల్ ఏజెన్సీ, ఎంటెరోమిక్స్‌ను 'ఎమ్ఆర్ఎన్ఎ' వ్యాక్సిన్‌గా ప్రకటించింది. ప్రి క్లినికల్ ట్రయల్‌లో భాగంగా ఈ టీకాను జంతువుల మీద పరీక్షించినప్పుడు, వాటిలో కణితి పరిమాణం తగ్గినట్టు, ఈ టీకాతో జంతులు సురక్షితంగానే ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత మొదటి దశ పరీక్షలో భాగంగా పెగ్గపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్న 48 మంది రోగులకు మాత్రమే ఈ టీకాను ఇవ్వడం జరిగింది. వీరిలో కూడా ఎటువంటి దుష్ప్రభావాలూ కనిపించలేదు. అయితే ఈ టీకా సామర్థ్యం కచ్చితంగా ఏ మేరకు ఉంటుందన్నది మున్ముందు చేపట్టబోయే రెండు, మూడో దశ పరీక్షల్లో మాత్రమే వెల్లడవుతుంది. దీన్నిబట్టి ఒకవేళ ఈ టీకా అన్ని పరీక్షలు ముగించుకుని అందుబాటులోకి వచ్చినా, ఇది అన్ని రకాల క్యాన్సర్లనూ నివారించదనీ, కేవలం పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటుందనే విషయం మర్చిపోకూడదు. అలాగే ఈ టీకా రెండు, మూడో దశ పరీక్షలు పూర్తి చేసుకోవడానికి కూడా కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. కాబట్టి అర్థం లేని అపోహలను విశ్వసించకుండా, అన్ని పరీక్షలు ముగించుకుని ఈ టీకా అందుబాటులోకి వస్తుందనే ఆశావహ దృక్పథంతో నడుచుకోవడం ఉత్తమం.

డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుపట్టు
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ

తుంటి కీలు మార్పిడి అంతకంతకూ సులభతరమవుతోంది. తాజాగా 'డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్' అనే అత్యాధునిక శస్త్రచికిత్సా విధానమొకటి అందుబాటులోకొచ్చింది. పూర్తి తుంటి కీలును మార్చే ఈ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ, అన్నివిధాలా సురక్షితమైనదని వైద్యులు అంటున్నారు.

తుంటి కీలు మార్పిడి ఇక సులభతరం

శరీరం ముందు వైపు నుంచి తుంటిని చేరుకుని, కీలును మార్చే సర్జరీ, డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్. చిన్నపాటి కోతతో, కచ్చితమైన రోబోటిక్ సాంకేతికతతో సాగే ఈ శస్త్రచికిత్సలో భాగంగా వైద్యుల కండరాల మధ్య నుంచి తుంటిని చేరుకుంటారు కాబట్టి కండరాలు, మృదు కణజాలలకు నష్టం జరగకుండా ఉంటుంది.



కచ్చితత్వంతో కూడిన శస్త్రచికిత్స

సిటి స్కాన్స్ ఆధారంగా రోగికి సంబంధించిన ఒక త్రిడి మోడల్‌ను రూపొందించుకుని, వైద్యులు రోబోటిక్ అసిస్టెన్స్ సహాయంతో, సర్జరీకి పూనుకుంటారు. సర్జరీ కంటే ఎంతో ముందుగానే పూర్తి శస్త్రచికిత్సను వైద్యులు ప్రణాళికాబద్ధంగా అంచనా వేసుకుంటారు. దాంతో ఇంప్లాంట్ పరిమాణం, దాన్ని అమర్చే ప్రదేశాల గురించిన కచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోగలుగుతారు. అలాగే రోబోట్ వ్యవస్థ, ఎప్పటికప్పుడు అందించే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వైద్యులు చికిత్స మీద నియంత్రణను పెంచుకుంటూ, సమర్థమైన ఫలితాన్ని రాబట్టేలా, ఎలాంటి దుష్ప్రభావాలకూ తావు లేని కచ్చితత్వంతో కూడిన చికిత్సను అందించగలుగుతారు.

చిన్న కోత ద్వారా...

ఈ శస్త్రచికిత్స చిన్న కోతతోనే పూర్తయిపోతుంది. కాబట్టి సర్జరీ తదనంతర నొప్పి ఎంతో తక్కువగా ఉంటుంది. అలాగే సర్జరీ నుంచి వేగంగా కోలుకోగలుగుతారు. ఈ ప్రయోజనాలకు తోడు సర్జరీలో ఉపయోగించిన ఇంప్లాంట్ ఆయుష్షు కూడా ఎక్కువగా ఉంటుంది. కండరాల కోత ఉండదు కాబట్టి సర్జరీ తర్వాత రోగులు అన్ని రకాల పనులూ చేసుకోగలుగుతారు.

డాక్టర్ కృష్ణ కిరణ్ ఈచెంపాటి
హిప్ అండ్ నీ రీప్లేస్‌మెంట్ అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్, హైదరాబాద్



వ్యాయామం

బరువులు ఎత్తుతున్నారా?

ప్రి మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులు, మొండి కొవ్వులు హార్మోన్ల అవకతవకల ప్రధాన లక్షణాలు. ఇలా హెచ్చుతగ్గులకు లోనయ్యే హార్మోన్లను గాడిలో పెట్టాలంటే మహిళలు తప్పనిసరిగా స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలు చేయాలి.




స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కేవలం కండరాల వ్యాయామం మాత్రమే కాదు. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్, ఇన్సులిన్, కార్టిసాల్, టెస్టోస్టిరాన్ హార్మోన్ల క్రమబద్ధీకరణకు ఈ వ్యాయామం అవసరం. బరువులు ఎత్తడం హార్మోన్ చికిత్సతో సమానం. బరువులు ఎత్తడం వల్ల శరీరంలో అదనపు ఈస్ట్రోజన్ తగ్గడంతో పాటు ప్రొజెస్టరాన్ సహజసిద్ధంగా పెరుగుతుంది. ఫలితంగా నెలసరి నొప్పులు, భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులు అదుపులోకొచ్చి, నెలసరి కూడా గాడిలో పడుతుంది. అలాగే బరువులెత్తే వ్యాయామాలతో కండరాలు బలపడి, గ్లూకోజ్‌ను నిల్వ ఉంచుకునే సామర్థ్యం మెరుగుపడి, రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇలాంటి ఇన్సులిన్ సంతులనం శక్తిని అందిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. అండాల విడుదలను క్రమబద్ధం చేస్తుంది. ఆకలిని అదుపులో ఉంచుతుంది. బరువులెత్తే వ్యాయామాలతో నాడీ వ్యవస్థ దృఢపడుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కాకుండా ఒత్తిడిని తగ్గించుకునే సామర్థ్యం పెరుగుతుంది. 40 ఏళ్ల వయసు మహిళలు బరువులెత్తే వ్యాయామాలు చేయగలిగితే, ఎముకల సాంద్రత పెరుగుతుంది. పొట్ట కొవ్వు తగ్గుతుంది.కండర క్షీణత తగ్గుతుంది.

విత్తనాలు - ఉపయోగాలు

తెలుసుకుందాం

విత్తనాలు పోషకభాండాగారాలు. ఎన్నో విలువైన పోషకాలు విత్తనాల్లో ఉంటాయి. కాబట్టి వాటిని ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. ఏ విత్తనాల్లో ఏఏ పోషకాలుంటాయో, వాటితో ఎలాంటి ప్రయోజనాలను పొందవచ్చో తెలుసుకుందాం!



గుమ్మడి: వంద గ్రాముల గుమ్మడి విత్తనాల్లో... ప్రొటీన్ 24.54 గ్రాములు, పిండిపదార్థాలు 17.81 గ్రాములు, కొవ్వులు 45.85 గ్రాములు, 541 కిలో క్యాలరీలు ఉంటాయి. వీటితో నిద్ర మెరుగుపడుతుంది. వీటితో దొరికే జింక్‌తో క్యాన్సర్ నుంచి రక్షణ దక్కుతుంది.

చియా: వీటిలో ప్రొటీన్ 17 గ్రాములు, పిండిపదార్థాలు 42 గ్రాములు, కొవ్వులు 31 గ్రాములు, 486 కిలోక్యాలరీలు ఉంటాయి. వీటితో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. వీటిలోని పుష్కలమైన ఒమేగా3 యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్స్‌తో ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది

అవిసె: వీటిలో ప్రొటీన్ 18 గ్రాములు, పిండిపదార్థాలు 29 గ్రాములు, కొవ్వులు 42 గ్రాములు, 534 కిలో క్యాలరీలు ఉంటాయి. వీటితో మలబద్ధకం వదులుతుంది. హార్మోన్ల హెచ్చుతగ్గులు అదుపులోకొస్తాయి. జీర్ణశక్తి పెరుగుతుంది.

పొద్దుతిరుగుడు: వీటిలో ప్రొటీన్ 21 గ్రాములు, పిండిపదార్థాలు 20 గ్రాములు, కొవ్వులు 51 గ్రాములు, 584 కిలోక్యాలరీలు ఉంటాయి. గుండె పనితీరు మెరుగుపడుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

జీఎస్టీ తగ్గినా.. మేం తగ్గించేదే లే..!

TAX INVOICE/BILL OF SUPPLY

Invoice No.: 250936G003807629 | Place Of Supply : TELANGANA (36)
Order No.: SPJUPHNML71772A | Date : 21-09-2025

Bill To: C8PP+6H2, Gachibowli, Hyderabad, Telangana 500111, India | Ship To: C8PP+6H2, Gachibowli, Hyderabad, Telangana 500111, India

SR No	Item & Description	HSN	Qty	Product Rate	Disc.	Taxable Amt.	CGST	S/UT GST	CGST Amt.	S/UT GST Amt.	Cess	Cess Amt.	Total Amt.
1	Mysore Sandal Soap 125 g	34011190	1	58.47	0.00%	58.47	9.00%	9.00%	5.26	5.26	0.00% + 0.00	0.00	69.00
2	Himalaya Anti-Hair Fall Bhringa Shampoo 340 ml	33051090	1	278.80	11.85%	245.76	9.00%	9.00%	22.12	22.12	0.00% + 0.00	0.00	290.00

21-9-2025 నాటి బిల్లు

TAX INVOICE/BILL OF SUPPLY

Invoice No.: 250936G003966927 | Place Of Supply : TELANGANA (36)
Order No.: UHQOPHNM172448A | Date : 22-09-2025

Bill To: C8PP+6H2, Gachibowli, Hyderabad, Telangana 500111, India | Ship To: C8PP+6H2, Gachibowli, Hyderabad, Telangana 500111, India

SR No	Item & Description	HSN	Qty	Product Rate	Disc.	Taxable Amt.	CGST	S/UT GST	CGST Amt.	S/UT GST Amt.	Cess	Cess Amt.	Total Amt.
1	Mysore Sandal Soap 125 g	34011190	1	65.71	8.69%	60.00	2.50%	2.50%	1.50	1.50	0.00% + 0.00	0.00	63.00
2	Himalaya Anti-Hair Fall Bhringa Shampoo 340 ml	33051090	1	313.32	11.85%	276.19	2.50%	2.50%	6.90	6.90	0.00% + 0.00	0.00	290.00

22-9-2025 నాటి బిల్లు

క్విక్ కామర్స్ సంస్థ బాదేసింది..

ఉత్పత్తి మూల ధరల్లో తేడాలు చూపి.. జిమ్మిక్కు

అంతిమంగా వినియోగదారుల జేబులకు చిల్లు

జీఎస్టీ తగ్గింపు సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. అన్ని సంస్థలూ పన్ను తగ్గింపు లబ్ధిని వినియోగదారులకు తప్పనిసరిగా అందజేయాలని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెప్పింది. దుకాణాల్లో తగ్గింపు బోర్డులను ప్రదర్శించాలని, సంస్కరణల ఫలాలను ప్రజలకు అందించాలని స్పష్టం చేసింది. చాలా సంస్థలు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందజేస్తుండగా.. క్విక్ కామర్స్ సంస్థలు కొన్ని మాత్రం జిమ్మిక్కులు చేస్తున్నాయి. వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తువులను కేవలం 10 నిమిషాల్లోనే ఇంటికి చేరవేస్తూ.. ప్రజాదరణ పొందిన ఈ సంస్థలు తాజా జీఎస్టీ తగ్గింపును మాత్రం ప్రజలకు అందించడం లేదు. ఆయా సంస్థలు పన్ను తగ్గింపు మేరకు ఉత్పత్తుల ధరలు తగ్గించి వినియోగదారులకు అందిస్తున్నాయా? లేదా? అనేది పరిశీలించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 21న జెప్టోలో మైసూర్ శాండిల్ సోప్, కోల్గేట్ టూత్ పేస్ట్, హిమాలయ షాంపూ, బ్రిటానియా బిస్కట్‌లను ఆర్డర్ చేశారు. మళ్లీ సోమవారం కూడా ఇవే వస్తువులను ఆర్డర్ చేశారు. ఇక్కడే క్విక్ కామర్స్ సంస్థ జిమ్మిక్కు బయటపడింది. 21న ఆర్డర్ చేసిన సోప్ మూల ధరను రూ.58.47 గాను, షాంపూ మూల ధరను రూ.245.76గానూ చూపారు. పాత జీఎస్టీ 18 శాతం ప్రకారం బిల్లు వేశారు. రూ.69, రూ.290 చొప్పున వసూలు చేశారు. 22న చేసిన ఆర్డర్‌లో జీఎస్టీ 5 శాతానికి తగ్గించినప్పటికీ.. సోప్ మూల ధరను రూ.60కు, షాంపూ మూలధరను రూ.276.19కు పెంచి చూపించారు. దీంతో పన్నుల తగ్గింపు అనంతరం మూలధర పన్నులు కలిపి తగ్గాల్సినంత తగ్గలేదు. రూ.61.39కు తగ్గాల్సిన సోప్ ధర రూ.63 అయ్యింది. అలాగే రూ.258.04 ఉండాల్సిన షాంపూ ధర రూ.290 అయ్యింది. అంటే ఉత్పత్తి మూల ధరను పెంచేసి, జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను అందకుండా మోసం చేశారు. ఇది ఒక్క సంస్థలో వెలుగుచూసిన పరిస్థితి. మిగిలిన క్విక్ కామర్స్ సంస్థలు జనాల జేబులకు ఏ మేరకు చిల్లులు పెడుతున్నాయన్నది తెలియాల్సి ఉంది.

- సెంట్రల్ డెస్క్

అధిక లాభాల పేరుతో కోట్లు కొల్లగొట్టిన కిలేడీపై మరో కేసు

- తాజాగా సైబరాబాద్‌లో రూ.41 కోట్ల మోసం వెలుగులోకి..
- మొత్తం రూ.100 కోట్లదాకా వసూలు చేసి ఉండొచ్చని అంచనా
- బినామీ పేర్లతో ఐఏఎస్, రెవెన్యూ అధికారులు పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించిన పోలీసులు!

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన గార్మెంట్స్ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని బురిడీ కొట్టించిన మహిళ.. పదుల సంఖ్యలో మదుపరుల నుంచి పెట్టుబడులు పెట్టించి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు ఇటీవల సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితురాలిని అరెస్టు చేసిన అనంతరం కస్టడీకి తీసుకొని పోలీసులు విచారించడంతో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఆమె మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టిన వారిలో ఓ ఐఏఎస్, ఆర్డీవోలు, పలువురు రెవెన్యూ ఉన్నతాధికారులున్నట్లు సమాచారం. వారంతా నేరుగా కాకుండా బినామీల పేరుతో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టినట్లుగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఈ కేసు విచారణ జరుగుతున్న క్రమంలోనే సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో మరో కేసు నమోదైంది. పెట్టుబడులు పెడితే రూ.లక్షల్లో లాభాలు వస్తాయని నమ్మించి 60 ఏళ్ల వ్యక్తి నుంచి రూ.కోట్లలో కొల్లగొట్టినట్లు సమాచారం. ఈ కేసులో బాధితుడు సుమారు రూ.41 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీసీఎస్‌లో నమోదైన కేసుతోపాటు సైబరాబాద్‌లో కేసును పరిగణనలోకి తీసుకుంటే మొత్తం సుమారు రూ.100 కోట్ల వరకు వసూలు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ముఠాలో మహిళతోపాటు ఆమె భర్త, కొడుకు, వారి స్నేహితుడు భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తనకున్న గార్మెంట్స్ ఫ్యాక్టరీకి పెద్ద పెద్ద టెక్స్‌టైల్స్ సంస్థలతో వ్యాపార భాగస్వామ్యం ఉందని నమ్మబలికినట్లు అందులో వివరించారు.

పాత స్టాకు.. పాత ధరకే!

కొత్త స్టాకుకే కొత్త జీఎస్టీ రేట్లు.. అప్పుడే ధరల తగ్గింపు

- వినియోగదారులకు తేల్చి చెప్తున్న సూపర్ మార్కెట్ల సిబ్బంది
- కొత్త జీఎస్టీ స్లాబులు అమల్లోకి వచ్చినా పాత రేట్లకే అమ్మకాలు
- ఎంఆర్‌పీలను మార్చి స్టిక్కర్లు వేయాలన్న ఆదేశాలు బేఖాతరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ఈ నెల 22 నుంచే(సోమవారం) తప్పనిసరిగా ప్రజలకు అందించాలని కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అంతగా అమలు కాలేదు. దాదాపు అన్ని సూపర్ మార్కెట్లలో నిత్యావసరాలు, ఇతర వస్తువులను ఇంతకుముందున్న ధరలకే విక్రయించారు. అదేమని వినియోగదారులు ప్రశ్నిస్తే.. పాత స్టాకు అయిపోయేవరకు పాత ధరలే ఉంటాయని సూపర్ మార్కెట్ల సిబ్బంది చెప్పుకొచ్చారు. పన్ను తగ్గించిన వస్తువుల జాబితాలో పాలు, పాల ఉత్పత్తులు, బ్రెడ్, బట్టలు, సబ్బులు, టూత్ పేస్టులు, పప్పు దినుసుల వంటివి ఉన్నాయి. వీటిలో కొన్ని జీరో స్లాబ్‌లో ఉండగా, మరికొన్ని 5% స్లాబ్‌లో ఉన్నాయి. దీంతో, సోమవారం నుంచి వీటి ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. మారిన జీఎస్టీ స్లాబుల నేపథ్యంలో పాత స్టాక్ మీద ముద్రించి ఉన్న గరిష్ఠ చిల్లర ధర(ఎంఆర్‌పీ)ను మార్చుకునేందుకు కేంద్రప్రభుత్వం ఈ నెల 9న కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. పాత ఎమ్మార్పీ ధర కనిపించేలా దాని పక్కనే తగ్గించిన ధరలతో స్టిక్కర్లు వేయాలని కంపెనీలను, వ్యాపారులను ఆదేశించింది. అయితే, ఇది ఎక్కడా అమలు కాలేదు. మారిన రేట్లు 22వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని అనేక సూపర్ మార్కెట్లు బోర్డులు పెట్టినా ధరలను తగ్గించలేదు. మెట్టుగూడకు చెందిన ఓ కిరాణా వ్యాపారి ఈ విషయమై మాట్లాడుతూ.."జీఎస్టీ తగ్గిందని తెలుసు కానీ, కొత్త స్టాక్ వచ్చే వరకూ పాత రేట్లకే సరుకులను అమ్ముతాం" అని చెప్పారు. మరో వ్యాపారి.. "మేం పాత ధరలకే స్టాకు కొన్నాం. వాటి ధరను తగ్గించి అమ్మితే మాకు నష్టం కదా" అని బదులిచ్చారు. "బిల్లులే లేనప్పుడు జీఎస్టీది ఏముంది భాయ్. మా దగ్గర ఎప్పుడూ ఒకటే రేటు ఉంటుంది" అని ఓ స్టీలు పాత్రల వ్యాపారి చెప్పడం గమనార్హం. రైల్వే స్టేషన్లలో అమ్మే ఆహారపదార్థాలకు సంబంధించి కూడా జీఎస్టీ ప్రయోజనాలువినియోగదారులకు చేరకపోవడం గమనార్హం.

ప్యాకేజ్డ్ మాంసాహారంపై తగ్గింపు

హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సూపర్‌మార్కెట్‌లో సోమవారం ధరల్లో అంతకుముందుతో పోలిస్తే పెద్ద తేడా కనిపించలేదు. తులిప్స్ వుడ్ టూత్‌పిక్‌పై 18% జీఎస్టీ వసూలు చేశారు. ఒక బాక్సు రూ.45కు విక్రయించారు. అంతకుముందు కూడా దాని ధర రూ.45గా ఉంది. ప్రియా వేరుశనగ వంట నూనె కిలో ధర 21వ తేదీన రూ.156 చొప్పున విక్రయించారు. దీనిపై 12% జీఎస్టీ ఉన్నట్లు చూపారు. ఇదే వస్తువును 22వ తేదీన కొనుగోలు చేయగా రూ.152 విక్రయించారు. ఇక్కడ రూ.4 తగ్గింపు చూపారు. అయితే, వంట నూనెపై జీఎస్టీని 5శాతానికి తగ్గించారు. ఇది అమల్లోకి రాలేదు. ప్రస్తుతం 12శాతం జీఎస్టీ స్లాబు లేదు. కిలో ఆర్గానిక్ హిమాలయ ఉప్పు 21వ తేదీన కొనుగోలు చేయగా 5% జీఎస్టీతో రూ.150 విక్రయించారు. ఇదే వస్తువును 22వ తేదీన కొనుగోలు చేయగా రూ.150కే విక్రయించారు. రాష్ట్రంలో సిమెంట్ బస్తాల రేటు ఎక్కడా తగ్గలేదు. సూపర్ మార్కెట్లలో ప్యాకేజ్డ్ మాంసాహారానికి ధరలను తగ్గించారు కానీ, పనీర్ లాంటి పాల పదార్థాలపై మాత్రం పాత ధరలనే వసూలు చేశారు.



పెద్ద పెద్ద మెడికల్ షాపుల్లోనూ అమలు

వాహనాలు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై మాత్రం వినియోగదారులకు తొలిరోజు నుంచే జీఎస్టీ ప్రయోజనాలు అందాయి. పలు కంపెనీల కార్లు, మోటర్ సైకిళ్ల షాపుల్లో సందడి కనిపించింది. కొన్ని చోట్ల డీలర్లు ముందుగా కార్లను బుక్ చేసుకున్న వారికి కూడా జీఎస్టీ ప్రయోజనాన్ని బదిలీ చేయడం విశేషం. ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు పెద్ద పెద్ద మెడికల్ షాపుల్లోనే అమలైంది. గుండె సంబంధిత వ్యాధుల కోసం వినియోగించే ఓ టాబ్లెట్‌ను గతంలో పది టాబ్లెట్లకు రూ.480 వసూలు చేసేవారు. ఇప్పుడు రూ.420కి అమ్ముతున్నారు.

బిల్లు సేమ్.. జీఎస్టీ బ్రేకప్‌లో తేడా

కరీంనగర్‌లో ఓ మాల్‌లో ఆదివారం (21.9.2025), సోమవారం (22.9.2025) రెండు రోజుల్లో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఒకే రకమైన వస్తువులను కొన్నారు. వాటి ధరలను పోల్చి చూశారు. వాటి మొత్తం ధర రెండు రోజులూ ఒకేలా ఉన్నా.. జీఎస్టీ బ్రేకప్‌లో మాత్రం తేడాగా చూపించారు. ఆదివారం రోజు జీఎస్టీ వివరాల్లో టాక్సెబుల్ ఎమౌంట్ రూ.303.36, సీజీఎస్టీ రూ.24.14, ఎస్‌జీఎస్టీ 24.14, సెస్-జీరో, మొత్తం రూ.351.64 పేర్కొన్నారు. సోమవారం అదే వస్తువులకు జీఎస్టీ బ్రేకప్‌లో టాక్సెబుల్ ఎమౌంట్ 334.90, సీజీఎస్టీ 8.37, ఎస్‌జీఎస్టీ 8.37, సెస్-జీరో మొత్తం రూ.351.64గా పేర్కొన్నారు. వినియోగదారుడి నుంచి వసూలు చేసిన బిల్లు, జీఎస్టీ తగ్గిన తర్వాత కూడా ఏమీ మారలేదు. లాడ్జీ రూముల్లో మాత్రం రెంటుపై జీఎస్టీ తగ్గింది. 12శాతం నుంచి 7శాతానికి తగ్గించి అద్దె వసూలు చేస్తున్నారు.

విశ్రాంత డీఎస్పీ నళినిని ఆదుకుంటాం

- వైద్యం కోసం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది
- నళినిని పరామర్శించి సీఎం సందేశాన్ని వివరించిన జిల్లా కలెక్టర్
- నళినిని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

యాదాద్రి, హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం క్షీణించింది.. మృత్యువుకు చేరువవుతున్నానంటూ మరణ వాంగ్మూలం పేరిట విశ్రాంత డీఎస్పీ నళిని సోషల్ మీడియాలో పోస్టు చేసిన లేఖ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భువనగిరిలోని ఆమె నివాసంలో నళినిని పరామర్శించి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను ఎన్నో రోజులుగా అనారోగ్య సమస్యలతో పాటు, వారం పది రోజులుగా డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా, ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నానని ఆమె తెలిపారు. యోగా చేస్తూ, ఆయుర్వేదం, హోమియోపతి మందులు వాడుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటివరకు అయిన ఖర్చులతో పాటు, భవిష్యత్‌లో అయ్యే వైద్య ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని, నిమ్స్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. సర్వీస్‌కు సంబంధించిన సమస్యలు ఏమి ఉన్నా.. నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామని, వైద్య ఖర్చులను సీఎం నిధుల నుంచి అందిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నళినికి కలెక్టర్ వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు కూడా నళినిని పరామర్శించారు. నళినికి బీజేపీ మద్దతుగా నిలుస్తుందని, ప్రధానమంత్రిని కలుస్తానంటే పార్టీ నుంచి అపాయింట్‌మెంట్ కోరుతామని తెలిపారు. విశ్రాంత డీఎస్పీ నళిని ఆరోగ్య పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ఆవేదన చెందానని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వింటేజ్ పవన్‌కల్యాణ్



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకెళ్లగా, పాటలు సూపర్ హిట్ అయ్యాయి. తాజాగా అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దాదాపు రెండున్నర నిమిషాల పాటూ సాగిన ఈ ట్రైలర్‌లో పవన్ ఎలివేషన్స్, లుక్స్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ ఇచ్చేలా ఉన్నాయి. వింటేజ్ పవన్‌కల్యాణ్‌ను చూశామని ఫ్యాన్స్ సోషల్‌మీడియా వేదికగా సంబరపడిపోతున్నారు. పోరాట ఘట్టాలు, విజువల్స్, ప్రధాన పాత్రధారుల నటన, సంగీతం ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, ప్రియాంక అరుళ్‌మోహన్, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు.

కొత్త సినిమా కబురు




శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న కొత్త సినిమా వివరాలు సోమవారం ప్రకటించారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. దీని టైటిల్‌ను దసరా రోజున ప్రకటిస్తారు. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో రాధిక, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, శత్రు, సాయిచంద్, బ్రహ్మాజీ, ప్రభాస్ శ్రీను, శ్రీకాంత్ అయ్యంగార్, కమెడియన్ సత్య, గుండు సుదర్శన్, మురళీధర్ గౌడ్, సునైనా తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, ఫొటోగ్రఫీ: సాయి శ్రీరామ్, ఎడిటింగ్: చోటా కె ప్రసాద్.

మోదీ జీవన చిత్రం



మలయాళ కథానాయకుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో క్రాంతి కుమార్ సీహెచ్ తెరకెక్కిస్తోన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ 'మా వందే'. సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బేనర్‌పై వీర్ రెడ్డి.ఎం నిర్మిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. సోమవారం ఉన్ని ముకుందన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. 'ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా సినిమాలో చూపించబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది.

ప్రభాస్ చేతుల మీదుగా..



ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కాంతారా: చాప్టర్ 1' చిత్ర ట్రైలర్‌ని రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేశారు. 'నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు'? అనే సంభాషణతో ట్రైలర్ మొదలవుతుంది. 'ఎప్పుడు మనిషి అధర్మం వైపు వెళ్తాడో... ధర్మాన్ని కాపాడ్డానికి ఈశ్వరుడు తన గణాలని పంపుతూనే ఉంటాడు. ఈ అన్ని గణాలు వచ్చి కొలువైంది ఈ పుణ్య భూమిలో...' అనే సంభాషణలు చిత్రాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాయి. ట్రైలర్ చివర్లో ఈశ్వరుడి దర్శనం ఉత్కంఠకు గురిచేసింది. కాగా, రిషబ్‌శెట్టి, హోంబలే ఫిల్మ్స్ కలయికలో వచ్చిన 'కాంతార' బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించింది. ఇప్పుడు అదే చిత్రానికి ప్రీక్వెల్‌గా రాబోతున్న 'కాంతార:చాప్టర్ 1'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కథానాయకుడు రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం అక్టోబరు 2న కన్నడతోపాటు తెలుగు, హిందీ, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

అమలాపురంలో ఓజీ తొలి టిక్కెట్ రూ.60వేలు



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా ప్రీమియర్ షోకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఓ థియేటర్ వద్ద సోమవారం బహిరంగవేలం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఓ యువకుడు రూ.60వేలకు తొలి టిక్కెట్‌ను వేలంపాటలో గెలుచుకున్నాడు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన గుర్రం కృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు మోకా సుబ్బారావు మధ్య ఈ టిక్కెట్‌కు సంబంధించి బహిరంగ వేలంపాట జనసేన నాయకులు, అభిమానుల సమక్షంలో జరిగింది. మోకా సుబ్బారావు రూ.59వేల వరకు వెళ్లారు. గుర్రం కృష్ణ రూ.60వేలకు పాటలో తొలి టిక్కెట్‌ను దక్కించుకున్నారు.

-అమలాపురం, (ఆంధ్రజ్యోతి)

హాస్య చిత్రాలను ఆదరించాలి

- బ్రహ్మానందం



'ఈ సినిమాలో అందరూ కుర్రాళ్లే. అందుకే వీళ్లందరితో కలసి నటించాలనే ఉద్దేశంతో ఈ సినిమా అంగీకరించా. తమ జీవితం ఎలా ఉన్నా, అందరినీ నవ్వించాలనే సిద్ధాంతంతో జీవిస్తున్నవారు హాస్య నటులు. అందుకే వారిని ఆశీర్వదించండి. హాస్యాన్ని బతికించండి. హాస్యం బతికితే అందరూ ఆనందంగా ఉంటారు. ఆనందంగా ఉంటే మంచి పనులు చేస్తాం. మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మంచి ఫలితాలు వస్తే మోక్షం కలుగుతుంది. అందుకే ఇలాంటి మంచి చిత్రాలను అందరూ ఆదరించండి' అని అన్నారు హాస్య నటుడు బ్రహ్మానందం. ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓఐ, రాగ్‌మయూర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్ ప్రధాన పాత్రధారులుగా విజయేందర్ ఎస్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. సినిమా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం నుంచి 'జంబర్ గింబర్ లాలా' అనే పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందంతో పాటు చిత్ర బృందం పాల్గొంది. కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ 'ఏకలవ్య శిష్యుడిగా బ్రహ్మానందం సినిమాలు చూస్తు పెరిగాను. ఈ సినిమా చూసిన వారందరూ కడుపుబ్బా నవ్వుతారని హామీ ఇస్తున్నాను' అని అన్నారు. చిత్ర సమర్పకుడు బన్నీ వాసు మాట్లాడుతూ 'రాబోయే 25 రోజులు సోషల్ మీడియాలో మిత్ర మండలి మాత్రమే కనిపిస్తుంది' అని అన్నారు.

శక్తిమంతమైన పాత్రలో...



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న చిత్రం 'అధీరా'. కల్యాణ్ దాసరి కథానాయకుడిగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. సోమవారం ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న ఎస్‌జే సూర్య లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. తలకు కొమ్ములతో రాక్షసుడి లుక్‌లో ఉన్నారాయన. అధీరాతో తలపడే శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రను ఆయన పోషిస్తున్నట్లు ఈ లుక్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమా ఆశకు మధ్య అంధకారానికి మధ్య యుద్ధమని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీనాగేంద్ర తంగల, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

టాలీవుడ్ దర్శకుడు హాలీవుడ్‌కు



తెలుగు, తమిళ, హిందీ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకనిర్మాత సత్యారెడ్డి. ఇప్పుడు హాలీవుడ్‌లో ఓ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నారు. 'కింగ్ బుద్ధ' అనే టైటిల్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలను ప్రకటించనున్నారు. ఇటీవలె ఆయన దర్శకత్వం వహించిన 'ఉక్కు సత్యాగ్రహం' సినిమాను పలు భాషల్లోకి అనువదించారు. ఇప్పటిదాకా దాదాపు 55 చిత్రాలకు ఆయన దర్శకనిర్మాతగా వ్యవహరించారు.

క్రైమ్ థ్రిల్లర్



అర్జున్ సర్జా, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేశ్ లెట్చుమనన్ దర్శకత్వంలో జి.ఎస్.ఆర్ట్స్ నిర్మిస్తోంది. తాజాగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. సంభాషణలు, నటీనటుల ప్రదర్శన, స్టైలిష్ మేకింగ్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అభిరామి, రామ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇష్టమైన పాత్రలో మరోసారి!



భారతీయ సినీ చరిత్రలో మహిళా ప్రాధాన్యం కలిగిన చిత్రాల సిరీస్‌లో 'మర్దానీ'కి ప్రత్యేక స్థానం ఉంది. సమాజానికి కనువిప్పు కలిగించేలా, కళ్లు తెరిపించేలా అద్భుతమైన కథలతో 'మర్దానీ' చిత్రం వచ్చిన ప్రతిసారీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటూనే ఉంది. 2014, 2019 సంవత్సరాల్లో వచ్చిన 'మర్దానీ' 'మర్దానీ 2' చిత్రాలు భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు 'మర్దానీ 3' రూపుదిద్దుకుంటోంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రత్యేక పోస్టర్‌ను నవరాత్రి శుభారంభంగా సోమవారం విడుదల చేశారు. సీనియర్ హీరోయిన్ రాణీ ముఖర్జీ తనకు ఇష్టమైన డేర్ డెవిల్ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీరాయ్ పాత్రను మరోసారి పోషిస్తున్నారు. మహిషాసురుడిని చంపిన దుర్గామాత శక్తిని తెలిపే 'అయిగిరి నందిని' శ్లోకంతో రిలీజ్ చేసిన పోస్టర్ అదిరిపోయింది. అభిరాజ్ మినావాలా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌ను ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న 'మర్దానీ 3' విడుదలవుతుంది.

ఉత్కంఠభరితం



రామ్‌ప్రసాద్ గురజాడ, అంజలి, శ్రీకాంత్ పెరుమాండ్ల ప్రధాన పాత్రధారులుగా టీ రాము తెరకెక్కిస్తున్న చిత్రం 'గాలి'. ఈ సోషియో ఫ్యాంటసీ చిత్రాన్ని చందా లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను, పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా టీ రాము మాట్లాడుతూ 'కలి పురుషుడికి, అమ్మవారికి మధ్య జరిగే భీకర పోరాటమే ఈ చిత్రం. క్షణక్షణం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని అన్నారు.



కరీంనగర్‌లో భవానీ దీక్షను స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

భవానీ దీక్ష స్వీకరించిన బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం భవానీ దీక్ష స్వీకరించారు. 15 ఏళ్లుగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన భవానీ దీక్షను కొనసాగిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుతం వేలాది మంది దీక్షలను స్వీకరిస్తున్నారు. 11 రోజుల పాటు రాజకీయాలకు దూరంగా గడపడమే కాకుండా పూర్తిగా అమ్మవార్ల సేవకే సంజయ్ అంకితమవనున్నారు. సోమవారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో వేలాది మంది భవానీ దీక్షలను స్వీకరించి... బండి సంజయ్‌తో కలసి పూజల్లో పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలపై ఆంక్షలు అన్యాయం

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు తీవ్రంగా విమర్శించారు. బతుకమ్మ ఉత్సవాలకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొంటూ, కోర్టు ఆదేశాలతో వీటిని నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాంచందర్‌రావు బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలు నిర్వహించుకోవడం ప్రతీ హిందూ మహిళ హక్కు అని స్పష్టం చేశారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తానే మహిళల హక్కులను వినియోగించుకునే అవకాశం కూడా వారికి కల్పించండి. వారు స్వేచ్ఛగా పండుగలు జరుపుకొనే పరిస్థితులు కల్పించండి.' అని సీఎం రేవంత్‌కు రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు.

ముద్రణా రంగంపై మరింత పన్ను భారం

» కాగితాలు, పేపర్ బోర్డులపై జీఎస్టీ 18 శాతానికి పెంపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో 375 రకాల ఉత్పత్తుల ధరలు తగ్గినా.. ముద్రణా రంగంపై మాత్రం పన్ను భారం పెరిగింది. ఇంతవరకు 12 శాతం జీఎస్టీ ఉన్న కొన్ని రకాల కాగితాలు, పేపర్ బోర్డులను 18 శాతం పరిధిలోకి మార్చడంతో ముద్రణాలయాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రింటింగ్ జాబ్ వర్క్స్ మీద కూడా జీఎస్టీ 12 నుంచి 18 శాతానికి పెరిగింది. దీంతో చిన్న, మధ్య తరహా ప్రింటింగ్ ప్రెస్ యజమానులపై మరింత భారం పడుతుందని తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

అర్థ గణాంకాల డైరెక్టరేట్‌కు 166 పోస్టులు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అర్థ గణాంకాల సంచాలకుల కార్యాలయం పరిధిలో ప్రభుత్వం అవసరం లేని 38 పోస్టులను రద్దు చేసి, అవసరమైన మరో 166 పోస్టులను కొత్తగా మంజూరు చేసింది. 33 జిల్లాలకు కలిపి మొత్తం 405 పోస్టులను కేడర్ స్ట్రెంథ్‌గా నిర్ధారించింది. ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి డా.జ్యోతి బుద్ధ ప్రకాశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగ దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలి

» డీఎస్సీ కార్యాలయం ముందు ఉపాధ్యాయుల ధర్నా

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బదిలీలు వెంటనే చేపట్టి ఉద్యోగ దంపతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం ముందు ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన జీవో 317 అమలులో భాగంగా తమను వేర్వేరు జిల్లాలకు కేటాయించారన్నారు. దంపతుల బదిలీలను సబ్ కమిటీ ఆమోదించినా.. విద్యాశాఖలో కొంతమంది ఉన్నతాధికారులు అసంబద్ధ కారణాలు చెప్పి అడ్డుకుంటున్నారని ఉపాధ్యాయులు ఆరోపించారు. వెంటనే బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల యాజమాన్య నూతన కార్యవర్గం ఎన్నిక పూర్తయ్యింది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా రాజేంద్రనగర్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా వరంగల్ రంగశాయిపేట కళాశాల ప్రిన్సిపల్ జి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పటాన్‌చెరు కాలేజీ ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, సహ అధ్యక్షుడిగా గజ్వేల్ కాలేజీ ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ ఎన్నికయ్యారు.

కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు

పంజాగుట్ట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. విచారణలో భాగంగా పోలీసులు అమీర్‌పేటలోని పాల్ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. ఫోన్ కూడా స్విచాఫ్ అయింది. గత నెల 28న పాల్ కార్యాలయంలో ఓ యువతి అమెరికన్ కో-ఆర్డినేటర్‌గా విధుల్లో చేరారు. నైట్ షిఫ్ట్‌లో పని చేస్తున్నప్పుడు పాల్ తనను అసభ్యంగా తాకాడంటూ ఆమె షీ టీమ్స్‌ను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు ఆమె గత శనివారం రాత్రి పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పాల్ అరెస్ట్ భయంతో ఈ నెల 20వ తేదీ అమెరికాకు పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని పూర్తిచేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే

» ఆయిల్ సీడ్స్ చైర్మన్ రాఘవరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా నర్మెట్టలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం పునాది వేసిందని, 2023 వరకు అక్కడ పనులే ప్రారంభం కాలేదని ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిన ఆ ఫ్యాక్టరీకి వెళ్లి రాజకీయం చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. ఆ ఫ్యాక్టరీ టెండర్ అగ్రిమెంట్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే జరిగిందన్నారు. యూరియాను కేంద్రం ఇస్తుందా.. రాష్ట్రం ఇస్తుందా అన్న సంగతి హరీశ్‌రావుకు తెలియదా అంటూ నిలదీశారు. గాంధీభవన్‌లో సోమవారంనాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

ఇప్పుడు జీఎస్టీ తగ్గించారంటే.. 8 ఏళ్లుగా దోపిడీ జరుగుతున్నట్టేగా? : టీపీసీసీ

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ అన్నారు. ఈ వర్గాలకు ప్రధాని మోదీ చేసిన మరో మోసమిదన్నారు. కేంద్రం నిత్యావసరాలపైన 2017 నుంచి ఇప్పటి దాకా 16 శాతం జీఎస్టీ వసూలు చేసిందని, ఇప్పుడు తగ్గించిందంటే.. గడిచిన 8 ఏళ్లుగా పేద, మధ్య తరగతి ప్రజల్ని మోసం చేసినట్లేగా అని నిలదీశారు. 2017లో కేవలం రూ. 90 వేల కోట్లున్న పన్నుల వసూళ్లు.. 2025 నాటికి రూ. 1.75 లక్షల కోట్లకు చేరుకున్నాయంటే ఎంత మేరకు దోపిడీ జరిగిందన్నది ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో దుర్గాపూజ

పాల్గొన్న డైరెక్టర్ వేమూరి ఆదిత్య దంపతులు

బాలానగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా బాలానగర్ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఆయన సతీమణి, వైస్ ప్రెసిడెంట్ శ్రుతికీర్తితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల కోసం వచ్చిన డైరెక్టర్ దంపతులను ప్రచురణకర్త శేషగిరిరావు, ప్రింటింగ్ ప్రెస్ డీజీఎంలు రాంప్రసాద్, చినబాబు, చౌదరి, సిబ్బందితో కలిసి సాదరంగా ఆహ్వానించారు. ఈ పూజల్లో ప్రింటింగ్ స్టోర్స్ మేనేజర్ వైసీ నర్సింహా, అసిస్టెంట్ మేనేజర్లు భానుప్రకాశ్, హరికృష్ణ, మాధవరావు, ఆర్ఎం అనిల్‌కుమార్, సిబ్బంది కే రాజు, సింహాచలం, సురేశ్, బార్గవ, నిర్మల యాదవమ్మ, సాంబ, కిషోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల అనంతరం ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందితో 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, సతీమణి శ్రుతికీర్తి

తగ్గే ఆదాయాన్ని కేంద్రమే భరించాలి

జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్రానికి ఏటా రూ.7 వేల కోట్లు తగ్గనున్న ఆదాయం

- మీ చావు మీరు చావండంటే కుదరదు
- ఐదేళ్లపాటు వీజీఎఫ్‌తో అంతరాన్ని భర్తీ చేయాలి
- సింగరేణి లాభాల్లో కార్మికులకు 34% వాటా
- ఒక్కొక్కరికి 1,95,610 లబ్ధి: సీఎం రేవంత్‌రెడ్డి
- గత ప్రభుత్వం వేలంలో పాల్గొనకపోవడంతో సింగరేణి రెండు బొగ్గు గనులను కోల్పోయింది
- వాటిని తిరిగి సాధించుకుంటాం: భట్టివిక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల పేరిట కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రానికి ఏటా రూ.7 వేల కోట్ల దాకా ఆదాయం తగ్గనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని సర్దుబాటు చేయాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందన్నారు. జీఎస్టీని ప్రవేశపెట్టిన సమయంలో 14 శాతం ఆదాయం తొలి ఐదేళ్లలో రాకపోతే.. ఆ అంతరాన్ని తగ్గించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుందని గుర్తు చేశారు. "రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఆధారంగా మేం ప్రణాళికలు వేసుకున్నాం. కానీ, కేంద్రం ఉన్న ఫలంగా ఒక నిర్ణయం తీసుకుంది. 'మేం ప్రకటన చేస్తాం.. నిర్ణయాలు తీసుకుంటాం.. మీ చావు మీరు చావండి' అని ప్రధానమంత్రి మోదీ అనుకున్నా, ఇంకెవరు అనుకున్నా మంచిదికాదు. దానివల్ల ఈ రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. జీఎస్టీ సంస్కరణలతో రానున్న ఐదేళ్లలో తగ్గే ఆదాయాన్ని వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కేంద్రమే భర్తీ చేయాలి" అని రేవంత్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ అంశాలను మోదీ సర్కారుకు నివేదించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. సోమవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జి.వివేక్‌లతో కలిసి సింగరేణి కార్మికులకు సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను బోనస్‌గా సీఎం రేవంత్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బొగ్గు ధరల అంశాన్ని సహేతుకంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చించబోమని, కోల్‌బెల్ట్‌కు చెందిన ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాలతో కలిసి బొగ్గుబావుల వద్దే చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

దీపావళికి బోనస్‌పై మరో ప్రకటన..

సింగరేణికి విద్యుత్తు సంస్థలు రూ.27 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందనే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. ఇది చాలా సున్నితమైన సమస్య అన్నారు. వడ్డీల భారం తగ్గించుకోవడం, ఇతరత్రా చర్యలతో ఈ సమస్యను అధిగమిస్తామన్నారు. సింగరేణి సంస్థకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.6,394 కోట్ల లాభాలు వచ్చాయని, ఇందులో సంస్థ విస్తరణకు రూ.4,034 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన రూ.2,360 కోట్లలో కార్మికులకు 34 శాతం వాటాగా రూ.819 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1,95,610 చొప్పున ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు. గతేడాది తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేల చొప్పున బోనస్ అందజేసినట్లు, ఈసారి రూ.5,500 చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కోల్ ఇండియా నిర్ణయం అనంతరం దీపావళి బోనస్‌పై మరో ప్రకటన చేస్తామన్నారు.

కార్పొరేట్ రంగంతో పోటీ పడేలా..

కార్మికులకు లాభాల్లో వాటాలు పంచడంతోపాటు సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు, విస్తరణ కార్యక్రమాలు, కార్పొరేట్ రంగంతో పోటీపడేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో నిర్ణయాలు తీసుకుంటామని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వేలంలో పాల్గొనకపోవడం వల్ల కోల్పోయిన రెండు గనులను తిరిగి సింగరేణి అధీనంలోకి తీసుకొచ్చే విషయంలో అన్ని మార్గాలను అన్వేషిస్తామని ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో గత ప్రభుత్వం పాల్గొనకపోవడం వల్ల సింగరేణి ప్రాంతంలోని రెండు గనులు ఆనాటి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్లాయన్నారు. దాంతో సింగరేణికి నష్టం వాటిల్లిందని, ఆ బ్లాకులను తిరిగి తెచ్చుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. కాగా, సంస్థను కాపాడాలని, ఉద్యోగుల్లో పని సంస్కృతిని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో 1999-2000 సంవత్సరంలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి యాజమాన్యం లాభాల్లో వాటా బోనస్‌ను ప్రకటించిందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎంపీలు బలరాంనాయక్, రఘురామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాలరావు, సింగరేణి ప్రాంత ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్ పార్టీ.. అక్రమ లగ్జరీ కార్లపై నడుస్తోందా?

- బసరత్ ఖాన్ దిగుమతి చేసుకున్న ల్యాండ్ క్రూజర్‌లో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- బసరత్ స్మగ్లింగ్ చేసిన కార్లు 8.. విచారణలో నంబర్లూ వెల్లడి
- అందులో టీజీ 00డి 6666 నంబరు కారు కేటీఆర్ కాన్వాయిలో
- ఎట్‌హోం హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థ పేరుతో వాహనం రిజిస్టర్
- ఆ సంస్థ డైరెక్టర్ కేటీఆర్ భార్య శైలిమ.. దర్యాప్తు చేస్తున్న డీఆర్ఐ



కేటీఆర్ కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూజర్ ఇదే

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్ పార్టీ (బీఆర్ఎస్) అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. 'లగ్జరీ కార్ల కుంభకోణం నిందితుడు బసరత్ ఖాన్ అక్రమంగా దిగుమతి చేసుకున్న ల్యాండ్ క్రూజర్లలో ఒకదాంట్లో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారు? ఆ కారు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీ పేరుతో ఎందుకు రిజిస్టర్ అయింది? మార్కెట్ ధర చెల్లించారా? లేదంటే ధర తక్కువగా చూపించి కొనుగోలు చేశారా? చెల్లింపులు బినామీ పేర్లతో జరిగాయా? మనీలాండరింగ్ జరిగిందా? అని నిలదీశారు. ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందినట్లు కాదా?' అని సంజయ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెల్లడి కావాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, సంబంధిత శాఖలు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. బీజేపీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎనిమిది కార్లను స్మగ్లింగ్ చేసినట్లు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారుల విచారణలో ల్యాండ్ క్రూజర్ వాహనాల స్మగ్లర్ బసరత్ ఖాన్ అంగీకరించారు. ఆ వాహనాల నంబర్లనూ అధికారులకు బసరత్ ఖాన్ అందజేశారు. ఆ నంబర్లలో టీజీ00డి 6666 నంబరు గల ల్యాండ్ క్రూజర్ వాహనాన్ని తన కాన్వాయిలో కేటీఆర్ ఉపయోగిస్తున్నట్లుగా అధికారుల ఎదుట బసరత్‌ఖాన్ చెప్పారు. కాగా కేటీఆర్ కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూజర్ వాహనం, ఎట్‌హోం హాస్పిటాలిటీ సర్వీసెస్ పేరుతో రిజిస్టర్ అయినట్లుగా డీఆర్ఐ అధికారులు గుర్తించారు. దీంతో, ఎట్‌హోం హాస్పిటాలిటీ సర్వీసెస్‌కు, కేటీఆర్ కుటుంబానికి మధ్య ఉన్న సంబంధాలపై డీఆర్ఐ అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కేటీఆర్ సతీమణి శైలిమ, ఎట్‌హోం హాస్పిటాలిటీ సర్వీస్ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా, బసరత్‌ఖాన్‌కు, కేటీఆర్‌కు మధ్య ఎలా పరిచయం ఏర్పడింది? ఎట్‌హోం హాస్పిటాలిటీ సర్వీసెస్ అనే సంస్థ ఎలా ఏర్పడింది? అందులో ఎవరెవరు ప్రముఖులు ఉన్నారు? తదితర అంశాలపై డీఆర్ఐ లోతుగా దర్యాప్తు చేస్తోందని సమాచారం. బండి సంజయ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని.. ఆయన ఏ షోరూంలో కొన్నారో అక్కడే కేటీఆర్ కూడా కొన్నారని బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

వణికిస్తున్న వర్షాలు

- బంజారాకాలనీలో పడవలో బాలింత తరలింపు
- పిడుగుపాట్లతో ముగ్గురి మృతి
- నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యూసుఫ్‌గూడలో వరద ఉధృతికి కొట్టుకుపోతున్న ఆటో

బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. రాజధాని హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. సోమవారం సాయంత్రం 2 గంటల పాటు కురిసిన కుండపోత వర్షంతో ప్రధాన రహదారులు చెరువులను తలపించగా, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బంజారాహిల్స్‌లో 10 సెం.మీ వర్షపాతం రికార్డు కాగా, దేవరకొండ బస్తీ నీట మునిగింది. వనస్థలిపురంలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై మోకాళ్ల లోతు వరద నీటితో కి.మీ మేరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. యూసుఫ్‌గూడలో వరద ఉధృతికి ఆటో కొట్టుకుపోగా, ద్విచక్ర వాహనంపై వరదలో చిక్కుకున్న మహిళను స్థానికులు కాపాడారు. పలు చోట్ల పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు, కార్లు వరదలో మునిగిపోగా, కొట్టుకుపోతున్న వాహనాలను పట్టుకున్నారు. హయత్‌నగర్- బంజారా కాలనీలో రెండ్రోజుల క్రితం పాపకు జన్మనిచ్చిన ముడావత్ ప్రశాంతి ఇల్లు నీట మునిగింది. ఆమె కుటుంబ సభ్యులు సోమవారం జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తేవడంతో రెస్క్యూ టీం, డీఆర్ఎఫ్ బృందం పడవ సాయంతో ఆమెను ఒడ్డుకు చేర్చారు. బాటసింగారం చిన్నయేరుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు బైక్‌తోపాటు వరదలో కొట్టుకుపోయి రాళ్లను పట్టుకోవడంతో స్థానికులు జేసీబీ సాయంతో బయటికి తీశారు.

ఉప్పొంగిన ఈసీ.. మూసీ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, అబ్దుల్లాపూర్ మెట్ తదితర నగర శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. కొడంగల్ మండలం పర్సాపూర్ గ్రామ ర్యాలపేట చెరువుకు గండి పడింది. ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి మండలంలో 9.93 సెం.మీ వర్షపాతం రికార్డయింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చల్పాక గ్రామం, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లి గ్రామం, జిల్లా కేంద్రమైన సిరిసిల్ల మునిసిపాలిటీ పరిధిలో వేర్వేరుగా పడిన పిడుగులతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని విద్యుత్ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయంపై పిడుగు పడటంతో రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని డీఈ రామచంద్రయ్య తెలిపారు. ఆ సమయంలో కార్యాలయంలో ఆరుగురు సిబ్బంది ఉన్నా.. ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా గేట్లు ఓపెన్

కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద మళ్లీ పెరిగింది. సోమవారం ఆల్మట్టికి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 90 వేల క్యూసెక్కుల నీరు, నారాయణపూర్ ప్రాజెక్టు వద్ద 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1.04 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో.. ఉజ్జయినికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 72 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో రికార్డైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు సోమవారం 3.19 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రాగా, పది గేట్లను తెరిచి 3,12,260 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,365 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మరోవైపు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు 26 గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 3,32,152 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, అంతే మొత్తం దిగువకు వదిలేశారు. గోదావరి బేసిన్‌లోని సింగూరు ప్రాజెక్టుకు 58 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అంతే మొత్తం దిగువకు వదిలేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 61 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... 77 వేల క్యూసెక్కులు కిందకు వదిలారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చిన 2.54 లక్షల క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3.99 లక్షల క్యూసెక్కులుండగా, అంతే మొత్తం దిగువకు వదిలేశారు.

ఏపీలో రెవెన్యూ లోటు.. తెలంగాణలో రెవెన్యూ మిగులు


» మిగులు సాధించిన 16 రాష్ట్రాల్లో యూపీ టాప్


రూ.5,944 కోట్ల మిగులుతో 7వ స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ లోటు ఏర్పడగా, పొరుగు రాష్ట్రం తెలంగాణ రెవెన్యూ మిగులు సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) విడుదల చేసిన నివేదిక మేరకు అత్యధికంగా రూ.37,263 కోట్ల రెవెన్యూ మిగులుతో యూపీ రెవెన్యూ మిగులు రాష్ట్రాల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. రూ.19,865 కోట్లతో గుజరాత్, రూ.19,456 కోట్లతో ఒడిసా ఆ తర్వాతి స్థానాల్లో నిలవగా, తెలంగాణ రూ.5,944 కోట్ల మిగులుతో ఈ జాబితాలో 7వ స్థానంలో నిలిచింది. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన ఆర్థిక బాధ్యత, ఆర్థిక పటిష్ఠత మార్గదర్శకాల మేరకు రాష్ట్రాలు రెవెన్యూ మిగులుతో ఉండాలి, లేదా రెవెన్యూ లోటు లేకుండా ఉండాలి. అయితే, దేశంలోని మొత్తం 28 రాష్ట్రాలకుగాను 16 రాష్ట్రాలు రెవెన్యూ మిగులుతో, మిగిలిన 12 రాష్ట్రాలు రెవెన్యూ లోటుతో ఉన్నాయని ఆ ఏడాది రాష్ట్రాల ఆర్థిక స్థితి గురించి కాగ్ ప్రచురించింది. రెవెన్యూ మిగులు సాధించిన ఆ 16 రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు, వాటి రెవెన్యూ వ్యయాల కంటే అధికంగా ఉన్నాయి. జార్ఖండ్ రూ.13,564 కోట్లు, కర్ణాటక రూ.13,496 కోట్లు, ఛత్తీస్‌గఢ్ రూ.8,592 కోట్లు, ఉత్తరాఖండ్ రూ.5,310 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.4,091 కోట్లు, గోవా రూ.2,399 కోట్లు రెవెన్యూ మిగులు సాధించాయి. ఇక రెవెన్యూ లోటుతో ఉన్న 12 రాష్ట్రాల రెవెన్యూ వ్యయాలు ఆ రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లను మించిపోయాయి. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు వాటి రెవెన్యూ వ్యయాలకు 75-80 శాతం మాత్రమే ఉన్నాయని కాగ్ తెలిపింది. అలాగే, బిహార్, కేరళ, మేఘాలయ, మహారాష్ట్ర రెవెన్యూ వసూళ్లు ఆ రాష్ట్రాల రెవెన్యూ వ్యయాలకు 90-100 శాతం, అసోం, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో 80-90 ఉన్నాయి. రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు ఆర్థిక సంఘం 2022-23 సంవత్సరానికి మొత్తం రూ.86,201 కోట్ల గ్రాంటు ఇవ్వగా, ఈ 12 రాష్ట్రాల రెవెన్యూ లోటే రూ.2,22,648 కోట్లు ఉంది. అంటే మొత్తం రెవెన్యూ లోటు భర్తీకి ఆర్థిక సంఘం ఇచ్చిన గ్రాంటు అందులో 39 శాతం మాత్రమే. కాగా, ఆ ఏడాది రాష్ట్రాలకు ఆర్థిక సంఘం ఇచ్చిన మొత్తం గ్రాంట్లలో 50 శాతం వరకు రెవెన్యూ లోటు గ్రాంట్లు ఉన్నట్లు కాగ్ తెలిపింది.

డివైడర్ దాటి మరో కారు మీద పడిన కారు

ఇద్దరి మృతి..






రంజిత్ రెడ్డి, హారికా రెడ్డి(ఫైల్)

రాజాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెళుతోన్న కారు అదుపు తప్పి డివైడర్ దాటి మరో కారుపై పడడంతో అందులో ప్రయాణిస్తోన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన రంజిత్ రెడ్డి(34) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పెద్దల పండుగ కోసం భార్య చైతన్య, కుమార్తెలతో కలిసి 20వ తేదీన అత్తగారి ఊరైన పెద్దమందడి మండలంలోని వెల్టూరుకు వచ్చారు. 22వ తేదీన సోమవారం ఉదయం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతడి మరదలు(భార్య చెల్లెలు) హారికా రెడ్డి(23) కూడా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు అతడితో పాటు బయలుదేరింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు జాతీయ రహదారిపై రాజాపూర్ మండల కేంద్రంలోని రెయిన్‌బో హోటల్ సమీపంలో అదుపు తప్పి డివైడర్ మీదుగా దూసుకొచ్చి వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మాధవరెడ్డి క్షేమంగా ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కారులో నుంచి మృతదేహాలను వెలికితీసి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తాండూరు మాతా శిశు ఆస్పత్రిలో నిండు గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యం కారణమంటూ బంధువుల ఆందోళన

డ్యూటీ డాక్టర్‌ను విధుల నుంచి తొలగించిన అధికారులు



మృతురాలు అఖిల(ఫైల్)

తాండూరు, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం తాండూరు మాతా శిశు ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణి మృతి చెందింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం రావుల్‌పల్లికి చెందిన అఖిల(23)కు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు తాండూరు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. సోమవారం తెల్లవారుజామున కడుపులో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే అఖిల మృతి చెందింది. వైద్యులు పట్టించుకోకపోవడం వల్లే అఖిల మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. యాలాల పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. డ్యూటీ డాక్టర్ మంజుల వైద్యం అందించలేదని తమ దృష్టికి వచ్చిందని, ఆమెను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ కోసం ఓ కమిటీ వేశామని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐదేళ్లలో రూ.1.70 లక్షలకు బంగారం!?

న్యూఢిల్లీ: గడిచిన ఐదేళ్లలో కొవిడ్ సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ఇతర భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు, ట్రంప్ సుంకాలు, ఫెడ్ రేట్ల తగ్గుదల వంటి అంశాలు విలువైన లోహాల ధరలను భారీగా ఎగదోశాయి. 2020 సెప్టెంబరు 19న ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.51,619 స్థాయిలో ట్రేడవగా.. ప్రస్తుతం రూ.1.10 లక్షల స్థాయికి చేరింది. అంటే, ఐదేళ్లలో 112 శాతం పెరిగింది. కాగా, అమెరికా ఆర్థిక విధానాలు, ఫెడ్ రేట్లు, భౌగోళిక రాజకీయ అంశాలు వచ్చే ఐదేళ్లలో బంగారం ధరల గమనాన్ని నిర్దేశించనున్నాయని ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ లిమిటెడ్ కరెన్సీ, కమోడిటీ విభాగ ఏవీపీ మనీశ్ శర్మ అన్నారు. 2026 ప్రథమార్ధం చివరి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 4,000 డాలర్లకు (దేశీయంగా రూ.1.20 లక్షలు) చేరవచ్చని భావిస్తున్నారు. వచ్చే 2-5 ఐదేళ్లలో 5,000 డాలర్లకు (రూ.1.50-1.70 లక్షల) ఎగబాకవచ్చని మనీశ్ శర్మ అంచనా వేశారు.

గోల్డ్.. కొత్త రికార్డ్

పుత్తడి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.2,200 పెరిగి రూ.1,16,200కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా రూ.2,150 పెరుగుదలతో కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.1,15,650కి ఎగబాకింది. కిలో వెండి ఏకంగా రూ.4,380 పెరుగుదలతో రూ.1,36,380కి చేరింది. సిల్వర్‌కూ ఇది సరికొత్త పతాక స్థాయి.

కార్ల షోరూమ్‌లు కళకళ



జీఎస్‌టీ తగ్గడంతో పోటెత్తిన కస్టమర్లు

మారుతి, హ్యుండయ్ రికార్డు డెలివరీలు.. 50% పెరిగిన చిన్న కార్ల బుకింగ్‌లు

న్యూఢిల్లీ: వాహనాలపై జీఎస్‌టీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో కార్ల షోరూమ్‌లు కొత్త కళను సంతరించుకున్నాయి. నవరాత్రుల తొలిరోజున తమ కార్ల రిటైల్ విక్రయాలు 25,000-30,000 మించవచ్చని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) తెలిపింది. కస్టమర్ల తాకిడితో షోరూమ్‌లు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచాల్సి వచ్చిందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్కెటింగ్ అండ్ సేల్స్ పార్థో బెనర్జీ తెలిపారు. కంపెనీ డీలర్‌షిప్‌లకు ఒక్కరోజే 80,000 కస్టమర్ల ఎంక్వైరీలు వచ్చాయన్నారు. జీఎస్‌టీ తగ్గుదలతో చిన్న కార్ల బుకింగ్స్ 50 శాతం పెరిగాయన్నారు. కొన్ని మోడళ్ల వేరియంట్లకు అధిక గిరాకీ నెలకొనడంతో నిల్వలు నిండుకోవచ్చన్నారు. విక్రయాల పరంగా కంపెనీకిదే అత్యుత్తమ రోజని బెనర్జీ పేర్కొన్నారు.

నవరాత్రుల ఆరంభానికి జీఎస్‌టీ తగ్గుదల తోడవడంతో మార్కెట్ సెంటిమెంట్ అత్యంత సానుకూలంగా మారిందని హ్యుండయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ అన్నారు. జీఎస్‌టీ తగ్గిన తొలి రోజే తమ డీలర్లు 11,000 కార్లను విక్రయించారని, గడిచిన ఐదేళ్లలో కంపెనీకిదే అత్యధిక ఒక్కరోజు అమ్మకాలని ఆయన తెలిపారు. కొత్త కార్ల కొనుగోలు కోసం షోరూమ్‌లకు కస్టమర్ల తాకిడి భారీగా పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) అధ్యక్షులు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

"గడిచిన 3-4 వారాలుగా కస్టమర్ల ఎంక్వైరీలు అనూహ్యంగా పెరిగాయి. దుర్గ నవరాత్రుల తొలి రోజుల విక్రయాలు భారీగా పుంజుకోనున్నాయని" ఆయన పేర్కొన్నారు.

సెకండ్ హ్యాండ్ కార్లకూ భలే గిరాకీ

యూజ్డ్ కార్ల విక్రయాలూ అనూహ్యంగా పెరిగాయని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'కార్స్24' తెలిపింది. రోజువారీ సగటుతో పోలిస్తే, సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కార్ల డెలివరీలు ఏకంగా 400 శాతం పెరిగాయని తెలిపింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అధిక విక్రయాలు నమోదయ్యాయని.. అహ్మదాబాద్, బెంగళూరు, పుణె, ముంబై ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయంది. అలాగే, తమ ప్లాట్‌ఫామ్ ద్వారా కారును విక్రయించాలనుకునే సంఖ్య కూడా భారీగా పెరిగిందని కార్స్24 వెల్లడించింది. ఒక్కరోజులో 5,000 వాహనాల తనిఖీలు జరిపామని, గడిచిన నాలుగేళ్లలో ఇదే అత్యధికమని పేర్కొంది.

ఏసీ, టీవీ సేల్స్ జూమ్

జీఎస్‌టీ తగ్గింపుతో నవరాత్రుల తొలిరోజున ఎయిర్ కండీషనర్లు (ఏసీ), టెలివిజన్ (టీవీ) అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. విక్రేతల చౌక డీల్స్‌ను అందిపుచ్చుకునేందుకు కొనుగోలుదారులు ఎగబడ్డారు. ఇతర సోమవారాలతో పోలిస్తే, 22న రెట్టింపు విక్రయాలు జరిపినట్లు హాయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీశ్ తెలిపారు. జీఎస్‌టీ తగ్గింపునకు ముందే ఈ కంపెనీ ప్రీ-బుకింగ్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు నమోదైన ఎంక్వైరీలను బట్టి చూస్తే, విక్రయాలు భారీగా పెరగనున్నాయని బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ అన్నారు. గత ఏడాది సెప్టెంబరు అమ్మకాలతో పోలిస్తే ఈ నెలలో 20 శాతం వృద్ధి నమోదు కావచ్చని ఆయన అంచనా వేశారు. జీఎస్‌టీ తగ్గిన తొలి రోజున విక్రయాలు 30-35 శాతం పెరిగాయని థాంప్సన్, కొడాక్ వంటి టీవీ బ్రాండ్ల లైసెన్సులు కలిగిన సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు.

పునరుత్పాదక ఇంధన రంగ ఇన్వెస్టర్లకు రూ.1.50 లక్షల కోట్ల ఆదా

పునరుత్పాదక ఇంధనంపై జీఎస్‌టీ తగ్గడంతో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి 2030 నాటికి రూ.1.50 లక్షల కోట్ల వరకు ఆదా కావచ్చని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రభుత్వం రెన్యువబుల్ ఎనర్జీ పరికరాలపై జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. కాగా, 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 300 గిగావాట్ల మేర పెంచుకోవాలని కేంద్రం భావిస్తోంది. జీఎస్‌టీ తగ్గింపుతో ఇన్వెస్టర్లకు వ్యయం 2-3 శాతం మేర తగ్గినా రూ.1-1.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఆదా కావచ్చని పేర్కొన్నారు. జీఎస్‌టీ తగ్గింపుతో పీఎం సూర్య ఘర్ పథకం కింద లభించే రూఫ్ టాప్ సోలార్ 3 కిలోవాట్ సిస్టమ్ ధర రూ.9,000-10,500 మేర తగ్గనుంది.

జీఎస్‌టీ ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకే

- దసరా కోసం ప్రత్యేక డిస్కౌంట్స్
- సీఎంఆర్ షాపింగ్‌మాల్ సీఎండీ మావూరి వెంకటరమణ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 ప్రయోజనాలను నేరుగా వినియోగదారులకు అందిస్తున్నట్లు సీఎంఆర్ షాపింగ్‌మాల్ సీఎండీ మావూరి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రెడీమేడ్ వస్త్రాలపై గతంలో 12 శాతం జీఎస్‌టీ ఉండగా ఇప్పుడు 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. దీంతో రూ.2,500 లోపు విలువ కలిగిన రెడీమేడ్ వస్త్రాల కొనుగోలుపై వినియోగదారులకు 6.2 శాతం మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. దీన్ని పూర్తిగా వినియోగదారులకే బదిలీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా దసరా పండగను పురస్కరించుకుని సీఎంఆర్ షోరూమ్స్ అన్నింటిలో ప్రత్యేకమైన రాయితీలు అందిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ప్రతి రూ.999 కొనుగోలుపై ఒక స్పాట్ గిఫ్ట్, వన్ ప్లస్ వన్ ఆఫర్లు, కాంబో ఆఫర్లు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైదరాబాద్‌లో సీడీకే కేంద్రం విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ సరఫరాదారు సీడీకే హైదరాబాద్‌లోని తన కేంద్రాన్ని విస్తరించినట్టు ప్రకటించింది. ప్రస్తుత కేంద్రానికి అదనంగా 50వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాన్ని జోడించినట్టు వెల్లడించింది. ఉత్తర అమెరికాలో తమ కార్యకలాపాలు పటిష్ఠం చేయడం లక్ష్యంగా టాలెంట్, టెక్నాలజీలో పెట్టుబడులు పెడుతున్నట్టు కంపెనీ ఎండీ సందీప్ కుమార్ జైన్ తెలిపారు. హైదరాబాద్ కార్యాలయం తమ ప్రధాన విధులకు మద్దతు ఇస్తుందని అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,12,580 ▲	1,03,200 ▲	1,48,000 ▲
విజయవాడ	1,15,200 ▲	1,08,500 ▲	1,37,200 ▲
విశాఖపట్నం	1,15,570 ▲	1,03,600 ▲	1,48,000 ▲
రాజమండ్రి	1,13,070 ▲	1,03,650 ▲	1,36,300 ▲
ప్రొద్దుటూరు	1,15,200 ▲	1,05,980 ▲	1,37,000 ▲
ముంబై	1,12,155 ▲	1,02,734 ▲	1,32,869 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	127
కరీంనగర్	110	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	129	అనంతపురం	110
గోదావరి	125		

మార్కెట్‌కు వీసా షాక్

ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసాల ఫీజును భారీగా పెంచిన నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ సోమవారం భారీ కుదుపు ఎదుర్కొంది. ప్రధానంగా ఐటీ షేర్లలో అమ్మకాలు మార్కెట్‌ను కుంగదీశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ పతనానికి ఆజ్యం పోశాయి. ఫలితంగా సెన్సెక్స్ 466.26 పాయింట్ల నష్టంతో 82,159.97 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 628.94 పాయింట్లు నష్టపోయి 81,997.29 వరకు దిగజారింది. నిఫ్టీ 124.70 పాయింట్ల నష్టంతో 25,202.35 వద్ద ముగిసింది.

ట్రంప్ చర్య కారణంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్ అప్రమత్తంగా మారిందని లివ్‌లాంగ్ వెల్త్ వ్యవస్థాపకుడు రీసెర్చ్ అనలిస్ట్ హరిప్రసాద్ అన్నారు. సెన్సెక్స్ షేర్లలో ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రమే లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.78%, స్మాల్‌క్యాప్ సూచీ 0.71% నష్టపోయాయి.

నష్టాల్లో ఐటీ షేర్లు

ఐటీ సూచీలు, ఐటీ షేర్లు సోమవారం మార్కెట్ పతనంలో ప్రధాన పాత్ర పోషించాయి. సూచీల్లో ఫోకస్డ్ ఐటీ భారీగా 2.98% నష్టపోగా ఐటీ 2.73%, టెక్ 2.09% నష్టపోయాయి. వీటితో పాటుగా యంత్ర పరికరాలు (0.77%), ఇండస్ట్రియల్స్ (0.75%), ఆటో (0.41%) సూచీలు కూడా నష్టాలతో ముగిశాయి. ఇక ఐటీ రంగానికి చెందిన ఇన్ఫోబీన్స్ టెక్నాలజీస్ గరిష్ఠంగా 8.08%, హెక్సావేర్ 7.08% నష్టపోయాయి. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ (4.54%), పెర్సిస్టెంట్ సిస్టమ్స్ (4.19%), టెక్ మహీంద్రా (3.20%), టీసీఎస్ (3.02%), ఇన్ఫోసిస్ (2.61%), విప్రో (2.25%), హెచ్‌సీఎల్ టెక్ (1.84%) నష్టపోయాయి.

తెలంగాణలో కార్నింగ్, ఎస్‌జీడీ ఫార్మా గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్

రూ. 500 కోట్లు పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫార్మా రంగానికి చెందిన కార్నింగ్, ఫ్రెంచ్ కంపెనీ ఎస్‌జీడీ ఫార్మా జాయింట్ వెంచర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వేముల వద్ద అత్యాధునికమైన గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్‌ను ప్రారంభించాయి. ఈ ప్లాంట్ ఏర్పాటుకు రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. సోమవారం లాంఛనప్రాయంగా ప్రారంభించిన ఈ ప్లాంట్‌ను కార్నింగ్‌కు చెందిన అత్యాధునిక వయల్ టెక్నాలజీని, ఎస్‌జీడీ ఫార్మాకు గల వయల్ కన్వర్టింగ్ అనుభవాన్ని జోడించి ఏర్పాటు చేశారు. ఈ కొత్త ప్లాంట్ అత్యున్నత నాణ్యత గల టైప్ 1 బోరోసిలికేట్ గ్లాస్ ట్యూబింగ్‌ను తయారుచేస్తుంది. ఇంజెక్షన్ల ప్యాకేజింగ్‌లో ఉపయోగించే కీలక ఉపకరణం ఈ గ్లాస్ ట్యూబింగ్. అత్యంత కీలకమైన ప్రాంతీయ అవసరాలు తీర్చడంలో కీలక మైలురాయి ఈ ప్లాంట్ ప్రారంభమని కార్నింగ్ లైఫ్ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్, జీఎం క్రిస్ హడ్సన్ అన్నారు. ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, కస్టమర్లకు చేరువగా ఉండేందుకు, సరఫరా వ్యవస్థల స్థానికీకరణకు ఈ ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఇంజెక్షన్ల డెలివరీ, స్థానిక ఫార్మా రంగ వృద్ధిలో ఈ ప్లాంట్ క్రియాశీల పాత్ర పోషిస్తుంది.

కార్నింగ్‌తో ఈ జేవీ తమ ప్రపంచ వృద్ధి వ్యూహంలో ఒక కీలక మైలురాయి అని ఎస్‌జీడీ ఫార్మా సీఈఓ ఆలివర్ రోసావు అన్నారు. తెలంగాణలో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటు వల్ల తమ సరఫరా వ్యవస్థ సుస్థిరతతో పాటు అమిత వేగంగా వృద్ధి చెందుతున్న ఫార్మా మార్కెట్లలో ఒకటైన తెలంగాణకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా 150 ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడడంతో పాటు పరోక్షంగా వందలాది ఉద్యోగాలు స్థానికులకు అందుబాటులోకి వస్తాయని కార్నింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ పిళ్లై అన్నారు.

పాక్.. పిచ్చి చేష్టలు



సూర్య

ఫర్హాన్, రౌఫ్‌ల వివాదాస్పద తీరు
నివ్వెరపోయిన క్రీడాలోకం

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య దశాబ్దాలుగా ఎన్నో మ్యాచ్‌లను చూసుంటాం. కానీ ఆసియా కప్ సూపర్-4లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మాత్రం దాయాది క్రికెటర్ల ప్రవర్తన అందరినీ షాక్‌కు గురి చేసింది. గ్రూప్ మ్యాచ్‌లో ఆ జట్టు ఆటగాళ్లతో షేక్‌హ్యాండ్‌కు నిరాకరించినందుకే క్రీడల్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని పాక్ బోర్డు పెద్దలు, మాజీలు భారత్‌కు ఉపదేశాలిచ్చారు. కానీ దానికి వంద రెట్లు మించినట్టుగా పాక్ ఓపెనర్ ఫర్హాన్, పేసర్ హరీస్ రౌఫ్‌ల చేష్టలున్నాయి. అర్ధసెంచరీ అయ్యాక ఫర్హాన్ బ్యాట్‌ను గన్‌గా మార్చి బుల్లెట్లు పేల్చుతున్నట్టుగా పహల్గామ్ దాడిని గుర్తు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఇక బౌండరీ లైన్ దగ్గర రౌఫ్ భారత అభిమానులను మరింత కవ్వించేలా ప్రవర్తించాడు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు చెందిన ఆరు రఫేల్ విమానాలను కూల్చేశామని అప్పట్లో పాక్ ప్రగల్భాలు పలికింది. దాన్ని ఉదహరిస్తూ.. అతను ప్రేక్షకులకు ఆరు వేళ్లను చూపించాడు. అంతేకాకుండా విమానం కింద పడుతున్నట్టుగా చేతులతో సైగ చేయడం కనిపించింది. అటు రౌఫ్ భార్య ఇవే ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసి 'మ్యాచ్ ఓడినా, యుద్ధంలో గెలిచాం' అంటూ భర్తకు వంత పాడింది. ఇక ఫర్హాన్ తన ఫైరింగ్ సంబరాలను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడు. 'గతంలో నేనెప్పుడూ సంబరాలు చేసుకోలేదు. కానీ ఈసారి ఎందుకో చేసుకోవాలనిపించింది. ఎవరేమనుకున్నా నేను లెక్కచేయను' అని తెగేసి చెప్పాడు. వాస్తవానికి గతంలో పాక్ క్రికెటర్ల నుంచి ఇలాంటి మిలిటెంట్ మనస్తత్వాన్ని ఎన్నడూ చూడలేదు. మైదానంలో మాటా మాటా అనుకోవడం వరకే పరిమితమయ్యేది.

పాక్.. మాకు ప్రత్యర్థే కాదు: సూర్యకుమార్

సరైన ప్రత్యర్థి అంటే మైదానంలో నువ్వా.. నేనా? అనే రీతిలో తలపడాల్సి ఉంటుందని, కానీ పాక్ జట్టుతో తమకు పోటీ ఎక్కడుందని భారత కెప్టెన్ సూర్యకుమార్ ప్రశ్నించాడు. 'ఇక నుంచి పాక్ జట్టును మాకు ప్రత్యర్థి అని అనకండి. ఏదేనీ రెండు జట్లు 15 మ్యాచ్‌ల్లో తలపడి 8-7తో ఉంటే అప్పుడు ఓకే. కానీ ఇక్కడ 12-3తో మేం స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నాం. ఇక పోటీ ఏముంది?' అని పాక్ విలేకరి అడిగిన ప్రశ్నకు సూర్య సూటిగా జవాబిచ్చాడు.

భారత మీడియాకు భయపడి..

భారత మీడియాను ఎదుర్కొనేందుకు పాక్ క్రికెట్ జట్టు వెనుకంజ వేస్తోంది. గ్రూప్ మ్యాచ్‌లో ఓడాక.. అలాగే యూఏఈతో మ్యాచ్ ముగిశాక కూడా విలేకరుల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు భయపడి పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మీడియా ముందుకు రాలేదు. ఇప్పుడు రెండో ఓటమి తర్వాత మాత్రం ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడు. కానీ కేవలం పాకిస్థాన్ మీడియాకు తప్ప, భారత విలేకరులను ప్రశ్నలను అడిగేందుకు అనుమతించకపోవడం గమనార్హం.



కనేరియా

ఏకే 47కు జవాబుగా బ్రహ్మోస్: డానిష్

భారత్‌తో మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల హింసాత్మక ప్రవృత్తిని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తప్పుపట్టాడు. 'ఓపెనర్ ఫర్హాన్ ఏకే 47ను పేల్చినట్టుగా సంజ్ఞ చేశాడు. కానీ అభిషేక్, గిల్ వారిపై ఏకంగా బ్రహ్మోస్ క్షిపణినే పేల్చారు. పాక్ చర్యకు భారత్ ప్రతిచర్య భారీ స్థాయిలో ఉంది. ఇక ఇప్పుడు పాక్ జట్టు ఫఖర్ జమాన్ క్యాచ్‌ను వివాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తుంది' అని కనేరియా అన్నాడు.

అందుకే రెచ్చిపోయా: అభిషేక్

పాక్ బౌలర్లను తొలి బంతి నుంచే ఊచకోత కోసిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మ జట్టు విజయంలో కీలకమయ్యాడు. అయితే అకారణంగా పాక్ ప్లేయర్లు తమ మీదికి రావడం నచ్చలేదన్నాడు. మ్యాచ్‌లో పేసర్లు షహీన్, రౌఫ్‌లతో అతడికి వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. 'వారు ఎలాంటి కారణం లేకుండా మాతో అలా ప్రవర్తించారు. నాకిలాంటివి నచ్చవు. అందుకే ప్రతీ బంతిని బాది వారికి సరైన మెడిసిన్ ఇవ్వాలనుకున్నా' అని అభిషేక్ తెలిపాడు.



రౌఫ్

ఫుట్‌బాల్‌లోనూ ఓడించారు

పాక్‌పై భారత్ అండర్-17 విజయం

కొలంబో: క్రీడ ఏదైనా పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయి అని మరోసారి నిరూపితమైంది. తాజాగా శాఫ్ అండర్-17 చాంపియన్‌షిప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత కుర్రాళ్లు 3-2 తేడాతో పాక్ టీమ్‌పై నెగ్గారు. ఈ రెండు జట్లు ఇదివరకే సెమీస్‌కు అర్హత సాధించాయి. అయితే పాక్ తరపున మహ్మద్ అబ్దుల్లా గోల్ చేశాక కింద కూర్చుని టీ తాగుతున్నట్టుగా నటించడం చర్చనీయాంశమైంది.

భారత పర్యటనకు బోల్ట్



ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ బరిలో లెజెండ్

న్యూఢిల్లీ: స్ప్రింట్ లెజెండ్ ఉసేన్ బోల్ట్ భారత అభిమానుల కోసం ఫుట్‌బాలర్ అవతారమెత్తనున్నాడు. వచ్చే నెల ఒకటిన బెంగళూరు ఎఫ్‌సీ, ముంబై ఎఫ్‌సీ మధ్య జరిగే ప్రత్యేక ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో బోల్ట్ ఆడనున్నాడు. అయితే, ఒక్కో హాఫ్‌లో ఒక్కో జట్టు తరపున ఉసేన్ ఆడనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మేటి ఫుట్‌బాలర్లతోపాటు బాలీవుడ్ ప్రముఖులు కూడా పాల్గొంటారని చెప్పారు.

నాయర్, నితీశ్‌లకు చాన్స్ దక్కేనా?

వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు టీమిండియా ఎంపిక రేపు



కరుణ్ నాయర్, నితీశ్ కుమార్

న్యూఢిల్లీ: ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన కరుణ్ నాయర్‌కు మరో అవకాశం ఇస్తారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టును సెలెక్షన్ కమిటీ బుధవారం ఎంపిక చేయనుంది. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ దుబాయ్‌లో ఉండడంతో.. వర్చువల్‌గా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారని సమాచారం. గాయం నుంచి కోలుకొన్న కరుణ్ నాయర్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉన్నాడు. అయితే, ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ చెప్పుకోదగ్గ రీతిలో ఆడలేక పోయాడు. దీంతో అతడి స్థానానికి తెలుగు ఆటగాడు నితీష్ కుమార్, దేవ్‌దత్ పడిక్కళ్ నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొన్న నితీశ్.. ఆస్ట్రేలియా-ఎ టూర్‌కు ఎంపికయ్యాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ స్థానాలు పదిలంగానే కనిపిస్తున్నాయి. ఇంగ్లండ్ టూర్‌లో గాయపడిన రిషభ్ పంత్ విషయంలో మెడికల్ టీమ్ నివేదిక అందాల్సి ఉంది. అయితే అతను ఫిట్‌గా లేడని, ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా తీసుకోవడం ఖాయమని అంటున్నారు. రెండో వికెట్ కీపర్, మూడో ఓపెనర్‌గా నారాయణ్ జగదీశన్‌కు చాన్సిస్తే.. అభిమన్యు ఈశ్వరన్‌కు చోటు కష్టమే. ఫిట్‌నెస్ ఇబ్బందులేమీ లేకపోతే జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌తోపాటు సిరాజ్‌కు చోటు ఖాయమే. తుదిజట్టులో నితీశ్‌కు చాన్సిస్తే.. ప్రసిద్ధ్ కృష్ణ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి నిరాశ తప్పదు. శ్రేయాస్ అయ్యర్‌కు చోటు కష్టమేనంటున్నారు. వచ్చే నెల రెండు నుంచి అహ్మదాబాద్‌లో విండీస్‌తో తొలి టెస్ట్ జరగనుంది.

ప్రాబబుల్స్ (15): శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, కరుణ్ నాయర్/పడిక్కళ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), జడేజా, సుందర్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్, అక్షర్, నారాయణ్ జగదీశన్, నితీశ్ కుమార్, ఆకాష్ దీప్.

'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ

కోల్‌కతా: సౌరవ్ గంగూలీ (53) బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సోమ వారం జరిగిన సంఘం సర్వసభ్య సమా వేశంలో ఈ ఎన్నిక జరిగింది. సౌరవ్ అన్న స్నేహశిష్ ఆరేళ్ల పదవీకాలం ముగియడంతో ఈ ఖాళీ ఏర్పడింది. గతంలో 2015-19వరకు ఇదే పదవిలో ఉన్న గంగూలీ, తర్వాత 2019-22 మధ్య కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగానూ వ్యవహరించాడు.

డికాక్.. తిరిగి వన్డేల్లోకి

జొహాన్నెస్‌బర్గ్: వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ మనసు మార్చుకున్నాడు. అక్టోబరులో పాకిస్థాన్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో పాటు మూడు టీ20ల సిరీస్‌కు కూడా సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. 2023 వరల్డ్‌కప్ తర్వాత డికాక్ వన్డేలకు గుడ్‌బై చెప్పాడు.



ప్రణయ్



అనుపమ

కొరియా ఓపెన్ బరిలో ప్రణయ్

సువాన్ (కొరియా): నిలకడలేమి ఆట తీరుతో కొద్దికాలంగా ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ కొరియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్నాడు. మంగళవారం నుంచి మొదలయ్యే ఈ టోర్నీ సింగిల్స్‌లో ప్రణయ్‌తో పాటు యువ షట్లర్ ఆయుష్ శెట్టి, కిరణ్ జార్జ్ కూడా పోటీ పడనున్నారు. భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం ఈ టోర్నీ బరిలో లేకపోవడంతో ప్రణయ్, ఆయుష్‌పైనే పతక అంచనాలు నెలకొన్నాయి. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్, లక్షిత భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

స్మృతి మంధానపై పాట!



తిరువనంతపురం: మరికొద్ది రోజుల్లో ప్రారంభమవనున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సత్తా చాటాలని ఆకాంక్షిస్తూ ప్రొఫెసర్ వశిష్ఠ్ ఆమెపై పాట రూపొందించారు. కాలికట్‌లోని మలబార్ క్రిస్టియన్ కాలేజీలో హిస్టరీ శాఖ విభాగాధిపతిగా వశిష్ఠ్ గతంలో పనిచేశారు. ఈ పాటను వశిష్ఠ్ రాయగా, అతడి శిష్యురాలు సిలు ఫాతిమా ఆలపించారు. ప్రతి భారతీయురాలికి స్మృతి మంధాన ఒక స్ఫూర్తి ప్రదాత అని క్రికెట్‌లో ఆమె దేశానికి అందించిన రికార్డులు చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయని ఈ పాటలో వివరించారు.

పాక్ ఫైనల్ చేరేనా?

ఆసియా కప్



దుబాయ్: ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్ దశలో తొలిసారి గెలిచిన టీమిండియా.. ఆదివారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లోనూ పాక్‌ను చిత్తు చేసింది. ఈ నేపథ్యంలో ఇండో-పాక్ ముచ్చటగా మూడోసారి అంటే.. ఫైనల్లో తలపడే అవకాశం ఉందా? అనేది చర్చనీయాంశంగా మారింది. సూపర్-4 రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతుండడంతో పాక్ పని ఇప్పటికైతే ముగియలేదు. ఇంకా శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాక్ ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి ఓడినా.. పాక్ కథ ముగిసినట్టే. మరోవైపు పాక్‌పై గెలిచిన టీమిండియా.. ఇంకొక్క మ్యాచ్‌లో గెలిస్తే చాలు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. బుధవారం బంగ్లాతో, శుక్రవారం లంకతో భారత్ ఆడాల్సి ఉంది.

చావోరేవో..: సూపర్-4లో భాగంగా మంగళవారం పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్ ఇరుజట్లకూ చావోరేవోగా భావించాలి. బంగ్లాదేశ్ చేతిలో లంక ఓడగా.. భారత్ చేతిలో పాక్ చిత్తయింది. రెండు జట్లూ తొలి మ్యాచ్‌ల్లో ఓడడంతో.. రెండో మ్యాచ్‌లో తప్పనిసరిగా నెగ్గాల్సిన పరిస్థితి. ఒకవేళ లంక చేతిలో పాక్ ఓడితే.. ఆ జట్టు ఫైనల్ ఆశలు గల్లంతైనట్టే. మరోవైపు లంక పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. ఇరుజట్లకూ ఇది కీలక మ్యాచ్ కావడంతో మరింత రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.



ఇటలీ పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు

పెట్టుబడులతో రండి

- ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో అపార అవకాశాలు
- ఇటలీ పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటలీ పారిశ్రామికవేత్తలను కోరారు. ఇటలీకి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో భేటీ అయ్యారు. తెలంగాణలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను మంత్రి వారికి వివరించారు. రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ ప్రతిభ గల మానవ వనరులు, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్ఠమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా టీజీ-ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే వేగంగా అనుమతులు ఇస్తున్నామని శ్రీధర్ బాబు చెప్పారు. తెలంగాణ-ఇటలీ మధ్య సంబంధాల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఏఐఎంఎల్ సీటు 25 లక్షలు

- బి-క్యాటగిరీ సీట్ల కేటాయింపులో.. 20 ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలపై భారీగా ఫిర్యాదులు
- ఎంపికైన విద్యార్థుల జాబితా, ర్యాంకులు ప్రకటించలేదు
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదు
- వివరణ కోరిన ఉన్నత విద్యామండలి

బీ-క్యాటగిరీలో యాజమాన్య కోటా సీట్లను ప్రతిభ ఆధారంగా కేటాయించడం లేదంటూ ఇంజనీరింగ్ కాలేజీలపై భారీగా ఫిర్యాదులు అందాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 30 శాతం సీట్లను యాజమాన్యాలు అమ్ముకోవచ్చు. అయితే దీనికీ ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయి. తొలి ప్రాధాన్యం ప్రవాస భారతీయులకు(ఎన్ఆర్ఐ) ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాత జేఈఈ ర్యాంకు ఆధారంగా ప్రతిభగల వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రెండు విభాగాల్లో పూర్తవకుంటే ఎప్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. అయితే నగరంలోని ఇంజనీరింగ్ కాలేజీలు తెలంగాణ ఉన్నత విద్యామండలి జూన్ 17న ప్రకటించిన మార్గదర్శకాలను ఎక్కడా పాటించలేదని, ఇష్టారాజ్యంగా సీట్లు అమ్ముకున్నారని అనేక మంది ఫిర్యాదు చేశారు. కొన్ని కాలేజీలు డొనేషన్లు వసూలు చేశారని తల్లిదండ్రులు ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేశారు. ఎంపిక చేసిన విద్యార్థుల జాబితా, వారికి వచ్చిన జేఈఈ ర్యాంకు, ఎప్‌సెట్ ర్యాంకుల వివరాలు ప్రకటించలేదన్నారు. కంప్యూటర్ సైన్స్-ఏఐఎంఎల్ బ్రాంచికి ఈసారి భారీగా ఉన్న డిమాండ్‌తో కొన్ని ప్రముఖ కాలేజీలు గరిష్ఠంగా రూ. 25 లక్షల వరకు డొనేషన్ల రూపంలో వసూలు చేశాయని, దానికి ఎలాంటి రసీదులు ఇవ్వలేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. యాజమాన్య కోటా సీట్ల ప్రక్రియ ముగిసినందున.. కాలేజీలు పంపే జాబితాను ఉన్నత విద్యామండలి ఆమోదిస్తేనే బీ-క్యాటగిరీ సీట్ల ప్రవేశాలు కొనసాగుతాయి. ఈ సీట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రారంభమైంది. ఇప్పటికే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 20 కాలేజీలకు ఉన్నత విద్యామండలి అధికారులు సోమవారం సంజాయిషీ నోటీసులు పంపారు.

మత్తయ్య విచారణకు అనుమతి ఇవ్వండి

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో నిందితుడు జెరూసలెం మత్తయ్యను విచారించడానికి అనుమతి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. నాలుగో నిందితుడు (ఏ4)గా ఉన్న ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను దర్యాప్తు ప్రాథమిక దశలోనే హైకోర్టు కొట్టివేసిందని, అందువల్ల తాము ఇంతవరకు విచారించలేకపోయినట్టు తెలిపింది. 2016లో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా హైకోర్టు దానిని కొట్టివేసింది. దానిని సవాలు చేస్తూ ఏసీబీ 2016 జూలై 6న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ఏ2గా ఉన్న సెబాస్టియన్, ఏ4 మత్తయ్యలు దాదాపుగా ఇరవై సార్లు ఫోన్లలో సంభాషించుకున్నారని దీనిపై దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు కేసును కొట్టివేసిందని చెప్పారు. ఈ వాదనను మత్తయ్య తరఫు న్యాయవాది ఖండించారు. ఆయన క్రైం సీన్‌లో లేరని, కేసులో ఇరికించారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. మరోవైపు సెబాస్టియన్ పెట్టుకున్న పిటిషన్‌ను కూడా ఇదే ధర్మాసనం పరిశీలించింది.

హరిత నిధికి రూ. 300 వసూలు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హరిత నిధి కార్యక్రమానికి తోడ్పాటుగా, ఉద్యోగుల వేతనాల నుంచి నిధిని వసూలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. సంస్థలోని ప్రతి ఉద్యోగి జీతం నుంచి రూ.300 కంట్రిబ్యూషన్ కింద వసూలు చేసి హరిత నిధి ఖాతాలో జమచేయనున్నారు. ఈ వసూలు సెప్టెంబరు నెల వేతన నుంచి జరుగుతుంది. ఈ మొత్తాన్ని అక్టోబరులో చెల్లించే జీతంలో కట్ చేస్తారు. ఈ మేరకు ఆర్టీసీ సంస్థ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది.



విశ్వప్రసాద్



సి.చంద్రకాంత్ రెడ్డి



ఎల్బీ. లక్ష్మీకాంత్ రాథోడ్

టీజీపీఎస్సీలో మరో ముగ్గురు సభ్యులు

- ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, సి.చంద్రకాంత్ రెడ్డి, ఎల్బీ లక్ష్మీకాంత్ నియామకం
- ఉత్తర్వులు జారీ.. కమిషన్‌లో ఆరుకు చేరిన సభ్యుల సంఖ్య

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మరో ముగ్గురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, సి.చంద్రకాంత్ రెడ్డి, ఆచార్య ఎల్బీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఉన్నారు. వీరు ఆరు సంవత్సరాలు లేదా 62 ఏళ్లు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కమిషన్‌లో సభ్యులుగా అమీరుల్లాఖాన్, ఆచార్య నర్రి యాదయ్య, పాల్వాయి రజని కుమారి ఉన్నారు. కొత్త సభ్యులతో టీజీపీఎస్సీలో సభ్యుల సంఖ్య ఆరుకు చేరింది. కాగా కొత్తగా నియామకమైన సభ్యుల్లో ఆచార్య లక్ష్మీకాంత్ స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పనిచేశారు. అంతకుముందు ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2005 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశ్వప్రసాద్, ఈ ఏడాది డిసెంబరులో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. సి.చంద్రకాంత్ రెడ్డి మునిసిపల్ పాలన, పట్టణ అభివృద్ధి శాఖలో పనిచేశారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చంద్రకాంత్ రెడ్డికి మరో మూడేళ్ల సర్వీసు ఉంది.

ఆర్ఆర్ఆర్‌కు ఒకే నంబరు!

దక్షిణ భాగానికీ ఉత్తర భాగం నంబరే ఇవ్వాలి.. రెండింటిని వేర్వేరు ప్రాజెక్టులుగా చూడొద్దు

- ఏకకాలంలో పనులకు సహకరించాలి
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో రేవంత్
- రహదారుల నిర్మాణాల్లో జాప్యం వద్దు
- భూసేకరణ, పరిహారం పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే అధికారులపై వేటు
- జాతీయ రహదారుల నిర్మాణాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- కోర్ అర్బన్ ప్రాంత అభివృద్ధిపైనా సమీక్ష



జాతీయ రహదారుల నిర్మాణాలపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ భాగాలను రెండు వేర్వురు ప్రాజెక్టులుగా చూడొద్దని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఉత్తర భాగానికి కేటాయించిన నంబరునే దక్షిణ భాగానికి కూడా కొనసాగించాలని కోరారు. అందుకు వెంటనే అనుమతులు మంజూరు చేయడంతోపాటు ఏకకాలంలో రెండింటి పనులు ప్రారంభించేందుకు సహకరించాలన్నారు. దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదముద్ర వేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై ఎన్‌హెచ్ఏఐ, జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న చిన్న కారణాలతో రహదారుల నిర్మాణంలో జాప్యం చేయొద్దన్నారు.

ఫ్యూచర్ సిటీ రోడ్డుకు అనుమతివ్వండి..

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి, మచిలీపట్నం వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, అలైన్‌మెంట్ ఖరారు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ఈ రహదారికి సమాంతరంగా తాము రైలు మార్గం అడుగుతున్నామని చెప్పారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో రావిర్యాల-మన్ననూర్‌కు సంబంధించి ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు మంజూరు చేసి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్-మంచిర్యాల-నాగ్‌పూర్ నూతన రహదారికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలనే అంగీకరించాలని కోరారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు.

జాప్యం చేస్తే వేటు తప్పదు..

మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163జీ), ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563), మహబూబ్‌నగర్-మరికల్-దేవ్‌సుగూర్ (ఎన్‌హెచ్-167) రహదారులకు సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంపై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పలుచోట్ల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వారు చెప్పగా.. అన్ని జిల్లాల్లోని కేసులపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని, అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లపై వేటు వేస్తామని హెచ్చరించారు. అటవీ, పర్యావరణ శాఖ పెడుతున్న కొర్రీలపైనా సీఎం సమీక్షించారు. 2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారని, దాంతో ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాథ్‌కుమార్ తెలిపారు. దీంతో ఉల్లంఘనల వివరాలు సమర్పించాలని సీఎస్‌ను ఆదేశించారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామన్నారు. అవసరమైతే కేంద్ర మంత్రులు గడ్కరీ, భూపేందర్ యాదవ్‌లతో తాను స్వయంగా భేటీ అవుతానన్నారు. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్యప్రాణుల చట్టం అమలు చేస్తున్నారని అన్నారు. తమ కార్యాలయానికి హైదరాబాద్‌లో 2ఎకరాల భూమి కేటాయించాలన్న ఎన్‌హెచ్ఏఐ అధికారుల విజ్ఞప్తికి సీఎం అంగీకరించారు.

గ్లోబల్ సిటీకి చిరునామాగా కోర్ అర్బన్ అభివృద్ధి

తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ప్రాంతాన్ని గ్లోబల్ సిటీకి చిరునామాగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మానవ జీవన ప్రమాణాలకు కొలమానంగా ఉన్న విద్య , వైద్యం, రోడ్డు రవాణా, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సోమవారం కోర్ అర్బన్ ప్రాంత అభివృద్ధి ప్రతిపాదనలపై సచివాలయంలో జరిగిన సమీక్షలో సీఎం మాట్లాడారు. నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ మేరకు కోర్ అర్బన్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ఐదు విభాగాలుగా విభజించారు. మొత్తం 111 ప్రతిపాదనలను సీఎంవో ప్రత్యేకాధికారి జయేశ్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కోర్ అర్బన్ అభివృద్ధిలో భాగంగా ప్రాథమిక విద్యను అందరికీ అందిచేలా సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు. కబ్జాల నుంచి విముక్తి పొందిన ప్రభుత్వ భూముల్లో పాఠశాలల భవనాలు నిర్మించాలని సూచించారు. విద్యార్థులకు టిఫిన్, లంచ్, స్నాక్స్ ప్రభుత్వమే అందించి, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచంలో హైదరాబాద్‌కు క్లీన్ సిటీ ఇమేజ్ తీసుకొచ్చేందుకు అధికారులు నిరంతరం శ్రమించాలన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పురపాలక శాఖ అధికారులను హెచ్చరించారు. ప్రతి కార్యాలయానికీ సొంత భవనం ఉండేలా స్థలం కేటాయించాలని, వాటిపై సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పారిశుధ్య పనులకు రోబోలను వాడాలన్నారు. వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిని బాధితులుగా చూడకుండా కనీసం పది రోజులపాటు పునరావాస కేంద్రాల్లో ఉంచాలన్నారు. ఈ కేంద్రాల నిర్వహణను మాజీ ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో ఉంచేలా వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.



నేడు మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి

అమ్మవార్ల గద్దెల ప్రాంగణం డిజైన్లపై సమీక్ష

జాతరలో చేపట్టే అభివృద్ధి పనులకూ శంకుస్థాపన

ములుగు/తాడ్వాయి/వరంగల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు గద్దెల ప్రాంగంణం విస్తరణ, డిజైన్లపై సమీక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం రానున్నారు. ప్రతి రెండేళ్లకోసారి జాతరకు ముందు చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం సీఎం రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు పలు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.150కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో శాశ్వత అభివృద్ధి పనులతో పాటు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునికీకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఇక్కడ సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఒక వరుసలో, ఆయా గద్దెలకు ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. భక్తులు క్యూ లైన్‌లో సమ్మక్క, సారలమ్మ దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావడం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నలుగురు గద్దెలను ఒకే వరుసలో నిర్మించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం గద్దెల చుట్టూ ఉన్న ఇనుప (స్టీల్) గ్రిల్స్‌ను తొలగించి.. గ్రానైట్‌తో నిర్మించాలని యోచిస్తున్నారు. గిరిజన పూజారుల అభిప్రాయాలకు అనుగుణంగా నాలుగైదు రకాలుగా గద్దెల డిజైన్లను అధికారులు రూపొందించారు. సీఎం రేవంత్ సమీక్ష సందర్భంగా ఒక డిజైన్‌ను ఖరారు చేసి, శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం 32 గుంటల్లో ఉన్న తల్లుల గద్దెల ప్రాంగణం ఉండగా, నాలుగు వైపులా మరో 20 అడుగుల మేర విస్తరించాలని భావిస్తున్నారు. గద్దెల ప్రాంగణం విస్తరణ, అతిథి గృహాల నిర్మాణానికి మొత్తం 23 ఎకరాల భూమిని సేకరించనున్నారు. జంపన్న వాగుపై ఎప్పటికీ నీరు నిలిచి ఉండేలా.. రెండు, మూడు చోట్ల చెక్ డ్యామ్‌లను నిరించాలన్న ప్రతిపాదనలు ఉండగా.. గత అనుభవాల దృష్ట్యా కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. భక్తుల విశ్వాసాలకు భంగం కలుగకుండా జంపన్నవాగులో నిరంతం నీళ్లు పారేలా ప్రణాళిక రూపొందించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సీఎం పర్యటనలో భాగంగా ఐలాపూర్ వరకు రోడ్డు నిర్మాణం, జాతర ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు.



ఆ 10 మంది ఎమ్మెల్యేలదీ ఫిరాయింపే!

- కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు..
- ఆ పార్టీ సమావేశాల్లోనూ పాల్గొన్నారు
- అసెంబ్లీ కార్యదర్శికి అఫిడవిట్ రూపంలో ఆధారాలిచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఆ 10 మంది ఎమ్మెల్యేలది పార్టీ ఫిరాయింపేనంటూ ఆ పార్టీ నాయకులు తమ వద్ద ఉన్న ఆధారాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారికి సమర్పించారు. ఫొటోలు, పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారం, ఇతర ఆధారాలను అందజేశారు. ఆ 10 మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంను కలిశామని చెబుతున్నా.. కొన్ని నెలలుగా వారంతా కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అనర్హులుగా ప్రకటిస్తారన్న భయంతో గతంలో సీఎంను కలిసినప్పుడు తమకు కప్పింది కాంగ్రెస్ పార్టీ కండువా కాదని, జాతీయ జెండా రంగులతో ఉన్న కండువా అని బుకాయిస్తున్నారని విమర్శించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను గెలిపించాలని బాన్సువాడ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో బహిరంగంగానే పిలుపునిచ్చారని వారు ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 'నేను జగిత్యాలలో బయలుదేరాను. నేరుగా గాంధీ భవన్‌కు వెళ్తున్నా' అని ఎమ్మెల్యే సంజయ్ 'ఎక్స్' వేదిక చేసిన పోస్టును ప్రస్తావించారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల) ఒక రోజు ఇచ్చిన పత్రికా ప్రకటనలో కాంగ్రెస్ నాయకుల పేర్లు, ఫొటోలు ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య కూడా కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కె.సంజయ్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. బీఆర్ఎస్ పుట్టకముందే ఫిరాయింపుల చట్టం వచ్చిందని, మొదటి నుంచీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సరైన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని చెప్పారు. తాను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ నిర్ణయిస్తారని కడియం శ్రీహరి మాట్లాడడం దుర్మార్గమని, ఆయన సోయి, జ్ఞానంతో మాట్లాడాలన్నారు. పది స్థానాల్లో ఉప ఎన్నికలు రావడం, ఫిర్యాయింపు ఎమ్మెల్యేలు మట్టి కరవటం ఖాయమన్నారు. కృష్ణా జలాల విషయంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, తాను రుజువులు చూపిస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ చెప్పుదెబ్బలకు సిద్ధమా అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

నాలుగు రోజుల్లోనే నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి, పంపిన బిల్లులపై కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందుకే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైందని, తాజాగా ప్రత్యేక జీవోతో ఎన్నికలకు వెళ్తున్నామని, అందుకు కొంత సమయం కావాలంటూ ప్రభుత్వం హైకోర్టును కోరనున్నట్లు తెలిసింది. మరోవైపు స్థానిక ఎన్నికల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

కమిషన్ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్.. ఇలా 6 రకాల నివేదికలను కమిషన్ తయారు చేసింది. ఆయా పదవుల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ల వివరాలను పేర్కొంది. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు ఎంత మేర రిజర్వేషన్ కేటాయించాలి? వార్డుల్లో ఎంతమంది బీసీలు ఉన్నారు? ఒకవేళ బీసీలకు సర్పంచ్ పోస్టును ఇవ్వాలంటే గ్రామం మొత్తం మీద బీసీలు ఎందరు ఉన్నారనే అంశాలను పరిగణనలోకి తీసుకుంది. మండల స్థాయి పోస్టులైన ఎంపీటీసీ, ఎంపీపీలకూ ఇదే విధానాన్ని వర్తింపజేయనున్నారు. ఇక జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్మన్‌ల అంశంలోనూ రాష్ట్రస్థాయిలో ఉన్న వివరాలను పరిగణనలోకి తీసుకుంది. దీని ప్రకారమే ప్రస్తుతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఎస్సీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు 2024 కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించనున్నారు. అలాగే వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవో; సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవో; ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా కలెక్టర్లు; జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్లు ఖరారు చేయనున్నారు.

నేడు సీల్డ్ కవర్లో రిజర్వేషన్లు..

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల వ్యవహారంపై సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో ముమ్మర కసరత్తు జరిగింది. ప్రత్యేక కమిషన్ నివేదికలతో పాటు ఆయా జిల్లాలు, గ్రామాల వారీగా ఉన్న జనాభా వివరాలను ప్రభుత్వం కలెక్టర్లకు అందించింది. ఆ వివరాల ప్రకారమే వార్డు సభ్యుల నుంచి జడ్పీ చైర్‌పర్సన్ వరకు రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేస్తున్నారు. 12,760 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 ఎంపీపీలు, 565 జడ్పీటీసీలు, 31 జడ్పీ చైర్‌పర్సన్ స్థానాలకు ఖరారు చేసిన రిజర్వేషన్ల వివరాలను సీల్డ్ కవర్‌లో ఉంచి మంగళవారం సాయంత్రానికి కలెక్టర్లు ప్రభుత్వానికి అందించనున్నారు.

సమ్మక్క సాగర్‌కు ఎన్‌వోసీ!

- సూత్రప్రాయంగా ఛత్తీస్‌గఢ్ ఓకే
- ఆ రాష్ట్ర సీఎంతో మంత్రి ఉత్తమ్ సంప్రదింపులు ఫలప్రదం
- సీడబ్ల్యూసీ భేటీలోపే ఎన్‌వోసీ!



ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ నెల 25న ఈ ప్రాజెక్టుపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సమావేశం ఉండటంతో ఈలోగా ఆ రాష్ట్రంతో సంప్రదింపులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రంగంలోకి దిగారు. సోమవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని న్యూ రాయ్‌పూర్‌లో ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయిని కలుసుకున్నారు. ముంపు భూములకు 2013 భూసేకరణ చట్టం లేదా గంపగుత్తగా పరిహారం అందించే జీవోల ఆధారంగా ముందస్తుగా పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాల వల్ల కీలక ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ క్లియర్ చేయడం లేదని నివేదించారు. ఎన్‌వోసీ ఇస్తేనే క్లియరెన్స్ వస్తుందని తెలిపారు. ముంపు భూములకు సముచితంగా పరిహారం ఇస్తామని, పునరావాసం, పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో సమ్మక్క సాగర్ ప్రాజెక్టు గురించి ఉత్తమ్ వివరించారు. 83 మీటర్ల ఎత్తుతో 6.7 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీని కట్టామని, పూర్వ నల్గొండ, వరంగల్ జిల్లాలో 2.64 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు రామప్ప-పాకాల లింక్‌లో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడం ప్రాజెక్టు లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో తాగు, సాగునీటి అవసరాలు తీరతాయని, కరువు ప్రాంతాలకు మేలు జరుగుతుందని తెలిపారు. దశాబ్దాలుగా వ్యవసాయంలో అనిశ్చితితో సతమతం అవుతున్న రైతులకు జీవనోపాధి కల్పించడంతో పాటు వ్యవసాయ దిగుబడులను పెంచడంలో ప్రాజెక్టు కీలకమని వివరించారు. రాష్ట్రంలోని అత్యంత వెనకబడిన ప్రాంతాల్లోని లక్షలాది మందికి ఈ ప్రాజెక్టు జీవధారగా మారుతుందని తెలిపారు. బ్యారేజీకి గరిష్ఠ వరదతో కలిగే ముంపుపై ఐఐటీ ఖరగ్‌పూర్ నివేదిక అందించిందని, దాని ప్రకారం పరిహారం అందిస్తామని చెప్పారు. అదీ ముందస్తుగా ఎన్‌వోసీ ఇచ్చే సమయంలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ సీఎం స్పందిస్తూ ముంపు ప్రభావిత ప్రాంతాలకు పరిహారం ఇస్తే.. ఎన్‌వోసీ ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. సీడబ్ల్యూసీ ఈ నెల 25న సమ్మక్క సాగర్‌పై తెలంగాణ అధికారులతో సమావేశం కానుంది. ఆలోపే ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ అందే అవకాశాలు ఉన్నాయి.

సర్కారీ దవాఖానాల్లో రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది

సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా ఆర్మీ పర్సన్

పేషెంట్ కేర్ ఆస్పత్రుల్లో మహిళలకు ప్రాధాన్యం

వైద్యశాఖ సమీక్షలో మంత్రి దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణలో భద్రత, పరిశుభ్రత, పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమైనవని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ మూడు వ్యవస్థలతో పాటు, పేషెంట్లకు అందించే డైట్ విధానంలో తీసుకురావాల్సిన మార్పులు, ఆయా వ్యవస్థలను బలోపేతం చేయడానికి కొత్త పాలసీల రూపకల్పనపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, డైట్ పాలసీల్లో ఉన్న లోపాలను, ఆ లోపాల వల్ల ఎదురవుతున్న సమస్యలను అధికారులు మంత్రికి వివరించారు. సెక్యూరిటీ టెండర్ నిబంధనల్లో సరైన నియమాలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డులుగా వృద్ధులను, శారీరక దృఢత్వం లేని వారిని నియమిస్తున్నారని, ఈ అంశంలో మార్పు తీసుకురావాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, మొత్తం సెక్యూరిటీ సిబ్బందిలో కొంత శాతం మందిని ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ సిబ్బంది నుంచి నియమించుకోవాలన్నారు. టెండర్ నిబంధనలు మార్చి 50 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారిని మాత్రమే నియమించుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలోనూ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రంగా ఉంచే బాధ్యత సానిటేషన్ కాంట్రాక్టర్లదేనని మంత్రి పేర్కొన్నారు. రోగులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేలా కొత్త పాలసీ రూపొందించాలని కూడా మంత్రి సూచించారు. ఏఎన్ఎం లేదా ఇతర తగిన అర్హతలు ఉన్న వారిని మాత్రమే పేషెంట్ కేర్ వర్కర్లుగా నియమించుకోవాలని, అందులో 60%మహిళలు ఉండేలా చూడాలని మంత్రి సూచించారు.

నూజివీడు సీడ్స్ చైర్మన్ వెంకటరామయ్య కన్నుమూత

» నివాళులర్పించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య


మండవ వెంకటరామయ్య

నూజివీడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ లిమిటెడ్(ఎన్ఎస్ఎల్) చైర్మన్ మండవ వెంకటరామయ్య(94) సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు, ఎన్ఎస్ఎల్ ఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. వెంకటరామయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో ఎంఎస్సీ చేసి తిరిగి స్వగ్రామం వచ్చిన ఆయన, దేశంలో ప్రైవేటు విత్తన రంగం ప్రారంభమైన సమయం... 1973లో నూజివీడు సీడ్స్‌ను స్థాపించారు. ఆ బాటలోనే ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు సైతం నూజివీడు సీడ్స్‌ను అభివృద్ధి పరుస్తూ అనేక పరిశ్రమలను స్థాపించి వ్యాపారాన్ని విస్తరించారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్య నివాళి

'వెంకటరామయ్య లేని లోటు తీర్చలేనిది. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఇచ్చే ఘనమైన నివాళి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం తుక్కులూరులో వెంకటరామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో ఇద్దరి మృతి


మౌనిక; మేఘన(ఫైల్)

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా)/కోహీర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాల్లో విషాదం చోటు చేసుకుంది. బతుకమ్మ ఆడుతూ గుండెపోటుకు గురై వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఇద్దరు మహిళలు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంకు చెందిన శెట్టి మౌనిక (32) బతుకమ్మ ఆడేందుకు ఇద్దరు కూతుళ్లు, కుమారునితో కలిసి గ్రామంలోని గుడి వద్దకు వెళ్లింది. బతుకమ్మ చుట్టూ చేరి ఆటలు ఆడుతున్న సమయంలోనే మౌనిక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మౌనికను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగలి మేఘన(24) సైతం బతుకమ్మ ఆడుతుండగా ఆకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వచ్చి పడిపోయింది. వెంటనే అక్కడున్న మహిళలు జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు.

నాగారం భూముల కేసులో ఐఏఎస్, ఐపీఎస్‌లకు కోర్టు ధిక్కరణ నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని వివాదాస్పద భూదాన్, ప్రభుత్వ భూముల కేసులో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ అయ్యాయి. ఈ భూముల విషయమై తాము ఇచ్చిన ఆదేశాలు పాటించలేదంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డికి హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసింది. ఆ భూముల స్వరూపాన్ని మార్చరాదని పేర్కొంటూ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పేర్కొంటూ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సైతం నోటీసులు జారీచేసింది. పిటిషనర్ బిర్ల మల్లేశ్ తాజాగా దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై సోమవారం జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసి తదుపరి విచారణను అక్టోబర్ 10కి వాయిదా వేశారు.

ఏపీపీల తొలగింపుపై వివరణ ఇవ్వండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు.. నేడూ విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో జిల్లా కోర్టుల్లో నిర్దిష్ట పదవీకాలం ప్రాతిపదికన నియామకమైన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)ల తొలగింపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఎంత మందిని తొలగించారు, వారి పదవీకాలం ఇంకెంత ఉంది, కొత్తగా ఎందరిని నియమించారు వంటి వివరాలను సమర్పించాలని తెలిపింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న తనకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ప్రభుత్వం తొలగించిందంటూ న్యాయవాది టీ వెంటేశ్వరప్రసాద్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో 12 మంది వేర్వేరు పిటిషన్లు దాఖలుచేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారిని తొలగిస్తూ ఈ నెల 10న ప్రభుత్వం జీవో జారీచేసిందని తెలిపారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వారిని ఎప్పుడైనా తొలగించే అధికారం సర్కార్‌కు ఉంటుందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

వైద్యం వికటించి ఏడేళ్ల బాలిక మృతి

» నకిలీ వైద్యుడి నిర్వాకం, క్లినిక్ సీజ్

ఉప్పల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్‌లో అర్హతలు లేకుండా వైద్యుడిగా చలామణి అవుతున్న బాల సిద్ధులు అనే వ్యక్తి చేసిన వైద్యం వికటించి ఏడేళ్ల బాలిక మృతి చెందింది. బోడుప్పల్‌కు చెందిన కొండరాజు, లావణ్య దంపతుల కుమార్తెకు వారం క్రితం జ్వరం రావడంతో సత్యపాలీ క్లినిక్‌కు తీసుకెళ్లారు. సిద్ధులు ఆమెకు వైద్యం చేశాడు. 21న బాలిక ఆరోగ్యం క్షీణించడంతో తల్లిదండ్రులు మళ్లీ క్లినిక్‌కు తీసుకెళ్లారు. టైఫాయిడ్, జాండిస్ అని నిర్ధారించిన సిద్ధులు మందులు ఇచ్చాడు. చికిత్స సమయంలో చిన్నారికి రక్తపు వాంతులయ్యాయి. ఆదివారం సాయంత్రం క్లినిక్‌లోనే బాలిక మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన నేపథ్యంలో క్లినిక్‌కు చేరుకున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారులు విచారణ జరిపారు. క్లినిక్‌కు ఎలాంటి అనుమతులు లేవని, బాల సిద్ధులు మెడికల్ కౌన్సిల్‌లో నమోదు పొందిన అర్హత కలిగిన వైద్యుడు కాదని విచారణలో తేల్చారు. క్లినిక్‌ను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు.

1300 చెరువులకు హద్దులు ఫైనల్

» 2949 చెరువులకు ప్రాథమికంగా నిర్ధారణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ పరిధిలో 1300 చెరువులకు హద్దులను ఖరారు చేస్తూ ఫైనల్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. చెరువుల హద్దుల అంశాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకున్న నేపథ్యంలో హెచ్ఎండీఏతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, స్థానిక సంస్థల అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్ఎండీఏ ఇప్పటి వరకు 2949 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్లు వేసింది. ఆయా చెరువులకు ఐడీ నంబర్లను కూడా ఇచ్చింది. ఆయా చెరువులకు ప్రజల నుంచి అభ్యంతరాలన్నీ స్వీకరించి 1300 చెరువులకు హద్దులను ఖరారు చేస్తూ ఫైనల్ నోటిఫికేషన్ వేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 500 చెరువులకు హద్దులను ఖరారు చేశారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ ఏడాది నెల రోజుల వ్యవధిలోనే 197 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్లను జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాలో సంగారెడ్డి జిల్లాలోనే నెల రోజుల్లో అత్యధికంగా 92 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ చేశారు. మెదక్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలు కొంత మేరకు కృషి చేయగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నెల రోజుల వ్యవధిలో ఒక్క చెరువుకు ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఔటర్ వరకు ఉన్న చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ నిర్ధారణకు తుది నోటిఫికేషన్‌ను వచ్చే నేల నుంచి ప్రకటించనున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కూడా గుర్తించనున్నట్టు చెప్పారు.

అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

కేంద్రకమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి మృతి

» రాజుదాదా, కోసా పేరిట 30ఏళ్లుగా డీకేలో మకాం
» ఇద్దరూ కరీంనగర్ వాసులే
» ఒక్కొక్కరిపై చెరో రూ.40 లక్షల రివార్డు
» ఇద్దరు సీసీలు ఒకే ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం గత పాతికేళ్లలో ఇదే తొలిసారి
» ఈ ఒక్క నెలలోనే నలుగురు సీసీలు మృతి
» మరో సీసీ సుజాత లొంగుబాటు
» ఇక.. కేంద్రకమిటీలో మిగిలింది 8 మందే
» ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించిన ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయశర్మ


కట్టా రామచంద్రారెడ్డి; కడారి సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

చర్ల, చింతూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లలో అగ్ర నాయకత్వాన్ని కోల్పోతున్న మావోయిస్టు ఉద్యమానికి మరో ఎదురుదెబ్బ. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా, వికల్ప్, ఉసెండీ) (63), కడారి సత్యనారాయణ రెడ్డి (కోసాదాదా, గోపన్న, బుచ్చన్న) (67) మృతిచెందారు. వీరిద్దరూ తెలంగాణలోని కరీంనగర్ జిల్లా. వీరిద్దరిపై రూ.40 లక్షలు చొప్పున రివార్డు ఉంది. ఘటనాస్థలం నుంచి ఏకే 47, ఇన్సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గత పాతికేళ్లలో ఒకరి కంటే ఎక్కువ మంది కేంద్రకమిటీ సభ్యులు ఒక ఎన్‌కౌంటరులో చనిపోవడం ఇదే తొలిసారి. 1999లో జరిగిన కొయ్యూరు ఎన్‌కౌంటరులో కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి (శ్యామ్, రఘు), ఎర్రంశెట్టి సంతోశ్‌రెడ్డి (మహేశ్) చనిపోయారు. ఇక..ఈ ఒక్క నెలలోనే నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు మరణించగా, మరో సీసీ మెంబరు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌కౌంటర్ అయిన మల్లోజుల కోటేశ్వర్‌రావు (కిషన్‌జీ) భార్య పోతుల కల్పన (సుజాత) తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు కేంద్ర బలగాలకు సమాచారం అందింది. దీంతో కేంద్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. సోమవారం ఉదయం నుంచి మావోయిస్టులు, బలగాల మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనాస్థలంలో గాలించగా, ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్టు నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ తెలిపారు. వారిని అగ్ర మావోయిస్టులుగా గుర్తించినట్టు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌ను ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయశర్మ, ఐజీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు. అడవుల్లో వర్షాలు కురుస్తూ కఠిన పరిస్థితులున్నా బలగాలు విజయాలు సాధిస్తున్నాయని అన్నారు.

టార్గెట్ కేంద్ర కమిటీ.. మిగిలింది ఎనిమిది మందే

వచ్చే ఏడాది మార్చి 31నాటికి ఆపరేషన్ కగార్‌ను ముగించాలన్న కేంద్రం ఆదేశాలతో బలగాలు కూంబింగ్ ముమ్మరంగా చేస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యులే లక్ష్యంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి, ఇందుకు కోసం ప్రత్యేక శాటిలైట్ టెక్నాలజీని బలగాలు వినియోగించుకుంటున్నట్టు తెలుస్తోంది. గతేడాది నుంచి చూస్తే కేంద్రకమిటీ సభ్యులు చలపతి, మాంఫీ, గణేశ్, మోడెం బాలకృష్ణ, సహదేవ్, తాజాగా రాంచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి...మొత్తం 8మంది మృతి చెందారు. ఈ ఏడాది మే 25న ఎన్‌కౌంటర్ అయిన కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ కేశవరావు అలియాస్ బస్వరాజ్‌ను కలుపుకొంటే ఈ సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో సీసీ మెంబరు సుజాత పోలీసులకు లొంగిపోయారు. మొత్తం కేంద్ర కమిటీలో ప్రస్తుతం ఎనిమిది మందే ఉన్నట్టు పోలీసువర్గాలు భావిస్తున్నాయి. కాగా, తాజా ఎన్‌కౌంటర్‌పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నచోట మూడంచెల భద్రత ఉంటుందని, అందులో ఎవరూ చనిపోకుండా కేవలం ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఎలా చనిపోతారని ప్రజాస్వామిక, పౌర హక్కుల సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. లొంగిపోయిన వారు ఇచ్చిన సమాచారంతో పట్టుకుని చంపి ఉంటారని ప్రచారం జరుగుతోంది. కాగా, కట్టా రామచంద్రారెడ్డిది కరీంనగర జిల్లా కోహిడ్‌పేట మండలం తీగలకుంట. కడారి సత్యనారాయణది అదే జిల్లాలోని సిరిసిల్ల మండలం గోపాలరావుపల్లి. వీరిద్దరూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నారు. జవాన్లను చంపివేసిన ఘటనల్లో పలు కేసులు వీరిపై నమోదయ్యాయి.

45 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లి!

» కోసగా పేరొందిన కడారి సత్యనారాయణరెడ్డి
» అంచలంచెలుగా సెంట్రల్ కమిటీ సభ్యుడి స్థాయికి..
» మృతి వార్తతో సిరిసిల్ల జిల్లా గోపాలపురంలో విషాదం

సిరిసిల్లక్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస అలియాస్ గోపన్న అలియాస్ సాధు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారన్న వార్తతో ఆయన స్వగ్రామమైన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లిలో విషాద చాయలు నెలకొన్నాయి. కడారి అన్నమ్మ, కృష్టారెడ్డి దంపతులకు 1955లో సత్యనారాయణరెడ్డి జన్మించారు. ఎల్లారెడ్డిపేటలో 10వ తరగతి వరకు చదివిన సత్యనారాయణరెడ్డి.. పెద్దపల్లిలో ఐటీఐ చదువుతుండగా(1975-77 మధ్య) ర్యాడికల్ విద్యార్థి ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. రామగుండంలోని కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ మల్లోజుల కోటేశ్వర్‌రావు(కిషన్‌జీ) నాయకత్వంలో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. 45ఏళ్లుగా పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీలో పని చేస్తూ గెరిల్లా యుద్ధ నిపుణుడిగా పేరు పొందిన కోస... దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా, మిలిటరీ కమాండర్‌గా, సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. 1980లో ఉగాది పండుగ నాడు గోపాల్‌రావుపల్లికి వచ్చి కుటుంబ సభ్యులను కలిసిన కోస.. ఆ తర్వాత మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. పోలీసులకు ఎలాంటి ఆనవాళ్లు దొరకకుండా అప్పట్లోనే తన ఫొటోలు, సర్టిఫికెట్లు తీసుకెళ్లారు. పార్టీలో ఉంటూనే 1984లో రాధను వివాహం చేసుకున్నారు. 2012లో తల్లి అన్నమ్మ, 2013లో తండ్రి కృష్టారెడ్డి మరణించిన సందర్భాల్లో కోసా వస్తారని పోలీసులు నిఘా ఉంచినా.. రాలేదు. దేశవ్యాప్తంగా కోసపై రూ.3కోట్ల మేర రివార్డు ఉంది. తాజాగా ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందారన్న వార్తతో గోపాల్‌రావుపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. మీడియాలో వస్తున్న ఫొటోల్లో ఉన్నది తన సోదరుడు కాకపోవచ్చని కోస సోదరుడు కరుణాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

బడితె వదిలి బందూకు పట్టి!

» 36ఏళ్ల క్రితం టీచర్ ఉద్యోగాన్ని వదిలేసి
» అజ్ఞాతంలోకి వెళ్లిన కట్టా రామచంద్రారెడ్డి
» గుడ్సా ఉస్సెండి, విజయ్, వికల్ప్ పేర్లతో ప్రసిద్ధి
» అంచలంచెలుగా కేంద్ర కమిటీ సభ్యుడి దాకా..

సిద్దిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బడిలో పాఠాలు చెప్పిన మాస్టారు బడితెను వదిలి బందూకు పట్టారు. రేపటి పౌరులను తీర్చిదిద్దడం కంటే నేటి సమాజాన్ని చక్కదిద్దడమే తక్షణ కర్తవ్యంగా అజ్ఞాతంలోకి వెళ్లారు. మూడున్నర దశాబ్దాల అలుపెరుగని పోరాటానికి సెలవు పలుకుతూ అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ అలియాస్ రాజు దాదా, గుడ్సా ఉసెండీ, విజయ్, వికల్ప్. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లికి చెందిన కాతా వజ్రవ్వ, మల్లారెడ్డి దంపతులకు జన్మించిన రామచంద్రారెడ్డి.. భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. అప్పట్లోనే శాంతి అనే మహిళను కులాంతర వివాహం చేసుకున్నారు. 1989లో విప్లవోద్యమానికి ఆకర్షితులై భార్యతో కలిసి అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. వీరికి కొడుకు, కూతురు ఉండగా, కొద్దిరోజుల తర్వాత ఆయన భార్య శాంతి లొంగిపోయారు. ప్రస్తుతం పిల్లలతో కలిసి ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. మావోయిస్టు పార్టీలో గుడ్సా ఉస్సెండీ, విజయ్, వికల్ప్ పేర్లతో ఈస్ట్ బస్తర్ ప్రాంతంలో అనేక కార్యక్రమాలు చేపట్టిన రామచంద్రారెడ్డి.. కొన్నేళ్ల క్రితమే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనపై రూ.40లక్షల రివార్డు ఉంది. రామచంద్రారెడ్డి మృతితో తీగలకుంటపల్లిలో విషాదం నెలకొంది. రామచంద్రారెడ్డి మృతదేహాన్ని తీసుకురావడానికి కుమారుడు రాజు, ఇతర బంధువులు.. ఛత్తీస్‌గఢ్ తరలివెళ్లారు.

కోవర్టు ఆపరేషన్‌లో భాగమే ఎన్‌కౌంటర్

» న్యాయ విచారణ చేపట్టాలి: పౌరహక్కుల సంఘం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు మృతి చెందడంపై పౌర హక్కుల సంఘం అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ ఎన్‌కౌంటర్ ఓ బూటకమని, కోవర్టు ఆపరేషన్‌లో భాగంగానే కేంద్ర కమిటీ సభ్యులను పోలీసులే కాల్చి చంపారని సంఘం నాయకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతరులు ఎవ్వరూ మరణించకుండా, పటిష్ట భద్రత ఉండే కేంద్ర కమిటీ సభ్యులు ఇద్దరు మాత్రమే మరణించినట్లు పోలీసులు వెల్లడించడం విడ్డూరంగా ఉందన్నారు. 21నెలలుగా మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం అనైతిక యుద్ధం సాగిస్తోందని పౌరహక్కుల సంఘం నేత గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, ప్రజాసమస్యలపై మోదీ ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభాకర్‌రావు మధ్యంతర రక్షణను రద్దు చేయండి

» విచారణకు సహకరించడం లేదు..
» న్యాయమూర్తుల ఫోన్లనూ ట్యాప్ చేశారు
» ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంలో తెలంగాణ ప్రభుత్వం వాదనలు
» అంతా అబద్ధం.. వీడియోలు చూడండి
» ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది వాదనలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న రాష్ట్ర నిఘా విభాగం (ఎస్ఐబీ) మాజీ అధిపతి టి. ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదని సుప్రీం కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ప్రభాకర్ రావు మధ్యంతర రక్షణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. అయితే.. ఇదంతా రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని, ప్రభాకర్ రావు విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని, కావాలంటే.. విచారణకు సంబంధించిన వీడియో రికార్డులను పరిశీలించాలని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐబీకి నేతృత్వం వహించిన ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ ఇస్తేనే భారతదేశానికి తిరిగి వస్తానని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మే 9న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడంతో ఆయన దేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పిటిషన్ మరోసారి సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూత్ర, ప్రభాకర్ రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు హాజరయ్యారు. తెలంగాణలో రాజకీయ నాయకుల ఫోన్లు మాత్రమే కాదని, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లు సైతం ట్యాప్ చేశారని తెలంగాణ ప్రభుత్వం తరఫున తుషార్ మెహతా, లూత్ర వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు కోర్టు ఇచ్చిన రక్షణను దుర్వినియోగం చేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు సంస్థలకు అప్పగించడానికి ముందే మూడు ఫోన్లు, ఒక అధికారిక ల్యాప్‌టాప్‌లోని మొత్తం డేటాను ఫ్యాక్టరీ రీసెట్ ద్వారా తొలగించారని తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బెయిల్ పిటిషన్లపై విచారణ జరుగుతున్న సమయంలోనే ఆయన సాక్ష్యాలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దీనిని సాధారణ కేసులా పరిగణించవద్దని, ఇది అత్యంత తీవ్రమైన కేసు అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాగా తదుపరి విచారణను ధర్మాసనం అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు ప్రభాకర్ రావుకు మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది. ప్రభాకర్ రావు పూర్తిగా విచారణకు సహకరించాలని, అధికారులు ఎప్పుడు పిలిచినా వెళ్లాలని ఆదేశించింది.

కలకలమా.. కకావికలమా!

మావోయిస్టు పార్టీలో అంతర్గత సంక్షోభం!?.. సోనూ స్థానంలో అధికార ప్రతినిధిగా 'కోసా'

» వికల్ప్‌తో కలిసి 'సాయుధ పంథా'పై తొలి ప్రకటన
» అది వెలుగు చూడకముందే ఇద్దరూ ఎన్‌కౌంటర్
» తాజా పరిణామాలపై భిన్న వాదనలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకరు మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధిగా ఇటీవలే ఎన్నికైన నాయకుడు! మరొకరు పార్టీ అగ్రనేత! 'సాయుధ పోరాటమే మా పంథా' అని తేల్చిచెబుతూ ఇద్దరూ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే... అది వెలుగు చూడకముందే వారిద్దరూ ఎన్‌కౌంటర్ అయ్యారనే వార్త బయటి ప్రపంచానికి తెలిసింది. ఆ ఇద్దరు అగ్రనేతలే... కోసా (కడారి సత్యనారాయణ), వికల్ప్ (కట్టా రామచంద్రారెడ్డి). వీరిద్దరూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులే. 'సాయుధ పోరాటాన్ని వదిలిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ ఇటీవల పార్టీ అగ్రనేత సోనూ విడుదల చేసిన ప్రకటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తదుపరి పరిణామాలతో సోనూను పార్టీ అధికార ప్రతినిధిగా తప్పించి... ఆ స్థానంలో కోసా అలియాస్ కడారి సత్యనారాయణను నియమించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఆయన వికల్ప్ (కట్టా రామచంద్రా రెడ్డి)తో కలిసి 'అభయ్' పేరుతో ఈనెల 20వ తేదీతో (శనివారం) ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సోనూ ప్రకటనను ఖండిస్తూ లేఖను రాశారు. ఆ ప్రకటన పూర్తిగా వెలుగు చూడకముందే... వికల్ప్, అభయ్ ఎన్‌కౌంటర్‌లో మరణించడం గమనార్హం.

అసలేం జరుగుతోంది...

అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ... మావోయిస్టు పార్టీ 'సాయుధ పోరాటమే' పంథాగా కొనసాగుతోంది. ఇప్పుడు తొలిసారి ఆ ప్రాథమిక సూత్రంపైనే విభేదాలు రాజుకున్నాయి. కొందరు రాజీబాట పట్టగా... ప్రాణంపోయినా పోరాడాల్సిందే అని మరికొందరు తేల్చిచెబుతున్నారు! స్వయనా కేంద్ర కమిటీ లోనే రెండు భిన్న వాదనలు మొదలయ్యాయి. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ 'సాయుధ పోరాట విరమణ' వైఖరి తీసుకున్నారు. అధికార ప్రతినిధి హోదాలో 'అభయ్' పేరిట ఆయన దీనిపై ప్రకటన చేశారు. అంతకు ముందు పార్టీకి ఆయన 6 పేజీల లేఖ రాశారు. అందులో పార్టీ వైఫల్యాలను ప్రస్తావించారు. మరో వర్గం అంటే... గణపతి, మల్లారాజిరెడ్డి, ప్రసాదరావు, తిప్పిరి తిరుపతి, కోసా (కడారి సత్యనారాయణ), వికల్ప్ (కట్టా రామచంద్రారెడ్డి) తదితరులు సాయుధ పోరాట మార్గమే సరైన పంథా అని నమ్ముతున్నారు. ఇటీవలి కాలంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సమావేశాలూ జరుపుకోలేని పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో సోనూ తన వాదనను ప్రకటన రూపంలో విడుదల చేసి ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన వాదనను బలపరిచే మరో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి సోనూ ప్రత్యేకంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. మూల సిద్ధాంతానికి విరుద్ధంగా, కేంద్ర కమిటీతో చర్చించకుండా సోనూ చేసిన ప్రకటనను పార్టీ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఆయనను అధికార ప్రతినిధి హోదా నుంచి తప్పించారని సమాచారం. ఆయన స్థానంలో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు కడారి సత్యనారాయణ(కోసా)ను ఎంపిక చేశారని తెలిసింది. ఈనెల 20వ తేదీతో మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట కోసా, దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ అధికార ప్రతినిధి హోదాలో వికల్ప్(కట్టా రామచంద్రారెడ్డి) ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. సోనూ చర్యను వారు తీవ్రంగా ఖండించారు. సోనూది పార్టీ ద్రోహమని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిచర్చలు జరగాలని తాము కోరుకుంటున్నామంటూనే సాయుధ పోరాటం కొనసాగించి తీరుతామని ఆ ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. తీరా చూస్తే... వారి ప్రకటన ఇంకా మీడియాకు చేరకముందే, 48 గంటల వ్యవధిలోనే ఉమ్మడి ప్రకటన చేసిన ఆ ఇద్దరు నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

ఒకే చోట ఎలా?

తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఒకేచోట చేరడం జరిగే పని కాదని కొందరి అభిప్రాయం. అంటే... వారి కదలికల గురించి పోలీసు బలగాలకు ముందే తెలిసి ఉంటుందని, పార్టీలో ప్రస్తుతం నెలకొన్న 'అలజడి'కీ, ఇద్దరు అగ్ర నేతల కదలికలు బయటికి పొక్కడానికీ మధ్య సంబంధం ఉండొచ్చునని అనుమానిస్తున్నారు.

అది కోవర్టు ఆపరేషన్

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ(కోసా), కట్టా రామచంద్రారెడ్డి (వికల్ప్)లను కోవర్టు ఆపరేషన్‌లో భాగంగా చంపేశారని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపించింది. ఆ ఎన్‌కౌంటర్ బూటకమని కమిటీ ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆయుధాలు దించేది లేదు!

» సోనూది ఉద్యమ ద్రోహమే
» మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటన

సోనూ ప్రకటనను తీవ్రంగా ఖండిస్తూ అభయ్, వికల్ప్ పేరిట ఈనెల 20వ తేదీన వెలువడిన ప్రకటనలోని ముఖ్యాంశాలివి...

"సాయుధ పోరాటమే పార్టీ విధానం. దానికే కట్టుబడి ముందుకు సాగుతాం. అలాగే... శాంతి చర్చలను కూడా బలంగా కోరుకుంటున్నాం. శాంతి చర్చలను సులభతరం చేసే ప్రయత్నాలకు ప్రతిస్పందనగా మా పార్టీ ప్రధాన కార్యదర్శి, అమరవీరుడు బస్వరాజు ఆయుధాలు విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారని సోనూ చేసిన ప్రకటన సత్యాన్ని వక్రీకరించడమే. ఆయుధాలు విడిచిపెట్టేందుకు అందరి అభిప్రాయాలను కోరడం పార్టీని విచ్ఛిన్నం చేయడానికి చేసిన దుష్టకుట్ర. దీనిని విరమించుకోవాలని సోనూను కోరుతున్నాం. పార్టీ సాయుధ విప్లవ పంథా ఓడిపోయిందని, అనేక వ్యూహాత్మక, అతివాద తప్పిదాల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని సోనూ రాశారు. ఈ విప్లవ విధానాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. పార్టీ విధానం తప్పయితే, ఆయన ప్రత్యామ్నాయ విధానాన్ని రూపొందించి అంతర్గత చర్చ ప్రారంభించవచ్చు. కానీ, ఆయన అలా చేయడానికి ఇష్టపడటం లేదు. ఆయుధాలు వీడటం అంటే శత్రువుకు లొంగిపోవడమే. సోనూ, అతని సహచరులు శత్రువుకు లొంగిపోవాలనుకుంటే లొంగిపోవచ్చు. అలా లొంగిపోవాలనుకుంటే వారి వద్ద ఉన్న ఆయుధాలను పార్టీకి అప్పగించాలి. లేదంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని పీఎల్‌జీఏను కోరుతున్నాం."

ఆర్ఆర్ఆర్ బాధితులూ.. స్థానిక ఎన్నికలను బహిష్కరించండి: కేటీఆర్

» కాంగ్రెస్ కూల్చిన ఇళ్లను కట్టిస్తానని హామీ

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) బాధితులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ వల్ల నష్టపోయిన నల్గొండ, సూర్యాపేట జిల్లాలతో పాటు గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన బాధితులు సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను బహిష్కరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివస్తాయన్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను అడ్డుపెట్టుకొని బుల్డోజర్ పాలన సాగిస్తున్నారని, పేదల ఇళ్లు కూల్చి పెద్దలను మాత్రం వదిలేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ బోరబండ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కూల్చిన ఇళ్లను కట్టించి ఇచ్చే బాధ్యత తనదని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.